ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 5, ఆగస్టు 2025



తర్లుపాడు వద్ద కంది సాగుకోసం దున్ని వర్షం లేక విత్తనం వేయకుండా ఉన్న పొలం (ఇన్‌సెట్‌లో) దోర్నాలలో వర్షాభావంతో ఎండిపోతున్న పత్తి పైరు

# సాగుకు ప్రతికూలం

జిల్లాలో విభిన్న వాతావరణంతో రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. నాలుగైదు రోజులు భారీవర్షాలు, ఆతర్వాత బెట్ట తీస్తుండటంతో సాగు కష్టంగా మారింది. ప్రస్తుత ఖరీఫ్ ప్రతికూలంగా సాగుతోంది. సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా కనీసం 15శాతం విస్తీర్ణంలో కూడా పైర్లు సాగుకు నోచుకోలేదు. చాలాచోట్ల విత్తనం పడలేదు. ఆగస్టు వచ్చినా బెట్ట వాతావరణం కొనసాగుతోంది. దీనికితోడు ఎండల తీవ్రత అధికంగా ఉంటోంది. ముందుగానే సాగర్ నీరు సరఫరా చేయడం ఆయకట్టు రైతుల్లో కాస్తంత పంటల సాగుపై నమ్మకం కలిగిస్తున్నప్పటికీ మెట్టప్రాంతంలో వర్షాధారంపై ఆధారపడిన వారు మాత్రం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికే వేసిన పైర్లు వాడుముఖం పడుతుండటంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

» సీజన్ ప్రారంభమై రెండు నెలలు » 15శాతం విస్తీర్ణంలో కూడా పడని విత్తనం

- కీలక సమయంలో బెట్ట వాతావరణం
- వేసవిని తలపిస్తున్న ఎండలు
- వర్షాధార ప్రాంతంలో వేసిన పైర్లు వాడుముఖం
- ఆందోళన చెందుతున్న రైతులు
- సాగర్ నీటిపైనే కాస్తంత నమ్మకం

ఒంగోలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతికూల వాతావరణంతో జిల్లాలో ఖరీఫ్ సీజన్ సాగు ముందుకు సాగడం లేదు. సాధారణంగా ఈ సీజన్‌లో లక్షా 92వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు వేస్తారు. అందులో ఉద్యాన శాఖ పరిధిలోని మిర్చి, కూరగాయలు, పశుగ్రాసం ఇతరత్రా పంటలు పోను వ్యవసాయశాఖ పరిధిలో లక్షా 30వేల హెక్టార్లలో సాగవుతాయి. సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తయినా కేవలం 17,285 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. అంటే వ్యవసాయ శాఖ పరిధిలో ఉండే ఖరీఫ్ సాధారణ విస్తీర్ణంలో కనీసం 15 శాతం కూడా ఈ రెండు నెలల్లో విత్తనం పడలేదు. ప్రస్తుతం పెరిగిన ఎండలు, బెట్ట

మిగతా 6వ పేజీలో

## రోహిణిలో వానలు.. తర్వాత ఎండలు

ఎండలు మండే రోహిణి కార్తెలో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసి అనంతరం ఎండలు మండిపోతున్నాయి. మేలో 53.0 మి.మీ సాధారణ వర్షపాతానికి ఏకంగా 103 మి.మీ కురిసింది. సాగుకు ఉత్సాహంగా సిద్ధమైన రైతులు భూములను సిద్ధం చేశారు. ఆ తర్వాత జూన్‌లో బెట్ట వాతావరణం నెలకొంది. ఆ నెలలో 58 మి.మీ సాధారణ వర్షపాతం కాగా దాదాపు 35శాతం లోటుతో కేవలం 37.4 మి.మీ మాత్రమే పడింది. అది కూడా పంటల సాగుకు ఉపకరించలేదు. ఇక జూలైలో 87.9 మి.మీ సాధారణ వర్షపాతానికి 102.2 మి.మీ కురిసినా అందులో మూడొంతులకుపైగా జూలై 20 తర్వాత మూడు, నాలుగు రోజుల్లో పడింది. ఆ లోపు పంటల సాగు ముందుకు సాగకపోగా ఆ వర్షాల అనంతరం రైతులు పంటల సాగు కోసం భూములను సిద్ధం చేయడం ప్రారంభించారు. అయితే తిరిగి పది రోజులుగా జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో వాన జాడ కరువైంది. ఎండలు మండిపోతున్నాయి.



కంభంపాడులో ఆక్రమణకు గురైన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ భూమి

# దేవాంతకులు

- యథేచ్ఛగా ఆలయ భూముల ఆక్రమణ
- దర్జాగా పంటల సాగు
- ఏళ్లుగా అనుభవిస్తున్న కబ్జారాయుళ్లు
- కొన్నిచోట్ల వివరాలు కూడా తెలియని వైనం
- అనేక గ్రామాల్లో దీనావస్థలో గుడులు

త్రిపురాంతకం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో దేవాలయాల ఆస్తులకు రక్షణ కరువైంది. వందల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయి. వీటిలో పాగా వేసిన వారు ఏళ్ల తరబడి దర్జాగా పంటలు సాగు చేసుకుంటున్నారు. ఆలయాలకు పైసా కౌలు చెల్లించకుండా సొంత భూములుగా వాడుకుంటున్నారు. దీంతో రూ.కోట్ల ఆస్తులున్న ఆలయాలు కూడా ఆలనాపాలనా కరువై దీనావస్థకు చేరుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం మౌనం వహిస్తున్నారు. ఆక్రమణదారుల నుంచి అమ్యామ్యాలు పుచ్చుకుని మిన్నకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కబ్జాదారుల్లో కొందరు ఏకంగా ఆ భూములు తమవే అంటూ కోర్టులను ఆశ్రయిస్తుండగా వాటిపై మేమేమి చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ అధికారులు సమాధానం దాటవేస్తున్నారు.

### ఆలయ భూముల్లో బత్తాయి మొక్కలు, కంది సాగు

ఎర్రగొండపాలెం మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలో ఉన్న లక్ష్మీచెన్నకేశవ దేవస్థానానికి పెద్దారవీడు మండలంలోని కంభంపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 35లో 4.31 ఎకరాల భూమి ఉంది. అందులో కొందరు పాగా వేశారు. బత్తాయి మొక్కలు నాటి కంది పైరును సాగు చేసుకుంటున్నారు. దీనిపై పలుమార్లు కొందరు ఫిర్యాదులు చేసినప్పటికీ ఈ భూముల వ్యవహారం కోర్టులో ఉన్నందున అక్కడే తేలాలని దేవదాయశాఖ అధికారులు చెప్తున్నారు. ఇది దేవదాయశాఖకు చెందిన భూమిగానే ప్రస్తుతం కూడా రెవెన్యూ అడంగల్‌లో ఉంది. అయితే కొందరు వ్యక్తులు ఈ భూమిని 1950లోనే తమకు అప్పట్లో పూజారి విక్రయించారని రికార్డులు చూపి కోర్టును ఆశ్రయించడంతో ఇప్పటికీ ఆ వివాదం నడుస్తూనే ఉంది. ఎర్రగొండపాలెం మండలంలోని

మిగతా 6వ పేజీలో



## వానొస్తే.. వెత!

మండల కేంద్రమైన ఎర్రగొండపాలెంలో కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్లు జలమయమవుతున్నాయి. పలుచోట్ల కాలువలు లేకపోవడం, ఉన్న చోట్ల పూడిక పేరుకుపోవడంతో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. దీంతో వాహనదారులతోపాటు పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ఒంగోలువారి వీధిలో కాలువల్లో నీరు ముందుకు ప్రవహించే వీలులేక రోడ్డుపై చేరింది. ఇందిరానగర్‌లో కాలువలు లేకపోవడంతో మోకాటి లోతున నిలిచిపోయింది. ఆ సమయంలో స్కూల్ వదలడంతో ఒంగోలువారి వీధి నుంచి ఇళ్లకు వెళ్లే విద్యార్థులు అవస్థపడ్డారు.

- ఆంధ్రజ్యోతి, ఎర్రగొండపాలెం

# వారి నిర్లక్ష్యం.. వీరికి కష్టం..!



వ్యాపారులతో మాట్లాడుతున్న ఆర్ఐలు శ్రీను, కల్యాణి

ఒంగోలులోని కూరగాయల మార్కెట్‌లో ఇష్టారాజ్యం నెలకొంది. అద్దె పేరుతో దుకాణాలను లీజుకు తీసుకున్న కొందరు వ్యాపారులు వాటిని అమ్మేసుకుంటుండగా, మరికొందరు అవి తమ సొంతమైనట్లు ఇష్టమొచ్చినట్టు మార్చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్తులు పరుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. ఇప్పటికే కార్పొరేషన్ షాపుల కేటాయింపుల్లో గ'లీజు' వ్యవహారం నడుస్తోంది. తాజాగా ఊరచెరువులోని షాదీఖానా ఎదురు కోల్డ్‌స్టోరేజీ భవనాన్ని లీజుకు తీసుకున్న వ్యక్తి లాడ్జీగా మార్చేస్తున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు పనులను అడ్డగించారు. అయినప్పటికీ లీజుదారుడు పలుకుబడితో భవనాన్ని తనకు నచ్చినట్టు మార్చుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యేకించి గతంలో నిర్మించిన గదులను తొలగించడం చర్చనీయాంశమైంది

- వైసీపీ హయాంలో కార్పొరేషన్ రెవెన్యూ విభాగం ఇష్టారాజ్యం
- రూ.12కోట్ల మేర పేరుకుపోయిన కూరగాయల మార్కెట్ షాపుల అద్దెలు
- దొరకని లీజుదారుల అడ్రస్‌లు... వసూళ్లకు కొత్త తలనొప్పులు
- గత ఆర్ఐల నిర్లక్ష్యంపై చర్యలు శూన్యం

ఒంగోలు, కార్పొరేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ హయాంలో ఒంగోలు కార్పొరేషన్‌లో ఇష్టారాజ్య పాలన నడిచింది. నగర పాలక సంస్థ ఖజానాకు ప్రధాన ఆదాయ వనరు అయిన రెవెన్యూలో అలవిమాలిన నిర్లక్ష్యం కొనసాగింది. ఊరచెరువులోని దామోదరం సంజీవయ్య కూరగాయల మార్కెట్ వైపు కనీసం కన్నెత్తి చూడకపోవడంతో భారీగా బకాయిలు పేరుకుపోయాయి. ప్రస్తుతం అధికారుల లెక్క ప్రకారం రూ.12 కోట్ల వరకూ అద్దెలు రావాల్సి ఉంది. కార్పొరేషన్ షాపుల అద్దె బకాయిలపై సోమవారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన 'అలా వదిలేశారు' కథనంపై అధికారులు స్పందించారు. వసూళ్లకు రంగంలోకి దిగారు. మొండి బకాయిదారులకు హెచ్చరికలు జారీచేయడంతోపాటు, పెద్ద మొత్తంలో

మిగతా 6వ పేజీలో



అనుమతులు లేకుండా నిర్మించిన దుకాణాలు




## వాగుల ఆక్రమణ

పొదిలి రోడ్డులో చెక్‌పోస్టు వద్ద వాగును ఆక్రమించి చేస్తున్న నిర్మాణాలు

- చెరువు అలుగు భూములనూ వదలని వైనం
- పట్టించుకోని అధికారులు

7



షాపులపైన చేపట్టిన అనధికార నిర్మాణాలు

# అంతా మా ఇష్టం..!

కూరగాయల మార్కెట్‌లో 'గ'లీజు' బాగోతం

- అనుమతులు తుంగలో తొక్కి సొంత కట్టడాలు
- నిబంధనలకు విరుద్ధంగా షాపులు, లాడ్జి నిర్మాణం
- ఒంగోలు కార్పొరేషన్ ఖజానాకు భారీగా గండి

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఊరచెరువులో ఉన్న దామోదరం సంజీవయ్య కూరగాయల మార్కెట్ షాపులపై కార్పొరేషన్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీన్ని ఆసరా చేసుకొని కొన్ని దుకాణాల యజమానులు రెచ్చిపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. అందుకు కోల్డ్‌స్టోరేజీ భవనం లీజుకు తీసుకున్న వ్యక్తి ప్రస్తుతం దాన్ని పూర్తిగా మార్చి షాపులు, లాడ్జీగా నిర్మిస్తుండటం నిదర్శనంగా నిలుస్తోంది. మార్కెట్‌లో షాపుల లీజు, అద్దెలకు కేటాయింపులపై కార్పొరేషన్‌కు పూర్తి హక్కులు ఉంటాయి. ప్రకారం సదరు కోల్డ్‌స్టోరేజీ లీజుదారుడికి 1,700 చదరపు గదుల్లో ఉన్న భవనాన్ని కేటాయించారు. అందుకు గాను లీజుదారుడు ప్రతినెలా 5వ తేదీ లోపు రూ.36వేలు చెల్లించాలి. అద్దె చెల్లింపులో ఆలస్యమైతే రూ. 2.50 చొప్పున వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాకుండా కేటాయించిన భవనంలో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయకూడదు. ఇతరులకు

మిగతా 6వ పేజీలో

# సంక్షేమం పేరుతో దోచేశారు!

- ఐదేళ్ల వైసీపీ పాలనలో అడ్డగోలుగా అవినీతి
- నాసిరకం మద్యంతో ఎంతోమంది ప్రాణాలు తీశారు
- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి
- ఘనంగా గిద్దలూరు, కంభం ఏఎంసీ పాలకవర్గాల ప్రమాణ స్వీకారం



మంత్రులు గొట్టిపాటి, డోలా, ఎమ్మెల్యేలతో గిద్దలూరు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం

గిద్దలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సంక్షేమం పేరును అడ్డం పెట్టుకుని రాష్ట్రం మొత్తాన్ని అడ్డగోలుగా దోచేశారని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో గిద్దలూరు, కంభం మార్కెట్ కమిటీల చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ వైసీపీ పాలనలో నాసిరకం మద్యం ప్రవేశపెట్టి ఎంతో మంది చనిపోయేందుకు, వేల మంది రోగాలబారిన పడేందుకు కారణమయ్యారని విమర్శించారు. అంతేగాక వేల కోట్ల రూపాయలను దోచుకున్నారని ఆరోపించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాగానే అటు సంక్షేమం, ఇటు అభివృద్ధి చేపడుతూనే ఇచ్చిన హామీలను వరుసగా నెరవేరుస్తోందన్నారు. ఇంత చేస్తున్నా వైసీపీ నాయకులు వారు చెప్పే అబద్ధాలను నిజం చేయాలన్న ఉద్దేశంతో ప్రజల్లోకి వెళుతూ కలుషితం చేస్తున్నారన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో 64 లక్షల మందికి ఏటా రూ.34వేల కోట్లతో పింఛన్లు ఇస్తున్నామని మంత్రి చెప్పారు. తల్లికి

మిగతా 6వ పేజీలో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలోచనాపరుల వేదిక ప్రతినిధి, రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు

# వెలిగొండ పనులు వెంటనే పూర్తి చేయాలి

6లో

- నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి
- రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వెంకటేశ్వరరావు

# సాగుకు ప్రతికూలం

(5వ పేజీ తరువాయి)

వాతావరణంతో వేసిన పైర్లు కూడా వాడుముఖం పడుతున్నాయి. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంటలుగా కంది, వరి, పత్తి, సజ్జ వేస్తారు. అందులో ఒక్క కంది పంటనే దాదాపు 68వేల హెక్టార్లకుపైగా విస్తీర్ణంలో సాగు చేస్తారు. అంటే ఖరీఫ్‌లో వ్యవసాయశాఖ పరిధిలో వేసే పంటల మొత్తం విస్తీర్ణం లక్షా 30వేల హెక్టార్లలో ఒక్క కంది పంటే సుమారు 53శాతం ఉంటుంది. అలాగే 27వేల హెక్టార్లు (25శాతం) పత్తి, 12,826 హెక్టార్లు (10శాతం) వరి, మరో 7,020 హెక్టార్ల(6శాతం) విస్తీర్ణంలో సజ్జ వేస్తారు. అంటే మొత్తం సాధారణ విస్తీర్ణంలో 94శాతం విస్తీర్ణంలో ఈ నాలుగు పంటలనే సాగు చేస్తారు. అందులో కంది, పత్తి పంటలు ప్రధానమైనవి.

**వాడుముఖం పట్టిన పైర్లు**

ఈ ఏడాది ఖరీఫ్ పంటల సాగుకు వాతావరణం అనుకూలించలేదు. నిజానికి ఈ సమయానికి ప్రధాన పంటలైన కంది, పత్తి సగం విస్తీర్ణంలో వేసి మిగిలిన దానిలో ముమ్మరంగా విత్తనం వేస్తుంటారు. అయితే ఇప్పటి వరకూ కంది కేవలం 2శాతం విస్తీర్ణంలో కూడా సాగుకు నోచుకోలేదు. పత్తి 26శాతం విస్తీర్ణంలో వేశారు. ప్రస్తుతం నెలకొన్న బెట్ట వాతావరణం, పెరిగిన ఎండల తీవ్రతతో చాలాచోట్ల పత్తి వాడుముఖం పట్టింది. వాస్తవానికి ఈ ఏడాది ఖరీఫ్‌కు తొలుత పూర్తి సానుకూల పరిస్థితి నెలకొంది. జూన్ ఆరంభం నుంచి ఈ సీజన్ కాగా మే రెండో పక్షంలో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి.

**40డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు**

మూడు నాలుగు రోజులుగా జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లో 37 నుంచి 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం కూడా అలాంటి పరిస్థితే నెలకొంది. దీంతో ఇప్పటికే వేసిన పత్తి, ఇతర పంటలు కూడా వాడుముఖం పడుతున్నాయి. మొత్తం ప్రస్తుత సీజన్ వ్యవసాయశాఖ పరిధిలో లక్షా 30వేల హెక్టార్లలో ఈ సమయానికి కనీసం సగం విస్తీర్ణంలో సాగు కావాల్సి ఉన్నా 15శాతం కూడా విత్తనం పడలేదు. అంతేకాక ప్రస్తుతం బెట్ట వాతావరణంతో మెట్ట ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక ఉద్యానశాఖ పరిధిలో ప్రధానమైన మిర్చి పరిస్థితి కూడా అలాగే ఉంది. ఈ సీజన్‌లో సుమారు 26వేల హెక్టార్లలో మిర్చి సాగు చేస్తారు. అయితే ఇప్పటివరకు అందులో 20శాతం కూడా నాట్లు పడకపోగా వేసిన చోట కూడా ఎండుముఖం పట్టాయి. సాగర్ ఆయకట్టు ప్రాంతంలో మాత్రం కొంత ఆశాజన పరిస్థితి కనిపిస్తోంది. ఈ ఏడాది కృష్ణమ్మ వరవళ్లతో నెలన్నర ముందుగానే సాగర్ డ్యామ్ నుంచి నీటి విడుదల చేయగా ఇప్పటికే ఆ నీరు జిల్లాకు చేరింది. దీంతో సాగుపై నమ్మకంతో ఆయకట్టు రైతులు పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు.

# అంతా మా ఇష్టం..!

(5వ పేజీ తరువాయి)

సబ్ లీజుకు ఇవ్వకూడదు. అలా జరిగితే ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా లీజు రద్దు చేసి షాపులను ఖాళీ చేయిస్తారు. వరుసగా మూడు నెలలు అద్దె చెల్లించకపోయినా ఎలాంటి నోటీసు లేకుండానే ఖాళీచేయించే అధికారం కార్పొరేషన్‌కు ఉంది. లీజుదారుడు మాత్రమే వ్యాపారం చేసుకుంటూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేయించుకోవాలి. ఆతర్వాత మార్కెట్ ధర ప్రకారం 33.33శాతం అద్దెను పెంచి చెల్లించాలి. కాగా లీజు కేటాయింపు, రద్దు విషయంలో పూర్తి హక్కులు కార్పొరేషన్ కౌన్సిల్ వారికి ఉంటాయి. షాపును తిరిగి స్వాధీనం చేసుకునే సమయంలో కేటాయించినప్పుడు ఎలా ఉందో అలాగే తిరిగి ఇవ్వాలి. అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి మార్పులు, చేర్పులు చేయకూడదు. అలా చేస్తే లీజు రద్దుకు కార్పొరేషన్‌కు పూర్తి అధికారం ఉంటుంది.

**యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన**

కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా కోల్డ్‌స్టోరేజీ భవన గదులు తొలగించి అదనపు అంతస్థుల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన కౌన్సిల్ సమావేశం మార్కెట్‌లోని కోల్డ్‌స్టోరేజీ భవనం లీజుకు కేటాయిస్తూ ఆమోదం తెలిపింది. గతంలో ఆ భవనాన్ని ఓ కార్ఖానాకు అద్దెకు ఇచ్చారు. లీజుదారుడు ఖాళీ చేయడంతో కొద్దిరోజులు పారిశుధ్య విభాగం మస్టర్ పాయింట్‌గా వినియోగించుకున్నారు. అయితే ఆ భవనాన్ని కౌన్సిల్ ఆమోదం మేరకు అప్పటి వరకు రూ.51వేలు ఉన్న అద్దెను తగ్గించి రూ.36వేలకు ఓ వ్యక్తికి లీజుకు ఇచ్చారు. అతను నిబంధనల మేరకు మాత్రమే దాన్ని వినియోగించుకోవాల్సి ఉంది. కానీ ఆయన ఏకంగా ఎక్కువ మొత్తం విస్తీర్ణం స్వాధీనం చేసుకుని అందులో మరో ఆరు షాపులు నిర్మిస్తున్నాడు. అంతేకాకుండా వాటిపైన కూడా నిర్మాణాలు చేపట్టి లాడ్జిగా మార్చేస్తుండడం విమర్శలకు విస్తోంది. ఈ తరహా నిర్మాణాలు చేయడం ద్వారా ఆరు షాపులకు అద్దెల రూపంలో నెలకు రూ.లక్ష, ఆపైన నిర్మించే లాడ్జి ద్వారా మరో రూ.2లక్షలు ఆదాయం రాబట్టవచ్చని లీజుదారుడు భావిస్తున్నట్లు సమాచారం.

# వారి నిర్లక్ష్యం.. వీరికి శాపం

(5వ పేజీ తరువాయి)

బాకీ ఉండి అద్దెలు చెల్లించని దుకాణాలకు తాళాలు వేశారు. గత ప్రభుత్వంలో కార్పొరేషన్ రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంతో నేడు భారీగా బకాయిలు పేరుకుపోయాయి. వాటి వసూలుకు వెళ్లిన ప్రస్తుత రెవెన్యూ అధికారులకు కొత్త తలనొప్పులు ఎదురవుతున్నాయి. కూరగాయల మార్కెట్‌లో 500కుపైగా షాపులు ఉండగా అందులో వందలోపు మాత్రమే అద్దెకు తీసుకున్న అసలైన వ్యాపారులు ఉన్నారు. మిగిలిన వాటిలో బినామీలు, సబ్ లీజుదారులు తిష్ఠవేశారు. మరికొందరు తాము షాపులను కొనుక్కున్నామని సమాధానమిస్తున్నారు. మరికొంతమంది ఇంత పెద్దమొత్తంలో బాకీలతో తమకేమి సంబంధం, కావాలంటే ఖాళీ చేస్తామని తేల్చిచెబుతున్నారు. అత్యధిక శాతం షాపుల్లో కార్పొరేషన్ రికార్డుల్లో పేర్లు ఉన్న వారు లేకపోగా, కనీసం వారి అడ్రస్‌లు కూడా దొరకని పరిస్థితి ఉంది. దీంతో షాపుల అద్దెల వసూలు అధికారులకు సమస్యగా మారింది.

**లెక్కల్లేవ్.. పత్రాల్లేవ్..!**

కార్పొరేషన్ రెవెన్యూ సెక్షన్‌కు సంబంధించిన ప్రధానమైన అద్దెల చెల్లింపులకు లెక్కలు.. పత్రాలు లేవని సమాచారం. ముఖ్యంగా కొంతమంది తాము అద్దెలు కట్టామని సమాధానమిస్తున్నారు. మరి కొందరు బినామీలు మాత్రం తమకు సంబంధం లేదని, లీజుదారుడికి నెలనెలా అద్దెలు చెల్లిస్తున్నామని వెల్లడిస్తున్నారు. అయితే గడిచిన ఐదేళ్లలో ఎవరు ఎంత అద్దెలు కట్టారు? ఏ నెలలో చెల్లించారు అన్నదానిపై స్పష్టత కొరవడింది. దుకాణ యజమానులు అద్దెలు చెల్లిస్తే ఆ డబ్బులు ఏమయ్యాయో కూడా తెలియని పరిస్థితి ఉంది. అయితే ఆ వివరాలపై ప్రస్తుత రెవెన్యూ సెక్షన్ సిబ్బంది పరిశీలన చేయగా, పూర్తిస్థాయిలో సమాచారం లభించలేదని తెలిసింది. వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు రెవెన్యూ సెక్షన్ కసరత్తు చేస్తుండగా, అందుకు సంబంధించిన పలు చెల్లింపులకు ఆధారాలు దొరకలేదని సమాచారం.

**గత ఆర్ఐల నిర్లక్ష్యంపై చర్యలు నిల్**

నాటి వైసీపీ పెద్దల ఆశీసులతో ఐదేళ్లు ఆడుతూ.. పాడుతూ ఆర్ఐలుగా పనిచేసిన వారు అందిన కాడికి దోచుకున్నారు. ఆపై కార్పొరేషన్ ఆదాయ వనరులపై నిర్లక్ష్యం చూపారు. దుకాణ యజమానులను చూసీచూడనట్లు వదిలేశారనే ఆరోపణలూ ఉన్నాయి. వారి నిర్లక్ష్యం కారణంగా నేడు కేవలం ఊరచెరువు మార్కెట్‌లోనే రూ.12 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇంతవరకు వారిపై ఎలాంటి చర్యలు లేకపోవడం, ఆ బకాయిల వసూలు బాధ్యత ప్రస్తుత రెవెన్యూ సిబ్బందిపై పడటంతో వారి పని మరింత కష్టంగా మారింది. మరోవైపు సాధారణ పౌర సేవలకు మరింత ఆటంకం ఎదురవుతుంది. దీంతో రోజువారీ రెవెన్యూ సేవలు ఆలస్యమవుతున్నాయి. అయితే ఇంత పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడానికి కారణం అయిన సిబ్బందిపై కనీసం చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**అద్దెలు చెల్లించని షాపులకు తాళాలు**

కార్పొరేషన్ షాపుల అద్దెల బకాయిలపై ఆంధ్రజ్యోతి సోమవారం ప్రచురించిన 'అలా వదిలేశారు' కథనంపై కమిషనర్ కె.వెంకటేశ్వరరావు సీరియస్‌గా దృష్టి సారించారు. బకాయిల వసూళ్లకు రెవెన్యూ విభాగం అధికారులను రంగంలోకి దింపారు. దీంతో ఆర్వో, ఆర్ఐలు మార్కెట్‌లో వ్యాపారులతో మాట్లాడారు. అద్దెలు చెల్లించాలని కోరారు. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన అద్దె బకాయిలపై నోటీసులు జారీచేయడంతోపాటు, త్వరితగతిన చెల్లించాలని తెలిపారు. ఇదిలాఉండగా పెద్ద మొత్తంలో బాకీ ఉన్న షాపులకు తాళాలు వేశారు. అద్దెలు చెల్లించకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్వో భాస్కర్‌తోపాటు, ఆర్ఐలు కల్యాణి, శంకరశెట్టి శ్రీను, క్రాంతికుమార్, నిరూప్ పాల్గొన్నారు.

# వెలిగొండ పనులు పూర్తి చేయాలి

**● నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి ● రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు**

మార్కాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రకాశం ప్రజలకు వరప్రదాయిని అయిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ఆలోచనాపరుల వేదిక ప్రతినిధి బృందం నాయకులు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో భాగమైన గొట్టిపడియ డ్యామ్, సొరంగ నిర్మాణ పనులను సోమవారం ఆలోచనాపరుల వేదిక ప్రతినిధి బృందం పరిశీలించింది. అనంతరం మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించి మూడు దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటికీ పూర్తికాకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ప్రాజెక్టు దేశంలో ఎక్కడాలేని విధంగా అతి తక్కువ నిధులతో కొన్ని లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే బృహత్తరమైన పథకం అన్నారు. మొదటి ఫేజ్ కింద రూ.2 వేల కోట్లు, రెండవ ఫేజ్ కింద రూ.2,500 కోట్లు కేటాయిస్తే ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందన్నారు. రూ.5 వేల కోట్లు కేటాయిస్తే పూర్తి అయ్యే ఈ ప్రాజెక్టు నిర్మాణంపట్ల ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. 2010లో గొట్టిపడియ, సుంకేసుల, కాకర్ల గ్యాపుల నిర్మాణం పూర్తయిందని, ప్రాజెక్టు పూర్తికాకపోవడంతో నిర్మాణానికి ఖర్చు చేసిన నిధులన్నీ వృథాగా పోయినట్టేనన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలన్నారు.

పశ్చిమ ప్రకాశంలో భూగర్భ జలాలు పూర్తిస్థాయిలో అడుగంటిపోయాయని, బోర్ల ద్వారా వచ్చిన నీటిని తాగడం ద్వారా ఫ్లోరైడ్ సమస్యతో ఈ ప్రాంత ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విశ్లేషకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కృష్ణా, గోదావరి నుంచి కొన్ని లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలో వృథాగా పోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా సంఘం అధ్యక్షులు భవాని ప్రసాద్, ప్రతినిధులు ఎమ్.చక్రవర్తి, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ నాయకులు అందె నాసరయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలన్నదే లక్ష్యం

**● సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి**
**● సింగరాయకొండ గురుకుల పాఠశాలలో ఐఐటీ, నీట్ సామగ్రి పంపిణీ**


విద్యార్థినులకు ఐఐటీ, నీట్ మెటీరియల్ అందజేస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే సీఎం నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం రాత్రి స్థానిక గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు నారాయణ విద్యా సంస్థల సహకారంతో అందజేసిన ఐఐటీ, నీట్ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2017 ఏడాదిలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు తొలిసారిగా గురుకులాల్లో మూడుచోట్ల ఐఐటీ, నీట్ సెంటర్లను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. మళ్లీ ఆయన సూచనలతో ఇప్పుడు వాటిని మూడు నుంచి పదికి పెంచమన్నారు. అందులో ఒకటి సింగరాయకొండ గురుకుల పాఠశాలలో ఐఐటీ, నీట్ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేశామని తెలిపారు. ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లో విద్యార్థులకు తన కోరిక మేరకు నారాయణ విద్యాసంస్థల తరపున పురపాలకశాఖ మంత్రి నారాయణ ఉచితంగా మెటీరియల్స్ అందజేస్తున్నారని తెలిపారు.

ఐఐటీ, నీట్ బోధించే లెక్చరర్లకు ట్రైనింగ్ ఇవ్వడానికి కూడా అంగీకరించినట్లు వివరించారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి ముందుకొచ్చిన మంత్రి నారాయణకు ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఐఐటీ, నీట్‌లో తృటిలో అర్హత కోల్పోయిన విద్యార్థులకు లాంగ్‌టార్మ్ కోచింగ్ ఇవ్వడానికి త్వరలో విజయవాడలో కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి స్వామి తెలిపారు.

## మద్యం మత్తులో వృద్ధుడు మృతి

మార్టూరు, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కాలువలో పడి వృద్ధుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని ద్రోణాదుల గ్రామంలోని బొబ్బేపల్లి రోడ్డులో సోమవారం చోటుచేసుకొంది. ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన మురికిపూడి విజయశేఖరరావు(64) అదే గ్రామానికి చెందిన వీరాంజనేయులు అనే వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై ద్రోణాదుల వచ్చాడు. అక్కడ గ్రామంలోని మద్యం దుకాణంలో మద్యం సేవించారు. అనంతరం వీరాంజనేయులు నాగండ్ల గ్రామానికి వెళ్లాడు. విజయశేఖరరావు మద్యం మత్తులో బహిర్భూమికి వెళ్లి కాలువలో పడి మృతిచెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుమారుడు షడక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## కూటమి ప్రభుత్వంతో ప్రజలకు పాట్లు

**● వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్**

చీరాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ పాలనతో నిరుపేద ప్రజలు పాట్లు పడుతున్నారని, సంక్షేమ పథకాల పంపిణీలో చిత్తశుద్ధి లేదని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 29వ వార్డులో 'బాబు షూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ తీరుపై పలు విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో పలువులు కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

**● రూ.2.08,960 నగదు స్వాధీనం ● 12 మంది జూదరుల అరెస్టు**

చీరాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల - కారంచేడు రోడ్డులోని పులగ కాలువ సమీపంలోని పేకాట స్థావరంపై చీరాల వన్‌టౌన్ సీఐ సుబ్బారావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈక్రమంలో 12 మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2,08,960 నగదును స్వాధీనం చేసుకున్నారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఈపూరుపాలెం(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఈపూరుపాలెం - స్టూవర్టుపురం స్టేషన్‌ల మధ్య సోమవారం ఉదయం చోటుచేసుకొంది. గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటే క్రమంలో రైలు ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.


కారంచేడు - కుంకలమర్రు మధ్య వంతెన మరమ్మతులు

## శరవేగంగా కొమ్మమూరు కాలువ ఆధునికీకరణ పనులు

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 4 (ఆంధ్ర జ్యోతి) : కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని కొమ్మమూరు కాలువ ఆధునీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషితో దశాబ్ధాలుగా మరమ్మత్తులకు నోచుకోని కొమ్మమూరు కాలువ పనుకు గ్రహణం వీడినట్లయ్యింది. కారంచేడు - కుంకలమర్రు గ్రామాల మధ్య కొమ్మమూరు కాలువ 78.685 కిలో మీటర్ల వద్ద సర్‌ఫ్లస్ ఎస్కేప్ షట్టర్లు, ఐరన్ ఛానెళ్ల పునరుద్ధరణ కోసం ఏలూరి కృషి ఫలితంగా రూ.21.98 లక్షల నిధు లను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం విడుద లైన నిధులతో కాలువ కట్టలు బలోపేతం చేయడం తోపాటు, గుర్రపు డెక్కను తొలగించే విధంగా పనులు చేపడుతున్నారు. ఈ ఆదునీకరణ వల్ల భారీ వర్షాలు, వరదలు ఇతర విపత్తుల సమయం లో కాలువ ప్రవాహాన్ని నియంత్రించే విధంగా దోహద పడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

బల్లికురవ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్లపాటు చెన్నుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రవిసాగర్, విజయక్ష్మీ, మమతలను సోమవారం పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వార పాఠశాల బలోపేతానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు దూళిపాళ్ల శేషగిరి, ఉపాధ్యాయులు సంద్యారాణి, రమణమూర్తి, సురేఖ స్వరూప, సుబ్బారావు, సుబాని, రాణి, నిలోఫర్, భవన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం పేరుతో దోచేశారు!

(5వ పేజీ తరువాయి)

వందనం కింద దాదాపు రూ.10వేల కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. డీఎస్సీ ద్వారా 16,300కుపైగా ఉద్యోగాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పవర్‌లూమ్స్‌కు 50 యూనిట్ల వరకు, హ్యాండ్‌లూమ్స్‌కు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం 190 కోట్ల రూపాయల సబ్సిడీని ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా త్వరలోనే బార్బర్ షాపులకు నెలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం వై.పాలెం నియోజకవర్గంలో 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేశామన్నారు. గిద్దలూరులో కూడా 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ వినియోగం పెరిగినప్పటికీ ఉత్పత్తిని పెంచకుండా కమీషన్ల కోసం అడ్డగోలుగా విద్యుత్‌ను కొనుగోలు చేసిందని, 9 పర్యాయాలు ప్రజలపై భారం మోపిందని మంత్రి విమర్శించారు. ప్రజాప్రభుత్వం రాగానే విద్యుత్ బిల్లులు పెంచకుండా అనేక ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సోలార్, విండ్ విద్యుత్‌ను పెంచుతున్నామని చెప్పారు.

**వెలిగొండ పూర్తికి కట్టుబడి ఉన్నాం : మంత్రి స్వామి**

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి మాట్లాడుతూ గిద్దలూరు నుంచి బుగ్గ వరకు 4 లైన్ల రహదారి నిర్మాణానికి రూ.4,200 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. బేస్తవారపేట నుంచి ఒంగోలు వరకు 4 లైన్ల రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో ఎక్కడికైనా బస్సులో ఉచితంగా మహిళలు ప్రయాణించవచ్చని, త్వరలో నిరుద్యోగ భృతి కూడా ఇస్తామని చెప్పారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు, వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జగన్‌ను ఫేక్ సీఎంగా అభివర్ణించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వర్షాధారమే దిక్కయిన ఈ ప్రాంతానికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే సాగు, తాగునీటి అవకాశాలు తీరతాయన్నారు. ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది, త్వరలో నీళ్లు ఇవ్వబోయేది చంద్రబాబేనని స్పష్టం చేశారు. మార్కాపురం కేంద్రంగా త్వరలో కొత్త జిల్లాగా రాబోతుందన్నారు. గిద్దలూరు, కంభం మార్కెట్ కమిటీ చైర్మన్లుగా బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్లుగా, ఇతర డైరెక్టర్లతో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో మార్కాపురం, కనిగిరి, చీరాల ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ఎం.ఎం.కొండయ్య, వై.పాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, దర్శి నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మునిసిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జనసేన ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.వి.నారాయణ పాల్గొన్నారు.

# దేవాంతకులు

(5వ పేజీ తరువాయి)

మిల్లంపల్లి వేణుగోపాలస్వామి దేవాలయానికి కూడా దాదాపు 90 ఎకరాల భూమి ఉంది. దీనికి నామమాత్రపు శిస్తు చెల్లిస్తూ కొందరు సాగు చేసుకుంటున్నారు. కొంత భూమికి పలువురు వేలం నిర్వహణకు కూడా ఆటంకాలు సృష్టిస్తూ ఎలాంటి కౌలు చెల్లించకుండా పంటలు సాగు చేసుకుంటున్నారు.

**48 ఎకరాలు ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి!**

దేవదాయశాఖ పరిధిలో లేకుండా ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో నడుస్తున్న ఆలయాలకు ఉన్న భూములు కూడా అధికంగానే అన్యాక్రాంతమయ్యాయి. పుల్లలచెరువు మండలంలోని శతకోడు సప్త కోటీశ్వరాలయంతోపాటు పలు ఆలయాలకు సంబంధించి దాదాపు 48 ఎకరాల భూమి ఎక్కడ ఎవరి పరిధిలో ఉందో కూడా తెలియని పరిస్థితి. ఎర్రగొండపాలెం మండలంలో దాదాపు మొత్తం 900 ఎకరాలకు పైగా ఆలయ భూములు ఉంటే వాటిపై వచ్చే శిస్తుతో దూపదీప నైవేద్యాలు దేవునికి అందాల్సింది పోయి చాలా ఆలయాలు దీనావస్థకు చేరుకున్నాయి. పుల్లలచెరువు మండలంలో కూడా ఆలయాలకు సంబంధించిన భూములు ఉన్నప్పటికీ వాటి గురించి కనీసం భక్తులకు కూడా అవగాహన లేకపోవడంతో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా భూముల్లో పాగా వేసి పెత్తనం చెలాయిస్తున్నారు.

**ప్రభుత్వం చర్యలు తీసుకున్నా ఆగని ఆక్రమణలు**

గతంలో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించిన సమయంలో దేవదాయశాఖ పరిధిలోనివితోపాటు ప్రైవేటు ఆలయాల భూముల వివరాలు లెక్క తేల్చి వాటిని దేవాలయం పేరుతో ఆన్‌లైన్ చేయించింది. ఆ భూములను కాపాడేందుకు ప్రత్యేకంగా అధికారిని నియమించింది. దాదాపు రికార్డుల్లో చాలా వరకు ఆలయ భూములను నమోదు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ప్రైవేటు వ్యక్తులు అనుభవంలో ఉంటున్నారు. ఇప్పటికైనా ఆలయాల భూములను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకొని వాటిపై వచ్చే ఆదాయంతో దేవాలయాల్లో ధూపదీప నైవేద్యం పెడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని భక్తులు కోరతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**● బైక్‌ను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం**
**● మరొకరికి గాయాలు**

పెద్దదోర్నాల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం మోటారు సైకిలును ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన మండల పరిధిలోని గంటవానిపల్లె స్టేజి వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎగువ చెర్లోపల్లి గ్రామానికి చెందిన పాముల విజయభాస్కర్(24) మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన కఠారి పోలురాజుకు గాయాలయ్యాయి. ఎస్సై మహేశ్ తెలిపిన కథనం ప్రకారం... విజయభాస్కర్, పోలురాజు దోర్నాలలో తమ పనులు ముగించుకుని మోటారుసైకిలుపై స్వగ్రామం చెర్లోపల్లి వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి ఇద్దరు కిందపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన ప్రయాణికులు పోలీసు స్టేషనుకు సమాచారం అందించారు. ఎస్సై మహేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని తన వాహనం ద్వారా క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యాధికారి చికిత్సలు నిర్వహించే క్రమంలో పరిశీలించగా అప్పటికే విజయభాస్కర్ మృతి చెందినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## కాలేజీ వ్యాన్, మోటార్ సైకిల్ ఢీ

**● ఇరువురికి గాయాలు**


తీవ్రంగా గాయపడిన రమేష్‌నాయుడు

మార్కాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న మోటార్ సైకిల్‌ను ఓ ప్రైవేటు కాలేజీకి చెందిన వ్యాన్ ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం ఉదయం స్థానిక మార్కెట్ యార్డ్ వద్ద చోటుచేసుకుంది. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు... స్థానిక టాటా క్యాపిటల్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో లోన్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తర్లుపాడు మండలం తాడివారిపల్లికి చెందిన ఎమ్.రమేష్‌నాయుడు, నెల్లూరు జిల్లా పొన్నలూరు మండలం పెద్దవెంకన్నపాలెంకు చెందిన టి.విజయ్‌కుమార్‌లు మోటార్ సైకిల్‌పై దోర్నాల వెళ్తున్నారు. మార్కెట్ యార్డు సమీపానికి చేరుకునే సరికి వెనుకనుంచి వస్తున్న ఓ ప్రైవేటు కాలేజీకి చెందిన వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ఇరువురికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆటోలో ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో రమేష్‌నాయుడును ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గడియార స్తంభం ఏర్పాటుకు శ్రీకారం

**● స్థల పరిశీలన చేసిన మహేంద్రనాథ్, సాంబశివరావు**

చీరాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గత పాలకుల ఆకృత్యాలతో నియోజక వర్గ స్వరూపం అట్టడుగుకు చేరిందని, కూటమి ప్రభుత్వం అధికారంతో అభివృద్ధిబాటలు పడుతోందని నియోజకవర్గ టీడీపీ అధికారి ప్రతినిధి డా.మహేంద్రనాథ్ అన్నారు. మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావుతో కలిసి సోమవారం పట్టణంలో గడియారస్తంభం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. పేరుకే గడియార స్తంభం కానీ అక్కడ దాని ఆచూకీ లేకుండా పోవడం అన్యాయమన్నారు. వెంటనే ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. వ్యయ, ప్రయాసలకు ఓర్చి పట్టణంలో నూనత ఒరవడిని సృష్టించనున్నట్లు వివరించారు. మున్సిపల్ అధికారులకు వెంటనే రూపకల్పనకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీవో శ్రీనివాసులు, గడియార స్తంభం ఏర్పాటు అర్జీదారులు సర్విశెట్టి సుబ్బరామయ్య, పుల్లయ్యనాయుడు, ఆదినారాయణ, భూషణం, గడ్డం శ్రీనివాసరావు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమర వీరుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యం

వేటపాలెం(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఎంతోమంది అమర వీరుల త్యాగఫలితం దేశ స్వాతంత్ర్యమని, అటువంటి మహనీయుల పోరా టాలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వేటపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దీప్తి అన్నారు. సోమవారం పాఠశాలలో దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొనగా సీనియర్స్ విభాగంలో సమన్విత, షేక్ మెహతాజ్, సుహానా, జూనియర్స్ విభాగంలో రాము, శ్రీకా, ప్రణతి ఉత్తమంగా రాణించినట్లు వివరించారు. విజేతలకు ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా సంగీతం టీచర్ సునీత, పృధివి సునీత, యశోదర విద్యార్థులు పాల్గొన్నారు.

## అలల తాకిడికి బీటెక్ విద్యార్థి మృతి

**● పిడుగురాళ్ల నుంచి స్నేహితులతో వచ్చి మృత్యువాత**
**● ఒకరిని రక్షించిన గజ ఈతగాళ్లు**

వాడరేవు(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వాడరేవులో సరదాగా గడిపేందుకు వచ్చిన పిడుగురాళ్ల బిటెక్ విద్యార్థి మృత్యువాత పడ్డాడు. అందిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన పాశం రవి(22) బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. అలాగే డిప్లమా చదువుతున్న సునీల్, ఎంఎల్‌టీ విద్యార్థి సాగర్, హైదరాబాదుకు చెందిన నవీన్‌లతో కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై సోమవారం వాడరేవు సముద్రతీరానికి వచ్చాడు. ఈ క్రమంలో ఇద్దరు ఒడ్డునే ఉండగా రవి, సునీల్ సముద్రంలోకి దిగి కొంచెం లోతుకు వెళ్లారు. గమనించిన గజ ఈత గాళ్లు హుటాహుటీన వారి వద్దకు చేరుకుని రక్షణ రింగ్‌లు విసిరారు. అయితే సునీల్ అందుకుని ఒడ్డుకు చేరగా, రవి ప్రమాదవశాత్తు అలల తాకిడికి కొట్టుకు పోయాడు. దీంతో గాలింపు చర్యలు నిర్వహిస్తున్న కొద్దిసేపటికే అదే ప్రాంతంలో విగతజీవిగా ఒడ్డుకు చేరాడు. ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హాస్పిటల్ వద్దకు చేరుకుని బోరున విలపించారు.

# వాగుల ఆక్రమణ

- చెరువు అలుగు భూములనూ వదలని వైనం
- పట్టించుకోని అధికారులు



పొదిలిలో కంభం రోడ్డు మలుపు వద్ద చెరువు అలుగు పోరంబోకు స్థలంలో ఆక్రమణదారులు పోసి ఉన్న మెరక

కనిగిరి పట్టణంలో అమాంతంగా పెరిగిన భూముల ధరలతో ప్రభుత్వ, పోరంబోకు స్థలాలు, వాగులు, చెరువు అలుగు పోరంబోకు స్థలాలు, మాన్యాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో పెరిగిన భూఅక్రమాలు ఇంకా కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఓపక్క అక్రమాలకు పాల్పడి దొరికిన వ్యక్తులు జైలు పాలవుతున్నా అక్రమార్కుల్లో ఎలాంటి మార్పు కనపడటం లేదు. గతంలో ఆంధ్రజ్యోతిలో వచ్చిన వరుస కథనాలతో కొన్ని రోజులు మిన్నకుండిన అక్రమార్కులు మళ్ళీ వాగులు, వంక పోరంబోకు స్థలాలను ఆక్రమిస్తున్నారు. అక్రమార్కుల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. వీరికి అండగా పట్టణంలో అవినీతి గ్యాంగ్ తయారైంది. - కనిగిరి, ఆంధ్రజ్యోతి



కందుకూరు రోడ్డులోని జీపుస్టాండు ఎదురుగా వెలుస్తున్న భారీ షాపింగ్ మాల్

### వాగులు ఆక్రమించినా పట్టించుకోని అధికారులు

పట్టణంలో వాగులు, వంక పోరంబోకు స్థలాలు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. మున్సిపాల్టీ పరిధిలోని చెక్‌పోస్టు నుంచి కంభం రోడ్డుకు తిరిగే మూలమలుపు వద్ద చెరువు అలుగు వంక పోరంబోకు స్థలాన్ని ఓవ్యక్తి తప్పుడు రికార్డులు సృష్టించి అమ్మకాలు చేసినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈస్థలంలో పెద్దఎత్తున మెరకపోసి కన్వర్షన్ లేకుండా ప్లాట్లువేస్తున్న ఏ అధికారి ఆవైపు కన్నెత్తి చూడలేదని విమర్శిస్తున్నారు. ఇదే వ్యక్తి నగరంలోని ప్రభుత్వ పోరంబోకు స్థలాలను కబ్జా చేసి పాత రికార్డులు సృష్టించి అమాయక ప్రజలకు అంటగట్టినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆస్థలంలో బైపాస్‌తో సమానంగా మెరకపోసి ప్లాట్లు వేస్తున్నారు. ఇంకోపక్క పొదిలి వైపు వెళ్ళే రోడ్డులోని చప్టా పక్కన 490 సర్వే నెంబరులోని వాగును ఆక్రమించి ఏకంగా భారీ కాంక్రీట్ గోడను నిర్మిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. అదేవిధంగా పట్టణంలోని జీపుస్టాండు ఎదురుగా ఉన్న 432 సర్వే నెంబరులోని ప్రభుత్వ అసైన్డ్‌భూమిలో కొంతమంది అక్రమార్కులు 433 సర్వే నెంబరు రిజిస్టర్ భూమి హద్దులు చూపించి తప్పుడు రికార్డులు సృష్టించి పాగా వేశారు. 20ఏళ్ల క్రితం కొంతమంది ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను అమ్ముకోగా, వాటిని ఆక్రమించేందుకు వారి వారసులను ఆయా స్థలాల్లో ఉంచి వెనుకుండి తతంగం నడిపిస్తున్నారు. సదరు అక్రమార్కులు 432 సర్వే నెంబరులో భారీ షాపింగ్ మాల్స్ ఏర్పాటుకు రాత్రిళ్ళు చకాచకా పనులు సాగుతున్న పట్టించుకునే వారులేరు.

### అక్రమార్కులకు అండగా అవినీతి గ్యాంగ్

పట్టణంతోపాటు పలు ప్రాంతాల్లో ప్రభుత్వ, పోరంబోకు భూములను కబ్జా చేసిన అక్రమార్కులకు అవినీతి గ్యాంగ్ అండగా నిలబడుతూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇటీవల పొదిలి రోడ్డులో, గార్లపేట రోడ్డులోని వివిధ స్థలాలను అక్రమించి కబ్జా చేసిన వ్యక్తి నుంచి అధికారులు, పోలీసులుతో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటామంటూ లక్షలాది రూపాయలు వసూలుచేసినట్టు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పట్టణంలో అక్రమంగా వేసిన వెంచర్ నిర్వాహకుల నుంచి రూ.20 లక్షల వరకు వసూలు చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

### జైలు పాలవుతున్నా అక్రమార్కుల్లో కనపడని మార్పు

కబ్జాలకు, ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులకు రెవెన్యూ శాఖ నోటీసులు జారీ చేసినా ఫలితం లేకుండా పోయింది. రెవెన్యూ శాఖ అధికారులు తీసుకునే చర్యల్లో జాప్యం రావటంతో అక్రమార్కులు ఆక్రమిత స్థలాలను అభివృద్ధిచేసి అమాయకులకు అంటగడుతున్నారు. వాటిల్లో కొన్నిచోట్ల నిర్మాణాలు జరుగటంతో ఆక్రమిత కట్టడాలను నిలువరించటం రెవెన్యూ అధికారులకు సవాల్‌గా మారింది. ఇటీవల పట్టణంలోని కందుకూరు రోడ్డులోని శంఖవరం పరిధిలోని 301, 302 సర్వే నెంబరులో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి రూ.15 కోట్లు విలువైన స్థలాన్ని ముఠా కబ్జా చేసింది. అసలు యజమాని ఫిర్యాదుతో పోలీసులు తీగ లాగితే డొంక కదిలింది. పోలీసులు విచారణలో నేరం రుజువుకావడంతో కోర్టు జైలుకు పంపిది. అయినా అక్రమార్కుల్లో ఎలాంటి మార్పు రావడంలేదు.



### వాగు స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటాం

పట్టణంలో ప్రభుత్వ, పోరంబోకు స్థలాలు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. చెరువు అలుగు పోరంబోకు స్థలాలపై పర్యవేక్షణ ఇరిగేషన్‌శాఖ, మున్సిపల్‌శాఖ పరిధిలో ఉంటుంది. వాటి హద్దులు నిర్ణయించే చర్యలు రెవెన్యూశాఖ చేపడుతుంది. పట్టణంలో చెరువు అలుగు వాగు ఆక్రమణకు గురైందని ఇప్పటికే గుర్తించాం. తహసీల్దార్ పర్యవేక్షణలో ఆక్రమణకు గురైనచోట హద్దు రాళ్ళు వేయించాం. ఇంకా కొంత సర్వే చేపట్టాల్సి ఉంది. అక్రమార్కులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. మమ్ములను ఏ అవినీతి గ్యాంగ్ సంప్రదించింది లేదు. అలాంటి వారికి ఆస్కారం ఉండదు. తప్పుడు రికార్డులు సృష్టించినట్టు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- కేశవర్ధన్‌రెడ్డి, ఆర్డీవో



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు గొట్టిపాటి, డోలా, ఎమ్మెల్యే ముత్తుముల

# కోతలు లేని విద్యుత్ అందిస్తాం

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

రాచర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోతలు లేని విద్యుత్ నిరంతరాయంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ఒద్దులవాగుపల్లి పంచాయతీ పరిధిలోని మేడంవారిపల్లి గ్రామ సమీపంలో రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) ద్వారా రూ.3.90 కోట్ల నిధులతో నిర్మించిన 33/11కేవీ నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌ను మరో మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డితో కలిసి సోమవారం గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక రూపకల్పన చేసిందని, అందుకు అనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టిందని అన్నారు. పరిశ్రమలకు, రైతులకు, గృహాలు ఇలా అన్ని వర్గాలకు సంబంధించిన నాణ్యమైన విద్యుత్ అందించాలని, మారుమూల ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తమ ప్రభుత్వంలో రాష్ట్రం ఏ రంగంలో కూడా వెనుక పడకుండా ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. ముందుగా షిఫ్టు ఆపరేటింగ్ గది శిలాఫలకాలను ప్రారంభించి అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను స్విచ్ ఆన్‌చేసి విద్యుత్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆపరేషన్ డివిజన్ ఈఈ నాగేశ్వరరావు, కన్‌స్ట్రక్షన్ ఒంగోలు ఈఈ విజయభాస్కర్, మార్కాపురం, గిద్దలూరు డీఈలు సత్యనారాయణ, శేషగిరిరావు, ఏఈలు మురళీమోహన్, బాలగురవయ్య, మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, రాచర్ల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఎస్ వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.



మొదటి సంవత్సరం విద్యార్థుల స్వాగత కార్యక్రమంలో మాట్లాడుతున్న క్విస్ విద్యా సంస్థల అధినేత సూర్య కల్యాణ్ చక్రవర్తి

## క్విస్‌లో ఘనంగా ప్రారంభ వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం బీటెక్ విద్యార్థుల ఇనాగురల్ (ప్రారంభం) వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కౌన్సెలింగ్ ద్వారా క్విస్ కళాశాలలను ఎంచుకున్న విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి మొదటి ఏడాది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ముందుగా సరస్వతి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ క్విస్ కాలేజీ పెట్టిన మొదటి ఏడాది 180 మంది విద్యార్థులు చేరారని, ఇప్పుడు ఆ సంఖ్య రెండువేలకు చేరిందన్నారు. రీసెర్చ్ చేసి చదివే విధానాన్ని కళాశాలలో ప్రవేశపెట్టామమని ఆయన పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ శ్రీ గాయత్రి మాట్లాడుతూ క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి ఏడాది నుంచే సాఫ్ట్‌స్కిల్స్ ప్రాజెక్టులు లాంటి ముఖ్యమైన అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత పోటీని తట్టుకొని నిలబడే విధంగా విద్యార్థులను తయారుచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీపీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బీవి సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, హెచ్‌వోడీలు డాక్టర్ గంటా శ్రీనివాసరావు ఉన్నారు.

## వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గర్భిణీలు నమోదు అయిన నాటి నుంచి క్రమంతప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సూచించారు. ఒంగోలులో సోమవారం సర్వజన ఆస్పత్రి, పట్టణ, ప్రాథమిక ఆరోగ్యశాఖ వైద్యాధికారులకు వ్యాధి నిరోధక టీకాలపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సేవలను ఎంసీపీ కార్డులో నమోదు చేయాలన్నారు. రెండు విడతల టీకాలను ఇవ్వడంతో పాటు పుట్టిన పిల్లల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు ఇవ్వాల్సిన అన్ని రకాల టీకాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు ప్రతిరోజూ వ్యాధి నిరోధక టీకాల స్టాక్, ఐఎల్ఆర్ రూమును పరిశీలించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రభుత్వం లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.


## ఎక్సైజ్ సీఐపై చర్యలు

- కమిషనరేట్‌లో సరెండర్

ఒంగోలు క్రైం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : గతనెల 29న ఒంగోలు ఎక్సైజ్ స్టేషన్‌లో తనిఖీలకు వెళ్లిన జిల్లా ఎక్సైజ్ అధికారి అయేషా బేగం ఇచ్చిన నివేదిక మేరకు ఎక్సైజ్ కమిషనర్ వేగంగా స్పందించారు. ఒంగోలు ఎక్సైజ్ సీఐ లీనాను కమిషన్‌రేట్‌కు సరెండర్ చేస్తూ చర్యలు తీసుకున్నారు. జిల్లా అధికారి తనిఖీలకు వెళ్లిన సమయంలో జరిగిన పరిణామాలను ఉన్నతాధికారులకు ఈనెల 1న నివేదిక అందజేశారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది దగ్గర తీసుకున్న స్టేట్‌మెంట్‌లను జతపరిచారు. ఈ మేరకు వెంటనే లీనాపై చర్యలు తీసుకున్న కమిషనర్ అక్కడే పనిచేస్తున్న ఎస్సై ఆశోక్‌బాబుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

## నేడు పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ఒంగోలు విద్య, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్-25 కౌన్సెలింగ్ ద్వారా భర్తీ కాకుండా మిగిలిపోయిన సీట్లను మంగళవారం నిర్వహించే స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తారు. విద్యార్థులు తాము చేరదల్చుకున్న కళాశాలలకు నేరుగా వెళ్లి ఖాళీగా ఉన్న బ్రేడ్‌లలో అడ్మిషన్లు పొందవచ్చు. 10వ తరగతి మార్కుల జాబితా, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, టీసీ, పాలిసెట్ ఎంట్రెన్స్ రాసిన వారయితే తమ ర్యాంకు కార్డుతో హాజరుకావాల్సి ఉంటుంది. విద్యార్థులు కౌన్సెలింగ్ ఫీజు, ట్యూషన్ ఫీజు కింద సుమారు రూ.6వేలు వరకు చెల్లించాల్సి ఉంటుంది.



# అడ్డగోలు క్వారీయింగ్ ప్రాణసంకటం

- భద్రతను గాలికి వదిలేసిన యాజమాన్యం
- అధికారుల పర్యవేక్షణ లోపం
- తరచూ ప్రమాదాలు

గ్రానైట్ క్వారీల్లో భద్రతపై శ్రద్ధ లేక కార్మికులు జీవ సమాధి అవుతున్నారు. తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. క్వారీయింగ్‌లో యాజమాన్యాలు పట్టించుకోకపోవడం, పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్లకు తలొగ్గడం లాంటి కారణాలతో క్వారీయింగ్ ప్రమాదకరంగా మారింది.

ఒంగోలు క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి, ఆర్‌ఎల్‌పురం, బుదవాడ ప్రాంతాల్లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గెలాక్సీ గ్రానైట్ లభ్యం అవుతోంది. అందుకోసం లోతుగా క్వారీయింగ్ చేయడం పరిపాటి. క్వారీల్లో యజమాన్యం భద్రత ప్రమాణాలు పాటించకుండా కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. ఇటీవల విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసిన సమయంలో గ్రానైట్ క్వారీల్లో భద్రత డొల్లతనం కనిపించింది. చీమకుర్తిలో 2010లో హంసా గ్రానైట్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకొని 14 మంది కార్మికులు జీవ సమాధి అయ్యారు. అయినప్పటికీ గ్రానైట్ క్వారీ యజమానులు, అధికారులు... కార్మికుల భద్రతను పట్టించుకున్న దాఖలాలు లేవు. డంపర్లు కూడా కాలం చెల్లినవిగా విజిలెన్స్ అధికారులు గుర్తించారు. విద్యుత్ షాక్‌లతో మృతులు సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. క్వారీయింగ్ కోసం వినియోగించే పేలుడు పదార్థాలు నిల్వ ఉంచడంలో కూడా జాగ్రత్తలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇలా మొత్తంగా గ్రానైట్ క్వారీల్లో పనిచేసే కార్మికులు బీహార్, రాజస్థాన్, ఒరిస్సా తదితర ప్రాంతాలవారు కావడంతో క్వారీల్లో జరిగిన ప్రమాదాలు సైతం బయటకు రాకుండా అనేకం కట్టడి చేసిన సందర్భాలు ఉన్నాయి. మొత్తంగా క్వారీల్లో పనిచేయడం ప్రాణసంకటంగా మారింది.

**క్వారీల్లో జరిగిన ప్రమాదాలు**

- 2010లో హంసా గ్రానైట్‌లో క్వారీ అంచులు కూలి 14 మంది కూలీలు మృతిచెందారు. అప్పట్లో చాలా ప్రమాదంగా చెప్పుకున్నారు.
- ఏడాది క్రితం క్రిష్ణసాయి గ్రానైట్ క్వారీలో అంచులు కూలి ప్రమాదం జరిగింది. అయితే అక్కడ క్వారీయింగ్ జరగడంలేదని యాజమాన్యం చెప్పింది. అయితే అనధికారికంగా క్వారీయింగ్ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.
- మూడు నెలల క్రితం సూర్య గ్రానైట్స్‌లో జరిగిన ప్రమాదంలో ఇరువురు మృతి చెందారు.
- తాజాగా బాపట్ల జిల్లా బల్లికురవ మండలంలో సత్యకృష్ణ గ్రానైట్స్‌లో ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. అయినా క్వారీలో భద్రతపై అధికార యంత్రాంగం దృష్టి సారించలేదు.

**భద్రత చర్యలు నిల్**

- గ్రానైట్ క్వారీల చుట్టూ బౌండ్రీలు వేసుకోవాలి.
- కనీసం 5 మీటర్లు చుట్టూ వదిలి క్వారీయింగ్ చేయాలి. కానీ ఎక్కడా అలాంటి చర్యలు కనిపించలేదు.
- క్వారీల్లో వాహన రాకపోకలకు బెంచ్ కటింగ్ ఉండాలి. కొండ పైనుంచి కిందకు దిగే విధంగా రహదారి ఏర్పాటుచేస్తున్నారు.
- పేలుడు పదార్థాలు నిల్వ ఉంచేందుకు క్వారీలకు దూరంగా భద్రతకు అనువైన ప్రదేశంలో నిల్వ ఉంచాలి.

# ఉపసంహరణలు ప్రారంభం

- రంగంలోకి దిగిన మంత్రి స్వామి, సత్య
- కొండపిలో పార్టీ నాయకులతో సత్య సమావేశం
- సర్పంచ్ పదవిని నేడు నిర్ణయించే అవకాశం
- ఏకగ్రీవం వైపు కొండపి గ్రామ పంచాయతీ

కొండపి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): కొండపిలో నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారంతో గడువు ముగుస్తుండటంతో టీడీపీ మద్దతుదారులుగా నామినేషన్లు వేసిన సర్పంచ్, వార్డు మెంబర్ల డమ్మీ అభ్యర్థుల, ఆశావహుల నామినేషన్లను ఉపసంహరించుకునే కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. కొండపి సర్పంచ్ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా టీడీపీ తీసుకుంది. దీంతో సోమవారం మధ్యాహ్నం వరకు వివిధ కార్యక్రమాల్లో ఉన్న మంత్రి స్వామి, ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య సమన్వయంతో నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కొండపి టీడీపీ నాయకులకు సూచించారు. పూర్తిగా కొండపి సర్పంచ్ బాధ్యతను మంత్రి స్వామి ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ సత్యకు అప్పగించారు. దీంతో సత్య రంగంలోకి దిగి సోమవారం సాయంత్రం కొండపిలోని పార్టీ కార్యాలయంలో కొండపి గ్రామ పంచాయతీ నాయకులతో మాట్లాడారు. డమ్మీ అభ్యర్థులను, ఆశావహులకు సర్దిచెప్పి నామినేషన్ల ఉపసంహరణను ప్రారంభించారు. అప్పటికే పలువురితో నామినేషన్లను ఉపసంహరించుకోవాలని స్థానిక నాయకులకు సూచించడంతో వారు కార్యక్రమాన్ని పూర్తిచేశారు. మంగళవారం మధ్యాహ్నానికి వార్డు మెంబర్లను, సర్పంచ్ అభ్యర్థిని ఫైనల్ చేసే అవకాశం ఉందని పార్టీ నాయకులు తెలిపారు. కాగా ఇప్పటికే టీడీపీ, వైసీపీ నాయకులు ఒప్పందానికి రావడంతో ఆ ఒప్పందం ప్రకారం అడుగులు పడుతున్నాయి. వైసీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ కూడా కొండపి గ్రామ పంచాయతీ వైసీపీ నాయకులతో పలు దఫాలు సోమవారం చర్చలు జరిపారు. పోటీ చేయాలని సూచించగా, స్థానిక నాయకులు తాము ఒప్పందం ప్రకారం కట్టుబడి ఉంటామని తెలిపారని సమాచారం. గడచిన ఎంపీటీసీ ఎన్నికల్లో కొండపిలో రెండు ఎంపీటీసీ సభ్యుల పదవులు టీడీపీవారు వదిలేశారని, ఇపుడు కూడా 5 వార్డులు ఇవ్వడానికి టీడీపీవారు అంగీకారం తెలిపారని, ఆమేరకు ఒప్పందాన్ని కూడా మీ దృష్టికి తీసుకు వచ్చామని, ఇపుడు పోటీవైపు అడుగులు వేయలేమని వైసీపీ కొండపి గ్రామ పంచాయతీ నాయకులు సురేష్‌తో అన్నట్లు తెలిసింది. అనేక తర్జన, భర్జనల అనంతరం కొండపి నాయకుల ఒప్పందం ప్రకారమే నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. దీంతో వైసీపీ నాయకులు కూడా ఒప్పందం ప్రకారం సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు వేసినవారు ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో టీడీపీకి 9 వార్డులు, సర్పంచ్, ఉపసర్పంచ్ పదవులు, వైసీపీకి 5వార్డులు అనే ఒప్పందం ప్రకారమే కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ సాగుతున్నదని ఆయా పార్టీల నాయకులు అంటున్నారు. ఇరు పార్టీల నాయకుల ఒప్పందం ప్రకారం కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఏకగ్రీవం అయ్యే అవకాశాలు బలపడ్డాయి.



నామినేషన్లను ఉపసంహరించుకుంటున్న వార్డు మెంబర్లు

## స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 15వ తేదీన స్వాతంత్య్ర వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. అందుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం అన్నిశాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అతిథులకు ఆహ్వానాలు, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యులకు సన్మానం, ప్రభుత్వ పథకాలను తెలియజేసే విధంగా శకటాలు ఏర్పాటు, ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వీటిని వీక్షించేందుకు విద్యార్థులను తరలించేందుకు సంబంధిత అధికారులు దృష్టి సారించాలన్నారు. శకటాలపై ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వివరాలను సమగ్రంగా ముద్రించాలన్నారు. ఈ వేడుకలు పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్నందున ఆ రోజున ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పూర్తి స్థాయిలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశంసాపత్రాల కోసం ఈనెల 10వతేదీలోపు ఆయా శాఖల అధికారులు ప్రతిపాదనలు పంపాలన్నారు. పీ4 పథకంలో మార్గదర్శకులను చురుగ్గా గుర్తించిన వారిని స్వతహాగా మార్గదర్శకులుగా మారిన అధికారులను ప్రశంసాపత్రాలు పొందేందుకు అత్యధిక అర్హులుగా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు అనంతరం అంశాల వారీగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు.

## పేస్‌లో ఇంజనీరింగ్ తరగతుల ప్రారంభం

ఒంగోలు విద్య, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫెట్రానిక్స్ సిస్టం ప్రైవేటు లిమిటెడ్ సీఈవో దాసరి రామకృష్ణ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు మార్కెట్, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఉన్నత ఉద్యోగాల సాధనకు అవసరమైన అన్ని సదుపాయాలు పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్నాయని తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తమ కళాశాలపై నమ్మకంతో 100శాతం అడ్మిషన్లకు సహకరించిన విద్యార్థులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, డీన్ సుబ్బారావు రూపాఆక్మేష్ తదితరులు ఉన్నారు.

## హోంగార్డును సత్కరించిన ఎస్పీ

ఒంగోలు క్రైం,ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పొన్నలూరు పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తు గతనెల 31న ఉద్యోగ విరమణ చేసిన గాలంకి చెన్నయ్యను ఎస్పీ ఏఆర్ .దామోదర్ సోమవారం సత్కరించారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చెన్నయ్యకు శాలువా కప్పి అభినందించారు. విధినిర్వాణలో పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఆర్ఎస్సై కే.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

సంతనూతలపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు సబ్‌స్టేషన్‌ల్లో మరమ్మతుల కారణంగా మండలంలోని చంద్రపాలెం, పి.గుడిపాడు, సంతనూతలపాడు, సంతనూతలపాడు ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 3 గంటలవరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని ఒంగోలు రూరల్ విద్యుత్‌శాఖ ఏఈ సంతోష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

**● జేసీ గోపాలకృష్ణ**



మీకోసంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం హాలులో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలురకాల సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో జేసీ గోపాలకృష్ణ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యం లేకుండా నాణ్యతతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా పరిష్కారం తీరు ఉండాలన్నారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులతో ముఖాముఖీగా మాట్లాడి ఆయా సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించాలని జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్‌రెడ్డి, పార్థసారథి, మాధూరిలతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.

### ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

పంచాయతీ స్థలం ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామసర్పంచ్ పూనూరి సుబ్బారావు కోరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. 20 ఏళ్ల నుంచి పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న పంచాయతీ స్థలంలో మహాత్మాగాంధీ, టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాలను ఏర్పాటు చేశారన్నారు. ఆ విగ్రహాలకు ముందు భాగాన బస్సు షెల్టర్ పేరుపెట్టి ఆ స్థలాన్ని అన్యాక్రాంతం చేసేందుకు కుట్రపన్నారని,విచారణ చేసి పంచాయతీ స్థలం ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని జేసీని కోరారు.

## ప్రజాఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

ఒంగోలు క్రైం,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి చట్టపరిధిలో వేగవంతంగా పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు.సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల వినతులను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులతో వినతులపై మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి 67 మంది తమ వినతులను ఎస్పీకి అందజేశారు. ఒంగోలులో ఏటీఎంలో డబ్బులు జమచే సేందుకు వెళ్లగా అక్కడ మిషన్ పనిచేయలేదని, ఓ వ్యక్తి తాను నెఫ్ట్‌ద్వారా డబ్బులు పంపిస్తానని చెప్పి రూ. 50 వేలు తీసుకొని మోసం చేసి ఫేక్ మెసేజ్ పంపించాడని స్థానిక వెంకటేశ్వర కాలనీకి చెందిన వ్యక్తి ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. అదే విధంగా ఉద్యోగం ఇప్పిస్తాని చెప్పి నకిలీ పత్రాలు చూపించి రెండు లక్షలు తీసుకొని మోసం చేసాడని ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు దుర్గాప్రసాద్, షమీముల్లా, పాండురంగారావు, ఎస్సై జనార్దనరావులు ఉన్నారు.



ఫిర్యాదుదారుల సమస్యలను వింటున్న ఎస్పీ దామోదర్



చైర్మన్ సుబ్బాయమ్మను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

## చెన్నమల్లేశ్వర స్వామి ట్రస్ట్‌బోర్డు కమిటీ ప్రమాణ స్వీకారం

నాగులుప్పలపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలు గ్రామంలోని శ్యామలాంబ సమేత శ్రీ చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం కోలహలంగా నిర్వహించారు. గ్రామ టీడీపీ కార్యాలయం వద్ద నుంచి నూతన ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులతో కలసి చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానానికి ర్యాలీగా చేరుకొన్నారు. అనంతరం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఈవో దామా నాగేశ్వరరావు ఆలయ చైర్మన్‌గా ఎంపికైన గండు సుబ్బాయమ్మతో పాటు సభ్యులు చిడిపోతు సురేష్‌బాబు, ధూపాటి వీరనారాయణ, పాదర్తి సుబ్బయ్య, వావిలాల లలితాదేవి, అజ్జం సరోజిని, మేకల శారద, మాచవరపు సురేష్, పబ్బిశెట్టి పవన్, ఎక్స్‌అఫిషియో సభ్యుడు కొల్లిపర నాగేశ్వరరావులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆలయంలో నూతన కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రమాణ స్వీకారం చేసిన ట్రస్ట్ బోర్డు సభ్యులను తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, దివంగత టీడీపీ నేత వీరయ్య చౌదరి తనయుడు ముప్పవరపు చంద్ర సిద్దార్థ, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గుడిపూడి రాజారావు, నాయకులు ఈదర వెంకటకృష్ణారావు, వలేటి పాండురంగారావు, మారెళ్ల జనార్దన రావు, మెట్టు సుబ్బయ్య నాయుడు, మహమ్మద్‌బేగ్ తదితరులు అభినందించారు.



అమ్మనబ్రోలులో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

## బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలి

నాగులుప్పలపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బిడ్డ జన్మించిన వెంటనే తల్లిపాలు తాపించడం ద్వారా వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉష, శ్రీదేవి సూచించారు. మండల పరిధిలోని అమ్మనబ్రోలు గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు ఉష, శ్రీదేవి మాట్లాడుతూ బిడ్డపుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలన్నారు.ఆరు నెలల వరకు తల్లిపాలు శిశువుకు అందిచాలని చెప్పారు.తల్లిపాల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.అన్నపూర్ణ, ప్రమీల, హెచ్‌వీ విజయలక్ష్మి, ఏఎన్ఎంలు ,అంగన్‌వాడీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

**తల్లి పాలు ఎంతో ఉత్తమం**

ఒంగోలు(రూరల్):డబ్బా పాలు కంటే బిడ్డకు తల్లి పాలు ఇవ్వటం ఎంతో ఉత్తమమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమ అన్నారు. ఒంగోలు నగరం పెళ్లూరు గ్రామంలో సోమవారం తల్లి పాల వారోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామంలో తల్లి పాలు ప్రాముఖ్యతపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



జిల్లా అధికారులకు వినతిపత్రం ఇవ్వటానికి వచ్చినబాలాజీనగర్ వాసులు

## చర్చి నిర్మాణాన్ని నిలుపుదల చేయించాలి

**● మీకోసంలో ఉన్నతాధికారులకు వినతి**

ఒంగోలు(రూరల్)ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం రైల్వే ఫ్లైవోవర్‌కు దక్షిణం వైపున గల బాలాజీనగర్‌లో (గుర్రం జాషువ కాలని దగ్గర) మునిసిపల్ అధికారుల అనుమతి లేకుండా చేస్తున్న చర్చి నిర్మాణాన్ని వెంటనే నిలుపుదల చేయాలని ఆప్రాంత ప్రజలు సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాలాజీనగర్ వాసులు మాట్లాడుతూ సర్వేనంబరు 612-1ఎ1 ,612-2ఎ1లో (ప్లాట్ నెంబరు 39లో)మునిసిపల్ అధికారుల అనుమతులు లేకుండా చర్చి నిర్మిస్తున్నారని, దీంతో తాము అనేక ఇబ్బందులు వస్తాయన్నారు. అధికారులు స్పందించి తక్షణమే నిర్మాణాన్ని నిలుపుదల చేయించాలని వారు ఆ వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో పూర్ణ చంద్రరావు, డి.రామకృష్ణారెడ్డి, ఎం.శీతారామిరెడ్డి, జి.సుబ్బారావు, ఎం.రామయ్య, బొట్ల గోవిందయ్య, బి.చలపతిరావు,వై.ఆంజనేయులు, కె.బ్రహ్మారెడ్డి, ఎం.రవి, డి.ఆంజనేయులు, సత్యనారాయణ, పి.ఆంజనేయులు పాల్గొన్నారు.

## 10న వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కొండపి గ్రామ పంచాయతీకి ఈనెల 10న ఎన్నికలు జరుగుతున్నందున ఆరోజున ఆ పంచాయతీపరిధిలో పనిచేస్తున్న షాపులు, దుకాణాలు, సంస్థల ఉద్యోగులకు వేతనం కూడిన సెలవును మంజూరు చేయాలని జిల్లా ఉప కార్మిక కమిషనర్ ఎ.గాయత్రిదేవి ఒక ప్రకటనలో కోరారు. ఆంధ్రప్రదేశ్ దుకాణాల, సంస్థల చట్టం 1988లోని నిబంధనల ప్రకారం కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తోందని హెచ్చరించారు.

## సమాచారం హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

చీమకుర్తి,ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): సమాచారహక్కు చట్టంపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు కోరారు.చీమకుర్తి మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో సమాచారహక్కుచట్టంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ సమాచారహక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.చట్టంలోని అంశాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఎంపీడీవో రాఘవేంద్ర, ఏవో వజ్జా శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 12న జాతీయ నులిపురుగుల దినోత్సవం



జాతీయ నులిపురుగుల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ గోపాలకృష్ణ ఇతర అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 12వతేదీన జరగనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం హాలులో వైద్యశాఖ ముద్రించిన జాతీయ నులిపురుగుల దినోత్సవ పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ ఈనెల 12వతేదీన నులిపురుగుల దినోత్సవ కార్యక్రమంలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లందరికీ ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలన్నారు. జిల్లాలో 1నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలు 5,96,751 మంది ఉన్నారని, అందుకోసం 6,08,000 ఆల్బెండజోల్ మాత్రలు అవసరం అవుతాయని తెలిపారు. ఏడాది నుంచి రెండేళ్ల లోపు పిల్లలకు అరమాత్రనీళ్లలో కరిగించి మింగించాలన్నారు. రెండు సంవత్సరాలు పైబడిన వారికి ఒక మాత్రను మిగించాలని తెలిపారు. అందుకోసం అయాశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్‌భగీరథ, డాక్టర్ శ్రీనివాస్ ఎనాయక్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సూరిబాబు, డాక్టర్ కమలశ్రీ తదితరులు ఉన్నారు.

# ఎక్కడి మురుగు అక్కడే!

**సైడు కాలువలు లేక గ్రామీణుల అగచాట్లు**

**వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతుండటంతో ఇబ్బందులు**



చిమటలో వర్షపు నీటిని బకెట్లతో బయట పోస్తున్న మహిళలు

మర్రిపూడి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో సైడు కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడి మురుగు అక్కడే నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. వర్షాలు కురిసిన సమయంలో ఇళ్లలోకి నీరు చేరుతుండటంతో దాన్ని బయటకు పంపించలేక సతమత మవుతున్నారు. చిమట ఎస్సీ కాలనీలో సీసీరోడ్లు నిర్మించినప్పటికీ సైడు కాలువలు ఏర్పాటు చేయకపోవడం సమస్యగా మారింది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీకి వచ్చిన మంత్రి స్వామి దృష్టికి చిమట ఎస్సీకాలనీ వాసులు సైడు కాలువలు లేకపోవడంతో ఏర్పడిన ఇబ్బందులను ఏకరువు పెట్టారు. ఆదివారం కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు చేరడంతో మహిళలు బకెట్లతో తోడిపోయాల్సి వచ్చింది. మర్రిపూడి వడ్డెర కాలనీలో సీసీరోడ్లు, కాలువులు లేకపోవడంతో అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం వద్ద మోకాలు లోతులో వర్షపు నీరు నిలిచింది. పాత తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న బీసీ కాలనీలో కూడా కాలువలు లేకపోవడంతో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఇటీవల సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన దామచర్ల సత్య దృష్టికి స్థానిక ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఉప్పుసాయిబాబు ఆధ్వర్యంలో పలువురు మహిళలు సమస్యను తీసుకెళ్లారు. సీసీరోడ్లతోపాటు కాలువులు నిర్మించాలని కోరారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో సైడు కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మర్రిపూడిలో వడ్డెర కాలనీలో సైడు కాలువలు లేక రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

# పౌరహక్కుల దుర్వినియోగం సరికాదు

**● ఎంపీపీ వెంకటరెడ్డి**

మర్రిపూడి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను దుర్వినియోగం చేసుకోవడం తగదని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టాన్ని ఆయుధంలా ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కావలసిన సమాచారాన్ని సంబంధిత అధికారుల నుంచి అధికారికంగా తెలుసుకోవచ్చన్నారు. అయితే కొంతమంది సమాచార హక్కు చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యమ కార్యకర్త నటుకుల శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ సీమల అభివృద్ధి, పీడిత ప్రజల సమస్యల పరిష్కారానికి సమాచార హక్కు చట్టం దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఖాసింపీరా, డీటీ పి.నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డ్వాక్రా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి



గర్భిణులకు సీమంతం చేసి పండ్లు అందజేస్తున్న సీడీపీవో సుశీలాదేవి, వెన్నూరు సర్పంచ్ సంధ్యారాణి

# గర్భిణులకు సామూహిక సీమంతాలు

కొండపి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వెన్నూరు గ్రామంలోని గర్భిణులకు సోమవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. సీడీపీవో బి.సుశీలాదేవి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు రోగ నిరోధకశక్తిని పెంపొందిస్తాయని వివరించారు. ముర్రుపాలు బిడ్డకు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొర్రెపాటి సంధ్యారాణి, సూపర్‌వైజర్ టి.విక్టోరియారాణి, ఏఎన్ఎం త్రివేణి, కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మహాసభలను విజయవంతం చేయాలని ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

### 20 నుంచి ఒంగోలులో

## సీపీఐ రాష్ట్ర మహాసభలు

**● విజయవంతం చేయాలని విస్తృత ప్రచారం**

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈనెల 20వతేదీ నుంచి జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం జిల్లాకేంద్రమైన ఒంగోలులో విస్తృత ప్రచారంతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కరపత్రాల ద్వారా ప్రచారం ప్రారంభించారు. ముందుగా మేయర్ గంగాడ సుజాతకు కరపత్రాన్ని అందజేసి మహాసభలకు ఆహ్వానించారు. ఈసందర్భంగా సీపీఐ నాయకుడు శ్రీరామ్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఒంగోలులో ఈనెల 20తేదీ నుంచి జరగనున్న సీపీఐ మహాసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నగరంలోని ప్రజలందరూ పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు గుజ్జుల వలరాజు, మురళీ, ప్రభాకర్, సాయి, నాగభూషణం, పవన్‌కుమార్, బాలు, చంద్ర,తేజ, అరుణ, వెంకటరెడ్డి,ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

## ఎరువుల కొరతను తీర్చాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల కొరతతో రైతాంగం ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని వైసీపీ నాయకులు ఆరోపించారు. వైసీపీ జిల్లాకమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆ పార్టీ నాయకుడు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా కలెక్టరేట్ వద్ద వైసీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబులు మాట్లాడుతూ జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి అదెన్న, వైసీపీ నాయకులు ఆళ్ల రవీంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

# కేంద్రమంత్రిని కలిసిన ఎంపీలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్‌మంత్రి హర్దీప్‌సింగ్ పూరిని సోమవారం ఢిల్లీలో ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డితో పాటు పలువురు ఎంపీలు కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రతిపాదనలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని రామాయపట్నంలో బీపీసీఎల్ రీఫైనరీ, ఓఎన్‌జీసీ జాక్-అప్‌రిగ్‌ను ఇచ్చేందుకు హిందూస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని, ప్రధానమంత్రి ఉజ్వలయోజన కింద విస్తరించిన ప్రయోజనాలలో ఆంధ్రప్రదేశ్‌లోని 65.40 లక్షల క్రియాశీల దీపం లబ్ధిదారులందరిని చేర్చాలని తదితర ప్రతిపాదనలతో కూడిన అర్జీని కేంద్రమంత్రికి అందజేశారు. ఈ ప్రతిపాదనలను త్వరితగతిన అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రిని కోరారు

## నేడు సర్పంచ్‌ల చలో విజయవాడ

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం చేపట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు బెజవాడ శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో కోరారు. ఏడు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను వెంటనే గ్రామ పంచాయతీలకు విడుదల చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా కాలువల పూడికతీత, బ్లీచింగ్ పౌడర్, వర్కర్ల జీతభత్యాలు చెల్లించేందుకు పంచాయతీల్లో నిధులు లేక సర్పంచ్‌లు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదే విధంగా సర్పంచ్‌ల గౌరవ వేతనం పెంచడంతో పాటు ఉపాధి హామీ పనులను గ్రామ పంచాయతీల ద్వారానే చేపట్టాలని, తదితర డిమాండ్లతో చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో జిల్లాలోని సర్పంచ్‌లందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## సెల్‌ఫోన్లు సీడీపీవో కార్యాలయంలో అప్పగింత

కొండపి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఫేస్ యాప్ సరిగా పడటం లేదని, వివరాల నమోదుకు ఫోన్‌లు పనిచేయడం లేదని ఐసీడీఎస్ కొండపి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం తమ ఫోన్‌లను సీడీపీవో కార్యాలయంలో అందజేశారు. యాప్‌లతో పనిభారం పెరిగిపోయిందని, 4జీ ఫోన్‌లు నెట్‌లు రాక, వివరాలు నమోదుకాక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు పదేపదే వివరాలు నమోదు చేయాలంటూ ఒత్తిడి పెడుతున్నారన్నారు. తాము పనిచేయలేని పరిస్థితులు ఎదురవడంతో సెల్‌ఫోన్‌లను అప్పగించామని ఈసందర్భంగా వారు తెలిపారు.

# వెలిగొండ ద్వారా నీరు తెప్పిస్తాం

**• ప్రాజెక్ట్‌ను పూర్తి చేయకుండానే జాతికి అంకితమంటూ వైసీపీ శిలాఫలకం • జగన్‌లా ప్రజల చెవిలో పూలు పెట్టం**

### సాగు, తాగునీటి సమస్యలపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి
### వైసీపీ అంటించిన కులగజ్జిని వదలండి
### మార్కాపురం ఎమ్మెల్యే కందుల
### గిద్దలూరు చరిత్రలో తొలిసారి బీసీకి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి : బాలయ్య


బేస్తవారపేటలో రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి,ఎమ్మెల్యే


ప్రసంగిస్తున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

గిద్దలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జగన్‌లాగా ప్రజల చెవిలో పూలు పెట్టబోమని, వెలిగొండ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి ప్రజలకు నీటిని అందిస్తామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్పష్టం చేశారు. గిద్దలూరు మార్కెట్ యార్డు ఆవరణలో గిద్దలూరు, కంభం మార్కెట్ కమిటీ చైర్మన్ల, వైస్‌చైర్మన్ల, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం వేలాది మంది కార్యకర్తల, నాయకుల, రైతుల మధ్య జరిగింది. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ వెలిగొండ పూర్తి చేశాం, జాతికి అంకితం చేశాం అని చెప్పుకునే జగన్ నీళ్లు ఇచ్చాడా అంటూ ప్రశ్నించారు. జగన్ లాగా మోసం చేయబోమన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు విషయంలో కూడా వైసీపీ ప్రభుత్వం పశ్చిమ ప్రకాశానికి అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. ప్రజాప్రభుత్వ హయాంలో త్వరలోనే మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా రాబోతుందన్నారు. ప్రజల కోసం ఎవరు పని చేస్తున్నారో ప్రజలు గుర్తించాలని కోరారు. వైసీపీ ప్రజలకు కులపిచ్చి పూసిందని, మీకు కులపిచ్చి ఎందుకని ప్రశ్నించారు. నిరుద్యోగ యువతకు జాబ్‌క్యాలెండర్ ఇస్తామని చెప్పిన జగన్ వారిని పట్టించుకోకుండా గంజాయికి బానిసలు చేశాడని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో అన్నదాతకు రూ.13 వేలు పెట్టుబడి సాయంగా ఇస్తుండగా ప్రజా ప్రభుత్వం రూ.20వేలు ఇస్తుందని, మొదటి విడతగా రూ.7వేలు ఇచ్చిందని తెలిపారు.

**● వైసీపీ విమర్శలను తిప్పికొట్టాలి : ఉగ్ర**

కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియచెప్పాలని పార్టీ శ్రేణులకు సూచించారు. వైసీపీ విమర్శలను తిప్పికొట్టాలన్నారు. చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిని అభినందించారు. తాగు, సాగునీరు వస్తే తప్ప అభివృద్ధి సాధ్యం కాదన్న ఉద్దేశంతో వెలిగొండను పూర్తి చేసేందుకు చంద్రబాబు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ కనిగిరికి రైల్వేలైన్ వచ్చినట్లుగానే గిద్దలూరుకు మరో 4 లైన్ల రోడ్డు రాబోతుందన్నారు. టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఒక్కసారి అంటూ ముఖ్యమంత్రిగా వచ్చి జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని ధ్వజమెత్తారు. ఇప్పుడు రపారపా అంటూ ఎమ్మెల్యేలను, ఎంపీలను చంపండంటూ రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు జగన్ కుట్ర చేస్తున్నాడని విమర్శించారు.

**● దళితులకు ఆలయం, సహపంక్తి భోజనం బాబు వల్లే : ఎరిక్షన్**

యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ హోటల్స్‌లో రెండు గ్లాసుల విధానాన్ని తీసివేయించి, దళితులకు ఆలయ ప్రవేశం, సహపంక్తి భోజనం చేపట్టిన ఘనత చంద్రబాబుదేనన్నారు. గిద్దలూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య మాట్లాడుతూ నియోజకవర్గం పుట్టిన తరువాత తొలిసారి చైర్మన్ పదవిని బీసీకి ఇచ్చిన ఘనత అశోక్‌రెడ్డికి దక్కుతుందని అన్నారు. కంభం మార్కెట్‌కమిటీ చైర్మన్ పూనూరు భూపాల్‌రెడ్డి, జనసేన ఇన్‌చార్జి సాయిబాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.వి.నారాయణ పాల్గొన్నారు.

**● రోడ్డంతా పచ్చదనమే**

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పోటెత్తారు. గిద్దలూరులోని ప్రధాన వీధులన్ని పసుపుపచ్చమయమైంది. మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సభాస్థలి మొత్తం నిండిపోయింది. మంత్రులు, ఎమ్మెల్యేలను తీసుకుని మోటార్ సైకిల్ ర్యాలీతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మార్కెట్‌యార్డుకు రాగా రాచర్ల గేటు నుండి మార్కెట్‌యార్డు వరకు ఇరువైపులా స్వాగత బ్యానర్లు, రోడ్డు మీద టీడీపీ శ్రేణులతో నిండిపోయింది. మార్కెట్‌యార్డు వద్ద ప్రత్యేక క్రేన్ సహాయంతో మంత్రులకు గజమాలలు వేసి స్వాగతం పలికారు. అతిథులకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి జ్ఞాపికలు అందచేసి ఘనంగా సన్మానించారు.

## బేస్తవారపేటలో సీసీ రోడ్లను ప్రారంభించిన మంత్రి

బేస్తవారపేట ఆగస్టు4(ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేటలో ఉపాధి పథక నిధులు రూ.93లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిలు ప్రారంభించారు. అలాగే బేస్తవారపేట నుంచి చిన్న కంభం వెళ్లే రహదారికి నాబార్డ్ నిధులు రూ.95లక్షలు మంజురుకావడంతో ఆ రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే అశోక్‌రెడ్డిలు మాట్లాడుతూ బేస్తవారపేటలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండటంతో పాటు చిన్నకంభం వెళ్లే రహదారిలో ప్రయాణం చేయాలంటే భయమేస్తుందని ప్రజలు విన్నవించడంతో ఆమేరకు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు, మండల పార్టీ అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్‌రెడ్డి, చెట్టిచెర్ల మాజీ సర్పంచ్ తీగిరెడ్డి భూపాల్‌రెడ్డి, దూదెకుల ఆదాం, గంగయ్య యాదవ్, బుద్దుల పేంప్రానంద్, పూనూరు జగన్మోహన్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

## కంభం మండలంలో రూ.2.43 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

కంభం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో రోడ్లు పూర్తిగా శిథిలమై మోకాలిలోతు గోతులతో నరకానికి మార్గాలుగా ఉండేవని, నేడు ప్రజా ప్రభుత్వ పాలనలో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్లు రాచమార్గాలుగా మారాయని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. సోమవారం గిద్దలూరులో కంభం, గిద్దలూరు మార్కెట్‌యార్డుల చైర్మన్లు, బోర్డు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మార్గమధ్యంలోని కంభం మండలం కందులాపురం పంచాయతీ సచివాలయ సమీపంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కంభం గ్రామపంచాయతీ పరిధిలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.33 కోట్లు, హజరత్‌గూడెం గ్రామపంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.40లక్షలు, కందులాపురం గ్రామపంచాయతీ పరిధిలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.70 లక్షలు, మొత్తం 2.43 కోట్లతో రోడ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు.

**● ఇమామ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు**

కంభం, గిద్దలూరు మార్కెట్ కమిటీ చైర్మన్ల ప్రమాణ స్వీకార బహిరంగ సభలో సుమారు 100 మంది టీడీపీ కార్యకర్తలతో టీడీపీ నేత ఎస్ఆర్ఐ రఫి ఆధ్వర్యంలో ముస్లిం ఇమామ్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఆర్ఐ రఫి, షేక్ అబ్దుల్ జిలాని, షేక్ దీనావలి, రహంతుల్లా, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

**● నేడు బేస్తవారపేట మండలంలో విద్యుత్ సరఫరా బంద్**

బేస్తవారపేట, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి) : కంభం సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ ఫీడర్‌కు సంబంధించి మరమ్మతుల కారణంగా మండలంలోని బేస్తవారపేట, మోక్షగుండం, పిటికాయగుళ్ల, అక్కపల్లె, సింగరపల్లె విద్యుత్ ఉపకేంద్రాల పరిధిలోని సంబంధించిన అన్ని గ్రామాలకు ఉదయం 6 నుంచి సాయంత్రం 4గంటల వరకు వ్యవసాయ బోర్లకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ ఎస్.ఎస్ రావు తెలిపారు. ఈవిషయాన్ని గమనించి ప్రజలు సహకరించాలని కోరారు.

**● నేడు ఉచిత కంటి శుక్లాల వైద్య శిబిరం**

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఉచిత కంటి శుక్లాల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వాసవీ క్లబ్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ అంధత్వ నివారణ సంస్థ, శంకర్ కంటి ఆసుపత్రిలో కంటి రోగులను పరీక్షిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 9848291408, 9492081140 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

**● 7న దోర్నాలలో మెగా జాబ్ మేళా**

పెద్ద దోర్నాల, ఆగస్టు (4ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లికార్జున డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల7 వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు బట్టు విద్యా సంస్థల చైర్మన్ బట్టు రమణా రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రగొండ పాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాకు పదో తరగతి నుంచి ఏ విభాగంలోనైనా డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 30 సంవత్సరాల వయస్సున్న అభ్యర్థులు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

**● నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి**

తర్లుపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు జవహర్ నవోదయ విద్యాలయం-2లో 11వ తరగతి ప్రవేశానికి ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. పశ్చిమ ప్రకాశంలోని 27 మండలాలకు చెందిన అభ్యర్థులు 10వ తరగతి పాసైన వారు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పదో తరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించామన్నారు. దరఖాస్తులను నవోదయ విద్యాలయంలో స్వయంగా గానీ, లేదా ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చని తెలిపారు.

## ఇడుపూరులో తాగునీటి సమస్యను పరిష్కరించండి


నీటి సమస్యను టీడీపీ నేత రామాంజులరెడ్డికి తెలియజేస్తున్న మహిళలు

మార్కాపురం రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇడుపూరు గ్రామంలోని కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని దరిమడుగు సచివాలయం వద్ద మహిళలు సోమవారం ఆందోళన చేశారు. ఆ సమయంలో సచివాలయంలో ఉన్న టీడీపీ నాయకుడు మాజీ సర్పంచ్ జవ్వాజి రామాంజులరెడ్డికి సమస్యను వివరించారు. మూడు నెలల క్రితం బోరు మరమ్మతులకు గురికావడంతో తాగునీటికి ఇక్కట్లు పడుతున్నామని తెలిపారు. ఈ నెల 1 తేదీ వరకు ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసిందని, ప్రస్తుతం ట్యాంకర్లను నిలిపి వేయడంతో తాగునీటి సమస్య మొదలైందని వివరించారు. గ్రామ వైసీపీ సర్పంచ్ సమస్యను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. స్పందించిన టీడీపీ నేత రామాంజులరెడ్డి అధికారులకు సమాచారం తెలియజేసి వంగళవారం సాయంత్రంలోగా బోరును రిపేరు చేయిస్తానని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు వెళ్లిపోయారు.

## సారమెరిగి సాగు చేస్తేనే రైతులకు మేలు


భూసార పరీక్షలపై తన అభిప్రాయం వివరిస్తున్న రైతు

త్రిపురాంతకం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : భూమిలో సారమెరిగి సాగుకు ఉపక్రమించాలని దానివల్ల మెరుగైన ఫలితాలు పొందుతారని వ్యవసాయాధికారి సంగమేశ్వరరెడ్డి చెప్పారు. మండలంలోని దూపాడులో సోమవారం వ్యవసాయశాఖ ఆత్మ సౌజన్యంతో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ మానవునికి ఆరోగ్య పరీక్షలు ఎంత అవసరమో భూమికి కూడా పరీక్షలు అవసరమన్నారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీటీఎం నాగభూషణం, వీఏఏ మంత్రునాయక్, అచ్యుత రావు పాల్గొన్నారు.

**జీవన ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన**

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువుల వినియోగాన్ని పెంచడం వలన పంటలు అధిక దిగుబడి వస్తుందని ఎర్రగొండపాలెం ఏవో నీరజ చెప్పారు. సోమవారం మండలంలోని గంజివారిపల్లిలో ఆత్మ ఒంగోలు సౌజన్యంతో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గిద్దాం - జీవన ఎరువుల వినియోగాన్ని పెంచుకుందాం అనే నినాదంతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విభాగ ట్రైనర్ మద్దయ్య జీవన ఎరువు వాడకం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఆర్ వెంకటేశ్వర్ల నాయక్, సిబ్బంది రైతులు పాల్గొన్నారు

**● ఏఎంసీ డైరెక్టర్లు నాలుగు ఇచ్చిన ఘనత అశోక్‌రెడ్డిదే**

కొమరోలు, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి) : మండలానికి ఏఎంసీ డైరెక్టర్ల పోస్టులు నాలుగు ఇచ్చిన ఘనత ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికే దక్కుతుందని కొమరోలు సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవరెడ్డి చెప్పారు. గిద్దలూరు మార్కెట్ యార్డులో జరిగే గిద్దలూరు, కంభం ఏఎంసీ చైర్మన్ మరియు పాలక మండల ప్రమాణ స్వీకార మహోత్సవానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి భారీగా ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యాకర్తలు వెళ్ళారు. ఈసందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ 3టీడీపీ, ఒకటి జనసేన పార్టీలకు కేటాయించి కూటమి ధర్మాన్ని పాటించారన్నారు. కొమరోలులో మినీ మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డైరెక్టర్లు బిజ్జాల తిరుమలరెడ్డి, షేక్ హసీనా, గోడి ఓబుల్‌రెడ్డి, గజ్జలకొండ నారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షులు పులకుర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**● డ్రైవర్స్ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలి**

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 3వ వార్డు పరిధిలోని డ్రైవర్స్ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫి మాట్లాడుతూ డ్రైవర్స్ కాలనీలో నీటి సౌకర్యం లేక రోజువారి కూలి పనులు చేసుకునే కూలీలు సైతం పనులు మానుకొని నీటికోసం ఎదురుచూడాల్సి వస్తోందని తెలిపారు. బోరును ఏర్పాటు చేసి పైప్ లైన్ల ద్వారా నీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రూబెన్, నన్నెసా, మహబూబ్ బాషా, సారా, ఎస్తేరమ్మ పాల్గొన్నారు.

**● గ్రామ రెవెన్యూ అధికారుల సమావేశం**

పెద్ద దోర్నాల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారుల సమావేశం సోమవారం నిర్వహించారు. వీఆర్వోల సంఘం అధ్యక్షులు కోటపాటి ఏడుకొండలు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వీర్‌వోలు సునీత, శ్రీనివాసులు, ఆనందరావు, సామేలు, కోటయ్య, చెన్నయ్య, జయప్రకాశ్, ఎస్తేరు రాణి, వెంకటయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

**● సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే**

పెద్దదోర్నాల, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎర్రగొండపాలెం శాసన సభ్యులు చంద్రశేఖర్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు వార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగమహేశ్వరి, వైద్యులు సంజీవ్, లావణ్య, ఆనందరావు, సిబ్బంది, వైసీపీ మండల కన్వీనర్ ఘంటా వెంకట రమణారెడ్డి, నాయకులు గొల్మారు శేఖర్‌రెడ్డి, చిట్యాల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**● అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే**

ఎర్రగొండపాలెం, ఆగస్టు 4 ( ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం ఏరియా వైద్యశాల ఆవరణలో నల్లమల అడవిలో ఉంటున్న గిరిజనుల కోసం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఉచితంగా మంజూరు చేసిన అంబులెన్స్ వాహనాన్ని సోమవారం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రారంభించారు. అనంతరం డాక్టర్లతో వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదాలో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏరియా వైద్యశాలలో ట్రామా కేర్ సెంటరుతోపాటు, రక్తనిధిని ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల పర్యవేక్షకులు యాధిద్య, ఎంపీపీ కిరణ్ గౌడ్, జడ్పీటీసీ సభ్యుడు విజయ బాస్కర్, సర్పంచి అరుణాబాయ్ పాల్గొన్నారు.

**● దరిమడుగులో వైభవంగా యల్లమ్మ తల్లి కొలుపులు**

మార్కాపురం రూరల్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దరిమడుగు గ్రామంలో నాగారపు యల్లమ్మ తల్లి కొలుపులు కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా యల్లమ్మ తల్లికి కొలుపు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కొలుపులలో పాల్గొని యల్లమ్మ తల్లికి మొక్కులు తీర్చుకున్నారు.

**● ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలి**

పెద్దదోర్నాల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాల అమలు గురించి ప్రజలకు తెలియజేయాలని ఎంపీడీవో నాసర్ రెడ్డి చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గ్రామ కార్యదర్శులు, సచివాలయం, అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు అంశాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై సమగ్రంగా తెలుసుకుని గ్రామప్రజలకు కూడా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దోర్నాల పంచాయతీ ఈవో శివ కోటేశ్వర రావు పాల్గొన్నారు.

## వైపాలెం ఏఎంసీ వ్యవహారంపై హైకోర్టు విచారణ

అవీఇవీ

**13లోగా కౌంటరు దాఖలు చేయాలని అధికారులకు ఆదేశాలు**

త్రిపురాంతకం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రిజర్వేషన్‌పై దాఖలైన పిటిషన్లపై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎస్టీలకు కేటాయించిన తరువాత మళ్లీ దానిని ఓసీలకు కేటాయించి చైర్మన్ నియామకం చేపడుతూ ఇచ్చిన జీవో 593ను సవాలు చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఉద్యోగ సంఘం జాతీయ ప్రదాన కార్యదర్శి ఆరె రమణయ్య పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ జరుపుతున్న కోర్టు అదే సమయంలో బంజార సంఘం, సుగాలి నాయకులు ఇద్దరు వేసిన మరో రెండు పిటిషన్లపై వ్యాఖ్యానిస్తూ అన్నీ ఒకే సమస్యకు సంబంధించినవి కావటంతో అన్నింటినీ కలిపి విచారణ జరుపుతున్నట్లు తెలిపింది. తమకు కౌంటరు దాఖలుకు మూడు వారాలు గడువు కావాలని ప్రభుత్వం తరపు లాయరు కోరటంతో న్యాయమూర్తి స్పందిస్తూ ఇందులో మూడు వారాలు సమయం కోరదగిన విషయం ఏముంది? ఈనెల 13లోగా కౌంటరు దాఖలు చేయాలని ఆదేశిస్తూ ఈ కేసు విచారణను 13తేదీకి వాయిదా వేశారని పిటిషనర్లు తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విశ్వనాథపురం విద్యార్థినులు


ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

త్రిపురాంతకం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని విశ్వనాథపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మాగులూరి కోటేశ్వరరావు తెలిపారు. గత నెల 31న ఎర్రగొండపాలెంలోని గురుకుల పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో జావిలిన్‌త్రో, లాంగ్ జంప్, హైజంప్ పోటీల్లో టి.అమూల్య, పి.వి. కావ్య, కె.ఇందు ప్రతిభ కనబరిచి ప్రథమస్థానాల్లో నిలిచారన్నారు. వీరు ఈనెల 9, 10, 11 తేదీల్లో చీరాలలో జరిగే జూనియర్ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రవీంద్రబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుళ్లా వెంకటనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

## గ్రంథాలయ శాఖలో ఖాళీలు భర్తీ చేయాలి


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పిచ్చయ్య

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గ్రంథాలయ శాఖలో దాదాపు 3వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన డీవైఎఫ్ఐ కార్యకర్తల సమావేశంలో పిచ్చయ్య మాట్లాడుతూ పబ్లిక్ గ్రంథాలయాలలో 974 స్కూల్ ప్రెసిడెన్స్ స్కూల్లో 1800, జూనియర్, డిగ్రీ కళాశాల గ్రంథాలయాలలో 300 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని రెగ్యులర్ పద్ధతిలో భర్తీ చేయాలన్నారు. అనంతరం గ్రంథాలయ శాఖ ఖాళీ పోస్టుల సాధన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మణికంఠ, కార్యదర్శిగా చెన్నారెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్యామ్‌బాబు, ఖాదరయ్య, శివ, సహాయ కార్యదర్శులుగా తేజ, మల్లికార్జున, గురువయ్యలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు జబ్బార్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సేవలు ఉపయోగించుకోవాలి


అంగన్‌వాడీల్లో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రవికుమారి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అంగన్‌వాడీలలో అందిస్తున్న సేవలు ఉపయోగించుకోవాలని సూపర్‌వైజర్ రవికుమారి చెప్పారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా చెన్నకేశవ నగర్ అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, పిల్లలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


తన ఇద్దరు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయురాలు కల్పనతో యూటీఎఫ్ నేతలు

రాచర్ల, ఆగష్టు 4 (ఆంధ్రజ్యోతి) : నాణ్యమైన విద్యతోపాటు భద్రతా, భరోసా ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తాయని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పాలుగుళ్ల రమణారెడ్డి చెప్పారు. మండలంలోని ఆరవీటికోట ప్రాథమిక పాఠశాలలో సోమవారం యూటీఎఫ్ సభ్యులతో ఆయన ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు కల్పన తన ఇద్దరు పిల్లల్ని తాను పనిచేస్తున్న పాఠశాలలోనే చేర్పించుకుని విద్యాబుద్దులు నేర్పించడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి ఉపాధ్యాయుడు ప్రతి ఉపాధ్యాయురాలు ఆలోచించాలని కోరారు.

## ఇంటి, నీటిపన్నులు సకాలంలో చెల్లించండి

పొదిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఇంటి, నీటిపన్నులు సకాలంలో చెల్లించాలని నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి కోరారు. అక్రమంగా ఏర్పాటు చేసుకున్న నీటి కొళాయిలకు జూలై 26వ తేదీ వరకు గడువు ఇచ్చామని తెలిపారు. ఆ వ్యవధిలో సుమారుగా 77మంది మాత్రమే ట్యాప్ కనెక్షన్లకు డిపాజిట్ చెల్లించి క్రమబద్ధీకరించుకున్నారన్నారు. శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు రామనగర్‌లో రెండు జీఎల్ఎస్ఆర్ ట్యాంకులు నిర్మించామని, దీంతో ఆకాలనీలో నీటి సమస్య కొంతవరకు తీరిందని చెప్పారు.

## తీగలేరును చిన్న కండ్లేరుతో అనుసంధానించాలి

పుల్లలచెరువు, ఆగష్టు 4(ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రకాశంలో శాశ్వతంగా కరువును తీర్చేందుకు పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి తీగలేరును పుల్లలచెరువు చిన్న కండ్లేరు చెరువుకు అనుసంధానించాలని రైతులు ఆలోచనాపరుల బృందం ప్రతినిధి ఏబీ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం వెలిగొండ ప్రాజెక్టుకు వద్ద ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన బృందం ప్రతినిధులను వారు కలిశారు. ఈ కార్యక్రమంలో, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు కేవీవీ ప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి జీవీ గురునాథం, రైతులు జానకీ రఘు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


మృతిచెందిన కగోల్‌రెడ్డి

దర్శి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణానికి చెందిన మార్తుల కగోల్‌రెడ్డి(31) ఆదివారం బెంగుళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఆ యువకుడు లండన్‌లో ఎంబీఏ చేసి బెంగుళూర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం స్నేహితుల దినోత్స వం సందర్భంగా స్నేహితులతో కలిసి మోటార్‌సైకిల్‌పై భోజనాల కోసం హోటల్‌కు వెళ్లి తిరిగివస్తున్నారు. ఈక్రమంలో హైవేలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన కగోల్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## పాఠశాలల తనిఖీ

కురిచేడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని పలు పాఠశాలలను డైట్ కళాశాల అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ ఆర్.జగన్నాధరావు సోమవారం తనిఖీ చేశారు. స్థానిక ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతుల విద్యార్థుల అభ్యసన ప్రక్రియను పరిశీలించారు. వారిలో నైపుణ్యాలను పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. వైఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎమ్మార్సీలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటుచేసి విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంచటానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు వస్త్రంనాయక్, సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, బాషా, తదితరులు పాల్గొన్నారు.

## పామూరులో మోస్తరు వర్షం

పామూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎండవేడిమితో అల్లాడుతున్న ప్రజలకు సోమవారం మధ్యాహ్నం కురిసిన మోస్తరు వర్షంతో ఉపశమనం పొందారు. గంట పాటు పామూరులో వర్షం కురిసింది. అయితే పట్టణంలో ప్రధాన మురుగు కాలువల్లో వ్యర్థాలు ఉండటంతో వర్షం నీరు సక్రమంగా పారక మురుగునీరు రోడ్లపైకి చేరింది. దీంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు.

## సచివాలయానికి ప్రింటర్ అందజేత

పీసీపల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదఅలవలపాడు సచివాలయానికి ఆగ్రామ టీడీపీ నాయకుడు పువ్వాడి నాగరాజు సోమవారం ప్రింటర్‌ను అందజేశారు. సచివాలయంలో ఉన్న ప్రింటర్ మరమ్మత్తుకు గురై పనిచేయడం లేదు. దీంతో వివిధ సేవల కోసం సచివాలయానికి వచ్చిన ప్రజలు సంబంధిత సర్టిఫికెట్‌లు, ధ్రువీకరణ పత్రాలు పొందలేకపోతున్నారు. ఈక్రమంలో సచివాలయ సిబ్బంది ప్రింటర్ విషయాన్ని టీడీపీ నాయకుడు నాగరాజు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.15 వేలు విలువగల కొత్త ప్రింటర్‌ను కొని సచివాలయానికి అందజేశారు.

## అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

దొనకొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న హిందీ లెక్చరర్ కె.ధనుముని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి హిందీ సబ్జెక్టులో కనీసం 50శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ పాసై ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 6న కళాశాలలో జరిగే డెమో తరగతికి బయోడేటాతో పాటు సంబంధిత ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

## ఆధునికీకరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ముండ్లమూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువ ఆధునీకరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మోదేపల్లి మేజర్ పరిధిలో జరుగుతున్న పనులను ఎస్ఎస్‌పీ డిఈ పూర్ణచందుతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డ్రాపులు, కల్వర్టుల్లో అధికారులు నిర్ధేశించిన విధంగా పనిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనులు పూర్తయ్యేవరకు సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు.

## రెవెన్యూ సమస్యలపై 3 అర్జీలు

తాళ్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఆయన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంఈవో జి.సుబ్బయ్య, ఏవో బి.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగిఉండాలి

పామూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రైతులు, పశుపోషకులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ హనుమన్ తెలిపారు. పాడి పోషణ, ప్రకృతి వ్యవసాయం, మౌలిక వసతులు, ఇంకా మేలైన సేవలు, తదితర అంశాల గురించి ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. సర్వే ద్వారా రైతులు, పశుపోష కుల నుంచి వచ్చే సూచనలను నమోదు చేసుకొని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

# ఛిద్రమైన రోడ్లు

» ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్నవైనం

» ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


దర్శి - పొదిలి రోడ్డులో దెబ్బతిన్న కాటేరువాగు చప్టా


గుంతలమయమైన పాతకమూరు-పాపిరెడ్డిపాలెం రోడ్డు

దర్శి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు దర్శి ప్రాంతంలో అనేక రోడ్లు ఛిద్రమయ్యాయి. గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ.15 కోట్లతో అధికశాతం రోడ్లు మరమ్మతులు చేశారు. ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో లింక్, అంతర్గత రోడ్లు మరమ్మతులు చేయలేదు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు మరింత దెబ్బతిన్నాయి. పొతకమూరు - చెరువుకొమ్ముపాలెం మార్గంలో కంకర లేచిపోయి గుంతలమయమైంది. ఈ వర్షాలకు గుంతల్లోకి నీరుచేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అలాగే, దర్శి-సామంతపూడి రోడ్డు అనేకచోట్ల దెబ్బతిన్నది. దర్శి-పొదిలి రోడ్డులో కాటేరు వాగుపై నిర్మించిన చప్టా నెర్రలిచ్చి దెబ్బతింది. 70 సంవత్సరాల క్రితం నిర్మించిన చప్టా సామర్థ్యం కోల్పోయి కూలేదశకు చేరింది. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంకోసం గతంలో ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల కాలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వటంతో ఎంతో ప్రాధాన్యతకల్గిన దర్శి - పొదిలి రోడ్డులో ఈ చప్టా స్థానంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారి వాగు పొంగి గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతుంది. హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

# మెనూ నిర్వహణ సక్రమంగా ఉండాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, జిల్లా అధికారి లక్ష్మానాయక్

కనిగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థినులకు అందించే మెనూ నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై ఆశాఖ జిల్లా అధికారులతో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థినులతో మాట్లాడారు. రోజూ ఇచ్చే మెనూ ఎలా ఉందని ప్రశ్నించారు. హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాలు, భోజన మెనూ నిర్వహణ వంటి విషయాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.

జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మనాయక్ మాట్లాడుతూ విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మేలైన భోజన వసతి కల్పించాలన్నారు. మెనూ విషయంలో ఎలాంటి లోపాలు జరిగినా ఉపేక్షించేది లేదని వార్డెన్‌లను హెచ్చరించారు. విద్యార్థినుల నుంచి భవిష్యత్తులో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కార్యక్రమంలో ఎస్ఐ శ్రీరాం, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శివనాయక్, హాస్టల్ వార్డెన్‌లు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన పేదింటి బిడ్డలు


లక్ష్మీనారాయణ


వెంకటలక్ష్మయ్య


తాళ్ళూరి గోపి


తేలుకుట్ల రాంబాబు


సాయికుమార్


గోరా రమణయ్య

ముండ్లమూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు మండలంలోని భట్లపల్లి, ఈదర గ్రామాలకు చెందిన నలుగురు ఎంపికయ్యారు. మండలంలోని భట్లపల్లి గ్రామానికి చెందిన కాసుల లక్ష్మీనారాయణ సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అదేగ్రామానికి చెందిన గోపీ, తేలుకుట్ల రాంబాబు ఏపీఎస్‌పీ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యారు. ఈదర గ్రామానికి చెందిన నాగమల్లి వెంకటలక్ష్మయ్య సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఈ నలుగురు పేదింటి బిడ్డలు. ఆ కుటుంబాలు తమ పిల్లలను కష్టపడి చదివించి ప్రయోజకులను చేశారు.

కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన నలుగురు కూడా తమ తల్లిదండ్రుల కష్టాన్ని చూడలేక కష్టపడి చదివి వారి కోరిక నెరవేర్చారు. భట్లపల్లి గ్రామానికి చెందిన ముగ్గురికి కానిస్టేబుల్ పోస్టులకు ఎంపిక కావటంతో గ్రామానికి చెంది నెల్లూరు జిల్లాలోని మర్రిపాడు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న కాసుల శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈదర గ్రామానికి చెందిన లక్ష్మయ్య కూడా సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపిక కావటంతో గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

### దొనకొండ నుంచి ఐదుగురు

దొనకొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండలానికి చెందిన ఐదుగురు యువకులు పోలీస్ కానిస్టేబుల్స్‌గా ఉద్యోగాలు సాధించారు. ఈ ఏడాది జనవరిలో కానిస్టేబుల్స్ ఎంపిక నిమిత్తం నిర్వహించిన ఈవెంట్స్‌లో ఎంపికైన వారికి జూన్ 1న రాత పరీక్షలు నిర్వహించగా, ఇటీవల ఫలితాలు వెలువడ్డాయి. సివిల్ కానిస్టేబుల్స్‌గా గుట్టమీదపల్లి గ్రామానికి చెందిన అనిశెట్టి సాయికుమార్, ఇండ్లచెరువుకు చెందిన గోరా రమణయ్య ఎంపికయ్యారు. రామాపురంకు చెందిన దుగ్గెంపూడి ఏడుకొండలు రాజమండ్రిలోని ఇండియన్ రిజర్వు బెటాలిన్ కానిస్టేబుల్‌గా, కొచ్చెర్లకోటకు చెందిన మట్రం నాగరాజు, వల్లపునేనిపల్లికు చెందిన మంచాల నాగయ్య ప్రకాశం జిల్లా ఏపీఎస్‌పీ కానిస్టేబుల్స్‌గా ఎంపికయ్యారు. వీరికి కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.


మంచాల నాగయ్య


ఏడుకొండలు


మట్రం నాగరాజు

# కేజీబీవీలో విషసర్పాల సంచారం

» విద్యార్థినుల ఆందోళన

తాళ్లూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తాళ్లూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో విషసర్పాలు సంచరిస్తుండటంతో బాలికలు ఆందోళన చెందుతున్నారు. గతనెల 25వ తేదీ రాత్రి 9వతరగతి చదువుతున్న ప్రిమ్‌సెస్‌ను కాలుకు ఏదో కుట్టినట్లు అనిపించి నిద్ర లేచి చూడగా రక్తం వస్తున్నది. ఆబాలికను స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. కాలికి రెండు గాట్లు పడినట్లు గుర్తించి పాముకాటు వాక్సిన్ వేసి రాత్రికిరాత్రే అంబులెన్సులో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఆబాలిక నాలుగు రోజుల పాటు రిమ్స్‌లో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. ఆదేరోజు పైఅంతస్తులో గల డార్క్ రూమ్‌లో ఇంటర్ బాలికకు పెద్ద నల్లటి పాము కన్పించటంతో భయాందోళన చెంది పరుగులుతీశారు. మిగిలిన బాలికలు కూడా భయంతో కిందకు వచ్చారు. రెండు రోజుల క్రితం ఓబాలికల పైఅంతస్తులో దుస్తులు ఆరేస్తుండగా భవనంగోడ ఆనుకుని పెద్ద సర్పం వెళుతుండటాన్ని గమనించి తోటి విద్యార్థినులకు చెప్పగా వారిచూసి భయాందోళన చెందారు. కేజీబీవీ భవనం వెనుకవైపు మరుగు ఎక్కువగా ఉంది. అక్కడ వున్న చెట్లు ఏపుగా పెరిగాయి. విషసర్పాలు చెట్లపైగా పాకుతూ పైఅంతస్తులో గల కిటికీల ద్వారా డార్క్ రూమ్‌లోకి వస్తున్నాయని విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. విద్యాలయంకు అదనపు గదుల నిర్మాణాలు జరుగుతూ ఉండటంతో సామగ్రి, వ్యర్థ పదార్థాలు అక్కడే వేయగా మరుగుఏర్పడింది. మరుగు తొలగించక పోవటం, ఏపుగా పెరిగిన చెట్లను నరికి వేయక పోవటంతో కేజీబీవీలో తరుచూ విషసర్పాలు సంచరిస్తున్నాయి. పది రోజుల్లో మూడు సర్పాలు కన్పించటంతో బాలికలు రాత్రి వేళ నిద్రపోవాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కేజీబీవీ విద్యాలయం పరిసరాల్లో ఉన్న మరుగును తొలగించి విద్యార్థినుల భద్రతకు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# శిథిలావస్థలో పంచాయతీ కార్యాలయం

» ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్థుల ఆందోళన


శిథిలావస్థలో పంచాయతీ భవనం

పామూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడు గ్రామ నడిబొడ్డున ఉన్న పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరింది. ఈ భవనం ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. మూడు దశాబ్దాల కిందట ఈభవనాన్ని నిర్మించారు. ఇది పెచ్చులూడి స్లాబుకు ఉన్న ఇనుప కమ్ములు బయటకు దర్శనమిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఈభవనాన్ని నిరుపయోగంగా వదిలేసింది. గ్రామ సచివాలయం భవనం నిర్మించినా ప్రారంభించలేదు. దీంతో అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

ఇదిలాఉండగా, శిథిలావస్థలో ఉన్న పంచాయతీ భవనం వరండాలో పశువులను కట్టి వేస్తున్నారు. పిల్లలు ఆడుకుంటూ అటువైపు వెళుతున్నారు. గోడలు, శ్లాబు శిథిల స్థితికి చేరింది. పంచాయతి భవనం శిథిలావస్థకు చేరడంతో గత వైసీపీ ప్రభుత్వం మోపాడులో గ్రామ సచివాలయం నిర్మించారు. మోపాడుకు చెందిన ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్ అంతా వైసీపీకి చెందిన వారైనప్పటికీ నిర్మాణపనులు పూర్తయినా గ్రామ సచివాల యం ప్రారంభంకాక పోవడం గమనార్హం. ఇప్పటికైనా పాలకులు స్పందించి పాత పంచాయతీ భవనాన్ని తొలగించి, సచివాలయాన్ని ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# రెవెన్యూ రికార్డు మాయం

» ఆరుగురు అధికారులపై కేసు నమోదు

ముండ్లమూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంఖరాపురం గ్రామానికి చెందిన వన్‌బీ మాన్యువల్ రికార్డు మాయమైంది. దీంతో ఆరుగురు రెవెన్యూ అధికారులపై కేసు నమోదైంది. శంఖరాపురం గ్రామానికి చెందిన మేడికొండ వెంకటకృష్ణారావుకు, అదే గ్రామంలో మరొకరికి పొలం వివాదం ఉంది. వన్‌బీ మాన్యువల్ రికార్డు చూసి న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను ప్రాధేయపడినా ఉపయోగం లేకుండాపోయింది. దీంతో కృష్ణారావు హైకోర్టులో కేసు వేశారు. ఈరికార్డు అటు శంఖరాపురం, ఇటు తహసీల్దార్ కార్యాలయంలోనూ లేదు. దీంతో రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగానే మాయంచేసి ఉంటారని హైకోర్టు జడ్జి అభిప్రాయపడ్డారు. వన్‌బీ రికార్డు మాయం వెనుక ఎవరెవరి పాత్ర ఉందో గుర్తించటంతో పాటు 2018 నుంచి 2022 వరకు పనిచేసిన రెవెన్యూ అధికారులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈమేరకు కలెక్టర్ స్థానిక తహశీల్దార్ లక్ష్మీనారాయణను అప్పుడు పనిచేసిన అధికారులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. ఆయన ఫిర్యాదు మేరకు అప్పటి తహసీల్దార్లు జి.నాంచారయ్య, పాలపర్తి పార్వతి, అప్పటి డీటీ కె.రవికుమార్, ప్రస్తుత డీటీ అద్దంకి స్రవంతి, అప్పటి సీనియర్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, అప్పటి శంఖరాపురం వీఆర్వో నంబూరి గురవయ్యలను అనుమానితులుగా భావించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కమలాకర్ తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

పామూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాబోలువారిపల్లి గ్రామంలో శ్రీ సీతారామస్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆవుల నాగేశ్వరరావు, బొట్లగూడూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు కోటపాటి వెంకటేశ్వర్లు, నెలకుర్తి మహేశ్వరరావు, కోటపాటి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్, జడ్పీటీసీ చప్పడి సుబ్బయ్య, ఎంపీటీసీ పోలినేని శ్రీనివాసులు, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థాన నిర్వాహకులు నారాయణయాదవ్‌ను శాలువాతో సన్మానించారు.

## ఘనంగా పోలేరమ్మ కొలుపులు

తాళ్లూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంబొట్లపాలెం గ్రామంలో పోలేరమ్మతల్లి కొలుపులు గత రెండు రోజులుగా ఘనంగా నిర్వహించారు. కొలుపుల సందర్భంగా గ్రామస్థులు సంప్రదాయపద్ధతుల్లో పోలేరమ్మ తల్లి, బొల్లి ఆవులు, పావనం, వీరతాళ్లకు గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నార

## అంగన్‌వాడీల్లోనే సంపూర్ణ పౌష్టికాహారం లభ్యం


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శివపార్వతి

కనిగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోనే సంపూర్ణ పౌష్టికాహారం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివపార్వతి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని గురవాజీపేట అంగన్వాడీ సెక్టార్ పరిధిలోని చినఅలవలపాడు గ్రామంలో తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగించటం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలే రోజుకు 8 నుంచి 10సార్లు ఇవ్వాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని పి.అనురాధ, అంగన్‌వాడీ వర్కర్‌లు జ్యోతి, కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రుచికరంగా భోజనం వడ్డించాలి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు రుచికరంగా మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈవో రాజాల కొండారెడ్డి సూచించారు. సీఎస్‌పురం మండలంలోని శీలంవారిపల్లిలోగల కదిరి నరసయ్య లక్ష్మమ్మ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ కళాశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వంట నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బోడ ప్రసాద్, ఎన్. వెంకట్రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో అవకతవకలు

దొనకొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇండ్లచెరువు-2 అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త విధుల్లో అవకతవకలకు పాల్పడుతూ ప్రభుత్వ పథకాలను పక్కదారి పట్టిస్తుందని గ్రామానికి చెందిన పి.సుబ్బయ్య, తదితరులు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ మేరకు ఇటీవల మీ కోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. గ్రామంలో ఆశ వర్కర్‌గా పనిచేస్తున్న సదరు కార్యకర్త కుమార్తె 2020లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంది. అర్హత లేకున్నా ఆమె పేరును గర్భిణిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఏడాదికాలంగా ప్రభుత్వం అందించే పథకాలను వర్తింపజేస్తున్నారని ఆరోపించారు. ఈవిషయమై సూపర్‌వైజర్ సుభాషిణిని వివరణ కోరగా.. ఆన్‌లైన్‌లో పొరపాటుగా నమోదైన విషయాన్ని గుర్తించి గర్భిణులకు అందించే ఫీడింగ్ ఒక్కనెల కూడా ఆ మహిళకు అందించకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

## నారాయణస్వామి హుండీ ఆదాయం రూ.లక్షా 75వేలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి ఆదివారం హుండీ ఆదాయం రూ.లక్షా 74వేలు వచ్చినట్లు ఈవో నరసింహబాబు తెలిపారు. టిక్కెట్ల అమ్మకంద్వారా రూ.65,900, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ. 30,290, శాశ్వత అన్నదానానికి రూ.44,800, పంచామృత అభిషేకానికి రూ.27,580, ఇతర విరాళాల ద్వారా రూ.5,500 వంతున ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.

## బెల్లంకొండవారిపాలెంను పరిశీలించిన స్వచ్ఛ సర్వేక్ష బృందం

తాళ్లూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండంలోని బెల్లంకొండవారిపాలెం గ్రామ పంచాయతీని సోమవారం స్వచ్ఛ సర్వేక్ష బృందం పరిశీలించింది. గ్రామంలో ఇంటింటికి తిరిగి పారిశుధ్యం, ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిశీలించారు. స్వచ్ఛతపై గ్రామంలో చేపడుతున్న చర్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పాఠశాలను, డంపింగ్ యార్డును పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోశం సుమలత, ఎంపీటీసీ గూడా సరస్వతి, పంచాయతీ కార్యదర్శి శ్రీవల్లి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, డీపీవో కార్యాలయ సిబ్బంది ఖజావలి, రవి, విజయవాడ సెంట్రల్ కార్యాలయ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

వెలిగండ్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాత నేరస్థులపై నిరంతరం నిఘా ఉంటుందని ఎస్ఐ కృష్ణపావని అన్నారు. మంచి సత్ప్రవర్తనతో ఉండాలన్నారు. వెలిగండ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత నేరస్థులకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలను వేధిస్తే నూతన చట్టాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మికసంఘం మహాసభలను జయప్రదం చేయాలి

కనిగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కనిగిరిలో ఈనెల 12, 13 తేదీల్లో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుల విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. ఇటువంటి సంక్షోభ స్థితిలో వ్యవసాయరంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరికపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, కేశవరావు, వి.మాలకొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు శిశువుకు అమృతం



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ సీడీపీవో లావణ్య

పామూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని ఇన్‌చార్జ్ సీడీపీవో పి.లావణ్య అన్నారు. పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు తాపించాలన్నారు. పట్టణంలోని వడ్డెపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం జరిగిన తల్లిపాలు వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. ఈనెల 7 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షేక్ నాయబ్ రసూల్, గోళ్ల పద్మజ, హెచ్ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో నీటి ప్రవాహం

# పుష్కలం..!

- సాగర్ కుడి కాల్వకు 7,500 క్యూసెక్కులు
- కాల్వలకు సాగు నీటి కళ
- వ్యవసాయ పనుల్లో తీరిక లేని రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి):

కృష్ణమ్మ సాగర్ కుడి కాల్వలో పరవళ్లు తొక్కుతోంది. జలవనరుల శాఖ పుష్కలంగా సాగు నీటిని విడుదల చేస్తోంది. బ్రాంచ్ కాల్వల నుంచి మైనర్ కాల్వల వరకు జలకళను సంతరించుకున్నాయి. దాదాపు అన్ని కాల్వలకు నీటి సరఫరా చేస్తుండటంతో పంటల సాగు ఊపందుకుంది. ఇప్పటికే వరి నారుమళ్లు పోసిన రైతులు.. రానున్న పది రోజుల్లో వరినాట్లు పూర్తిస్థాయిలో ప్రారంభించనున్నారు. నకరికల్లు, రాజుపాలెం మండలాల్లోని పలు ప్రాంతాల్లో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. అలాగే.. వర్షాభావం నెలకొన్న 15 మండలాల్లో సాగర్ నీటితో పంటల సాగు చేపట్టారు. కంది, మొక్కజొన్న, మిరప పంటలను సాగు చేస్తున్నారు. పంటల సాగులో అన్నదాతలు తీరికలేకుండా ఉన్నారు. ట్రాక్టర్ల నిర్వహకులకు చేతి నిండా పని లభిస్తోంది. వ్యవసాయ కార్మికులకు పుష్కలంగా పనులు దొరుకుతున్నాయి. సాగర్ డ్యాం నుంచి జవహర్ కుడి కాల్వకు 7,500 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. బుగ్గ వాగు రిజర్వాయర్ నుంచి కుడి కాల్వకు 7,500 కూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. బ్రాంచ్ కెనాల్స్, మేజర్ కాల్వలపై ఉన్న విద్యుత్ ప్లాంట్‌లలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.



చిలకలూరిపేట మేజర్‌లో కృష్ణమ్మ పరవళ్లు

- సుంకం దెబ్బకు ఆక్వా రైతు విలవిల
- రొయ్యల ఎగుమతులపై అమెరికా పోటు!
- ధరల పతనానికి తోడు పన్ను బాదుడు
- సాగు కష్టమేనంటున్న రైతులు





బాపట్ల రూరల్ పరిధిలో ఆక్వా సాగు

# ఇదేంది రొయ్యా.. ట్రంపు!

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న సుంకాల నిర్ణయంతో ఆక్వా మళ్లీ సంక్షోభం వైపుగా వెళ్లే సూచనలు కనబడుతున్నాయి. 25 శాతం సుంకం నిర్ణయం ఆక్వా రంగాన్ని కూడా గట్టిగానే తాకనున్నట్లు తెలుస్తోంది. ఓ పక్క రొయ్యలకు అంతుచిక్కని వ్యాధులు, మరో పక్క ధరల పతనంతో అల్లాడుతున్న రొయ్య రైతులకు ట్రంప్ సుంకం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో ఆక్వా రంగం దాదాపు అంపశయ్యపైకి చేరింది. విద్యుత్ రాయితీలు మొదలుకుని మేత ధరల తగ్గింపు వరకు అన్ని విషయాల్లో ఆక్వా రైతాంగాన్ని గత ప్రభుత్వం నిలువునా దగా చేసింది. ఆక్వా ఎగుమతులపై అనధికారిక జే ట్యాక్స్ వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసింది. ఆక్వా రంగాన్ని తిరిగి గాడిన పెట్టడానికి ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ రాయితీలపై ఇటీవలే ఊరట కలిగించే ప్రకటన చేసింది. 25 కిలోల మేత బస్తాపై వంద రూపాయల వరకు తగ్గించింది. ఆక్వా ఎగుమతులకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించే దిశగా అడుగులేస్తున్న దశలోనే.. ట్రంప్ టారిఫ్ నిర్ణయం.. కలవరపాటుకు గురిచేస్తోంది.**

(బాపట్ల, ఆంధ్రజ్యోతి):

బాపట్ల జిల్లా నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న రొయ్యల విలువ ఏడాదికి దాదాపు రూ.888 కోట్లుగా ఉంది. ఇందులో సింహభాగం అమెరికాదే కావడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా దాదాపు 22,500 ఎకరాల్లో రొయ్యలు సాగవుతుండగా, ఇందులో వనామి వాటా 70 శాతం, టైగర్ రొయ్యల సాగు 30 శాతంగాను ఉంది. జిల్లాలో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు ఐదు ఉండగా దాదాపు పదివేల మంది ఈ రంగంపై ఆధారపడి ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో అగ్రికల్చర్ తర్వాత ఆక్వా సాగుదే అగ్రభాగం. ట్రంప్ తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఎగుమతు ద్వారా జనరేట్ అయ్యే ఆదాయంలో 25 శాతం పన్నుల రూపంలో పోవడమంటే దాదాపు రూ.200 కోట్ల (మిగతా 6లో)

**ఆ ప్రభావమే ఇప్పటికీ ఉంది**

సాగుపై భరోసా నిచ్చే విధం గా అనేక ప్రకటనలు ప్రభుత్వాల వైపు నుంచి వస్తున్నా రైతాంగాన్ని మాత్రం ట్రంప్ భయం వెంటాడుతూనే ఉంది. ఎగుమతులపై అమెరికా విధిస్తున్న సుంకాలకు విరుగుడుగా అక్కడి నుంచి మనం దిగుమతి చేసుకుంటున్న రొయ్యల మేతపై సుంకాన్ని పెంచాలనే వినతు లను రొయ్య రైతు సంఘాలు గతంలోనే ప్రభుత్వాలకు అందించాయి. దీని ప్రభావం కూడా అంతిమంగా ఇక్కడి రైతులపైనే పడుతుందనే అభిప్రాయమే అన్ని వైపుల నుంచి వ్యక్తమవడంతో ప్రస్తుతం కేంద్రం విధిస్తున్న 5 శాతం సుంకం నిర్ణయమే కొనసాగుతోంది.

రాష్ట్ర వ్యాప్తంగా జాషువా

# జయంత్యుత్సవాలు

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

నరసరావుపేట టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పేదరికం సహనాన్ని, కుల వివక్షను ఎదురించి పోరాడే తత్వాన్ని తనకు నేర్పాయని గుర్రం జాషువా అన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. సోమవారం పల్నాడు జిల్లా పర్యటనలో భాగంగా నరసరావుపేట పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల నుంచి జమీందారు పంక్షన్ హాలు వరకు బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న మాధవ్ స్థానిక గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహోన్నత శిఖరం గుర్రం జాషువాకు నివాళులర్పించి నరసరావుపేట జిల్లా పర్యటన ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సెప్టెంబరు 28న బీజేపీ రాష్ట్ర



జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు

వ్యాప్తంగా గుర్రం జాషువా జయంతి ఉత్సావాలు నిర్వహిస్తుందని చెప్పారు. నిరుపేద కుటుంబంలో పుట్టి వివక్షకు గురై కూడా గుర్రం జాషువా.. తిరుపతి వేంకట కవుల ద్వారా గండపెండేరాన్ని ధరించడం, అశ్వవాహనంలో ఊరేగడం, ఆయనతో పాటు అప్పటి ముఖ్యమంత్రి బెజవాడ గోపాల కృష్ణారెడ్డి కూడా రావడం ఒక మహత్తరమని మాధవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేలూరి శశికుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.దయాకర్‌రెడ్డి, ఎ.సుధాకర్‌బాబు, పాతూరి నాగభూషణం, హనుమంతరావు, కె.సుబ్బారావు, చిరుమామిళ్ల అదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలను నిర్ణీత గడువులో పరిష్కరించాలి

- ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అర్జీదారుల సమస్యలు నిర్ణీత గడువులోపు చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ తుషార్ డూడి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని ఎస్పీ సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను స్వయంగా ఎస్పీకి విన్నవించుకున్నారు. అర్జీదారుల సమస్యలు విని ఇచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే సంబంధిత పోలీసుఅధికారులకు ఫోన్ చేసి మాట్లాడి అర్జీలను చట్టపరిధిలో త్వరితగతిన విచారించి నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

## అంత లెక్క లేదా?

- లేబర్ ఆఫీసర్‌పై కలెక్టర్ ఆగ్రహం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి):

క్వారీల్లో పనిచేసే కార్మికుల వివరాలు లేకపోవడంతో లేబర్ అధికారి శివప్రసాద్‌పై కలెక్టర్ వెంకటమురళి సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. బల్లికురవ మండలంలోని గ్రానైట్ క్వారీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన ఆరుగురు కార్మికులు మరణించారు. ఎనిమిది మంది గాయపడిన సంగతి తెలిసిందే. వీరి వివరాల నమోదు విషయంలో కార్మికశాఖ అలసత్వం కలెక్టర్ దృష్టికి రావడంతో ఆయన సీరియస్‌గా పరిగణించినట్లు సమాచారం. మృతులకు సంబంధించిన ఆధార్ కార్డులు మినహా మరే వివరాలు లభ్యం కాకపోవడంతో ఒడిశాలోని వారి బంధువులకు సమాచారం అందించడం యంత్రాంగానికి ఓ దశలో క్లిష్టంగా మారింది. క్వారీల్లో పనిచేసే కార్మికులకు పీఎఫ్ సౌకర్యంతో పాటు జీతభత్యాల పర్యవేక్షణ కూడా కార్మిక శాఖ విభాగానిది. అయితే వారి ప్రాథమిక సమాచారం కూడా సదరు అధికారి వద్ద లేకపోవడం కలెక్టర్ వెంకటమురళి కోపానికి కారణంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారం రోజుల్లో క్వారీల్లో పనిచేసే వారి వివరాలతో పాటు అసంఘటిత రంగాల్లో పనిచేసే వారి జాబితా కూడా సమగ్రంగా తయారు చేసి నివేదిక అందించాలని కార్మిక శాఖను కలెక్టర్ వెంకటమురళి ఆదేశించినట్లు సమాచారం.

# తవ్వడానికొచ్చి.. తనువు చాలిస్తున్నారు..

- గ్రానైట్, మెటల్ క్వారీల్లో భద్రతా చర్యలు శూన్యం
- ఇష్టారాజ్యంగా తవ్వకాలు.
- బ్లాస్టింగ్ సమయంలో.. నిబంధనలు గాలికి
- చుట్టపు చూపుగా అధికారుల పర్యవేక్షణ



బల్లికురవ సమీపంలోని గ్రానైట్ క్వారీ

అద్దంకి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): క్వారీలు.. ప్రమాదాల ఖిల్లాలుగా మారాయి. భద్రతా చర్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు.. చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. సంబంధిత అన్ని శాఖల అధికారులు నెలవారీ మామూళ్ల మత్తులో..క్వారీల వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. బాపట్ల జిల్లా పరిధిలో బల్లికురవ, కొణిదెన, మల్లాయపాలెం, సంతమాగులూరు మండలంలోని గురిజేపల్లి, పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలంలోని యడవల్లి, మురికిపూడి, బొప్పూడి, వినుకొండ మండలంలోని ఉమ్మడివరం, నూజెండ్ల మండలం రవ్వవరం తదితర ప్రాంతాల్లో సుమారు 100కు పైగా గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. పలు చోట్ల పెద్దఎత్తున మెటల్ క్వారీలు ఉన్నాయి. వీటికి అయితే అనుమతులు ఉండేది అతి తక్కువే. ఇక బ్లాస్టింగ్ అనుమతులు అసలు ఉండవు. ఏ ఒక్క క్వారీలో కూడా నిబంధనలు పాటించరనేది జగమెరిగిన సత్యం. కానీ, అధికారులు మాత్రం.. అప్పుడప్పుడు వచ్చి అంతా సవ్యంగా ఉందని కితాబు లు ఇవ్వడం ఆశ్చర్యానికి గురిచేసే అంశం. సెలవు దినాల్లో కూడా కూలీల చేత పనులు చేయించడం క్వారీల్లో పరిపాటిగా మారింది. ఇక సమయపాలన కూడా ఉండదు. పలు సందర్భాలలో సరైన వెలుతురు లేకపోయినా పనులు చేయిస్తుంటారు. ఇక వర్షాలు పడ్డ సమయంలో.. కొండ ప్రాంతం నుంచి జాలువారే జలాలతో.. బండరాళ్లు జారి పడే అవకాశం ఉంటుందనేది ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే. అటువంటి సందర్భాల్లో కూడా పనులు చేయించడం మరింత విమర్శలకు తావిస్తోంది. ఏటా నిర్వహించే భద్రతా వారోత్సవాలు అంతా అధికారుల హంగామా అని ప్రమాదాలు జరిగినప్పుడు తేటతెల్లం అవుతోంది.

### కానరాని సెప్టీ ఫస్ట్, సెకండ్ మేనేజర్‌లు

ప్రతి క్వారీలో పని జరిగే సమయంలో ఖచ్చితంగా ఫస్ట్, సెకండ్ మేనేజర్ ల పర్యవేక్షణలో కూలీలు, కార్మికులు పని చేయాల్సి ఉంటుంది. అయితే ఏ ఒక్క క్వారీలో కూడా పర్యవేక్షణ మేనేజర్‌లు కానరారు. వారి సర్టిఫికేట్‌లు మాత్రమే ఉంటాయి. సర్టిఫికేట్‌లు ఇచ్చినందుకు నెల వారీ జీతం చెల్లిస్తుంటారు. దీంతో ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువ అవకాశాలు ఉంటున్నాయి.

### ఇతర రాష్ట్రాల కార్మికులే అధికం

క్వారీలలో పనిచేసే కార్మికులు, కూలీలు ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారే అధికంగా ఉన్నారు. స్థానికులను పనిలో ఉంచుకుంటే ప్రమాదాలు జరిగినప్పుడు ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితోనే పనులు చేయిస్తున్నారు. ఎక్కువ భాగం కూలీలు ఒడిశా నుంచి వస్తున్నారు. ప్రమాదాలు జరిగి.. ఒకరిద్దరు చనిపోయిన సందర్భాల్లో గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాలను సొంత ఊర్లకు పంపిన సందర్భాలూ ఉన్నాయి. గత రెండు దశాబ్దాల కాలంలో బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో ఉన్న క్వారీలలో ప్రమాదాలు జరిగి.. సుమారు 20 మంది వరకు మృతి చెంది ఉంటారని అంచనా. అయితే ఆదివారం జరిగిన ఘోర ప్రమాదం గతంలో ఎప్పుడూ జరగలేదు. దీంతో ఒక్కసారిగా అందరూ ఉలిక్కిపాటుకు గురయ్యారు.

### ఇప్పటికైనా అధికారుల తీరు మారేనా...

ఘోర ప్రమాదం జరిగిన నేపథ్యంలో ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు మేల్కొని క్వారీలలో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటారో.. లేదో వేచి చూడాల్సి ఉంది.

ఏసీబీ వలకు చిక్కినడ్రెయినేజీ శాఖ

# జూనియర్ అసిస్టెంట్

- కాంట్రాక్టర్‌కు ఎం.బుక్ ఇచ్చేందుకు రూ.30 వేలు డిమాండ్
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ డీఎస్పీ



పట్టుబడిన శ్రీనివాసరావు

గుడివాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గుడివాడలోని డ్రెయినేజీ శాఖ ఈఈ కార్యాలయంపై ఏసీబీ అధికారులు సోమవారం దాడి చేశారు. కాంట్రాక్టర్ నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటున్న జూనియర్ అసిస్టెంట్ గరికిపాటి శ్రీనివాసరావును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన కాంట్రాక్టర్ తురకా రాజా వర్క్ డిపాజిట్ ఎం.బుక్ ఇవ్వాలని డ్రెయినేజీ శాఖ అధికారులను కోరారు. దీనికి గుడివాడలోని డ్రెయినేజీ ఈఈ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్ గరికిపాటి శ్రీనివాసరావు రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్ రాజా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ క్రమంలో సోమవారం రూ.30 వేలు నగదు జూనియర్ అసిస్టెంట్‌కు రాజా ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ బి.వి.సుబ్బారావు నేతృత్వంలో దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ అదుపులోకి తీసుకున్న శ్రీనివాసరావును ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సీఐలు వి.వి.సత్యనారాయణ, ఎం.వి.ఎస్.నాగరాజు, ఎస్ఐ పూర్ణిమ పాల్గొన్నారు.

## మైన్స్‌సేఫ్టీ అధికారుల పరిశీలన

బల్లికురవ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీర్లకొండ వద్ద ఉన్న సత్యకృష్ణ గ్రానైట్ క్వారీని సోమవారం రాష్ట్ర మైన్స్ సేఫ్టీ డెరెక్టర్ ఆశోక్‌కుమార్, డిప్యూటీ డెరెక్టర్ జ్ఞానేశ్వర్‌ల బృందం పరిశీలించింది. క్వారీలో ప్రమాదవశాత్తు బండరాయి అచ్చు ఊడి పడి ఆదివారం ఆరుగురు ఒడిశాకు చెందిన కూలీలు మృతి చెందారు. ప్రమాదం జరిగిన తీరును అక్కడి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. క్వారీలో భద్రత చర్యలు ఎలా ఉన్నాయి. పనులు చేసే సమయంలో ఎంత మంది కూలీలు అక్కడ ఉన్నారని ప్రశ్నించారు. వారు అందరు సేఫ్టీకి సంబంధించి జాగ్రత్తలు పాటించారా..? లేదా..? అన్న దానిపై విచారించారు. క్వారీలోని మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రతపరంగా ముందుస్తు జాగ్రతలు తీసుకొని ఉంటే ఇలాంటి ఘటనలు జరిగి ఉండేవి కాదన్నారు. ఘటన స్థలంలో ర్యాంపులు, ఎత్తులు, బెంచ్‌లు, హద్దులను పరిశీలించారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ప్రమాద క్వారీని పరిశీలన చేసి నివేదికను తయారు చేస్తున్నామని వారు తెలిపారు. అనంతరం నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారి ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో మైన్స్ ఏడీ రామచంద్రరావు, లేబర్ కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రమాదం జరిగిన గ్రానైట్ క్వారీని పరిశీలిస్తున్న మైన్స్ సేఫ్టీ డెరెక్టర్ అశోక్‌కుమార్, డీడీంఎస్ జ్ఞానేశ్వర్ తదితరులు



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మాధవ్

## క్వారీ క్షతగాత్రులకు మాధవ్ పరామర్శ

నరసరావుపేట లీగల్, ఆగస్టు 4, (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా బల్లికురవ మండలంలో ఆదివారం చోటుచేసుకున్న క్వారీ ప్రమాదంలో గాయపడి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఎనిమిది మంది క్షతగాత్రులను సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందన్నారు. క్షతగాత్రులకు ఆర్థిక సాయం అందజేస్తుందని చెప్పారు. క్వారీల యాజమాన్యాలు అలెర్ట్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్వారీ ప్రమాదంపై గనుల శాఖాధికారులు స్పందించారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. క్షతగాత్రుల వివరాలు, ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**రాజధాని అమరావతి కోసం భూములిచ్చిన రైతుల రుణ కష్టాలు తీరాయి. ప్రభుత్వం ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లపై రుణాలిచ్చేందుకు ఎట్టకేలకు బ్యాంకులు ముందుకు వచ్చాయి. దీంతో రైతులను ఏళ్ల తరబడి వెంటాడుతున్న దా'రుణ'కష్టాల నుంచి బయటపడి ఊపిరి పీల్చుకునే అవకాశం దొరికినట్లయింది.**







# రాజధాని రైతులకు రిటర్న్ గిఫ్ట్!

- రిటర్నబుల్ ప్లాట్లపై బ్యాంకు రుణాలకు మోక్షం
- అన్ని బ్రాంచ్‌ల అధికారులకు లీడ్ బ్యాంకు ఆదేశం
- ఫలించిన రైతుల సుదీర్ఘ పోరాటం!
- అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు భారీ ఊరట!





గుంటూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చింది. అయితే ఆ ప్లాట్లపై రుణాలిచ్చేందుకు బ్యాంకులు ముందుకు రాలేదు. నియమాలు, సాంకేతిక కారణాలు చూపుతూ ముఖం చాటేశారు. గత అయిదేళ్ల పాలనలో కౌలు రాకపోవడంతో పాటు.. ప్రభుత్వ వేధింపులు తాళలేక చిన్న, సన్నకారు రైతులు అనేకమంది అప్పులపాలయ్యారు. రాజధాని కోసం భూములిచ్చిన వారిలో ఎకరాలోపు ఉన్న చిన్న కారు రైతులు 20,490 మంది, ఒకటి నుంచి రెండెకరాల లోపు ఉన్న సన్నకారు రైతులు 5 వేల మంది ఉన్నారు. పోయిన ఆరేళ్లలో (మిగతా 6లో)

# ఇదేంది'రొయ్యా'.. ట్రంపు!

(5వ పేజీ తరువాయి)

భారం ఎగుమతిదారులపై పడనుంది. ఈ ప్రభావం అంతిమంగా రొయ్య రైతుల మీదే పడి మార్కెట్‌లో ధరలు మరింత క్షీణత నమోదయ్యే అవకాశాలున్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**ఏప్రిల్‌లోనే వేగంగా ధరల పతనం...**

ఏప్రిల్‌లో ట్రంప్ తీసుకున్న సుంకాల నిర్ణయంతో గంటల్లోనే రొయ్యల ధరల్లో పతనం నమోదైంది. రూ.240 ఉన్న వంద కౌంట్ రొయ్య ధర ఏప్రిల్‌లో ట్రంప్ ప్రకటనతో ఒక్కసారిగా రూ.45 పతనమై రూ.195కు చేరింది. అన్ని రకాల రొయ్యల ధరల్లో కనిష్ఠంగా రూ.30, గరిష్ఠంగా రూ.50 తగ్గుదల అప్పట్లో నమోదైంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పరిస్థితి తీవ్రతను కేంద్రం ద్వారా అమెరికా దృష్టికి తీసుకెళ్లి పన్నుల బాదుడును మూడు నెలల పాటు వాయిదా వేయించగలిగింది. దీంతో ఆక్వా రైతులతో పాటు ఎగుమతిదారులు కూడా కొంతమేర ఊపిరి పీల్చుకున్నారు. కానీ తాజాగా ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో సుంకాల వ్యవహారం మళ్లీ మొదటికొచ్చినట్లయింది. పది రోజుల కిందట వంద కౌంట్ రొయ్యల ధర రూ.260 ఉండగా, ప్రస్తుతం రూ.35 వరకు క్షీణత నమోదైంది. ఈ పతనం మరింతగా కొనసాగే అవకాశాలు కనబడుతుండడంతో ఆక్వా రైతులు రాబోయే నష్టాలను తలచుకుని విలవిల్లాడుతున్నారు.

**స్థానిక వినియోగం పెంచడమే మార్గం**

రొయ్యలకు స్థానిక వినియోగం పెంచడమే లక్ష్యంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర మాల్స్ రాజకీయ దోపిడీకి కేంద్రాలుగా మారాయి తప్పితే ఆక్వా రంగానికి ఒనగూరిన మేలు గుండుసున్నా. ఇక్కడ ఉత్పత్తి అయ్యే రొయ్యల్లో దాదాపు 80 శాతం ఎగుమతుల బాటే పడుతున్నాయి. ఇలాంటి పన్నుల సంక్షోభాలు ఎదురైనప్పుడు ఆక్వా రంగం బేల చూపులు చూడకుండా ఉండాలంటే ఉత్పత్తుల్లో కనీసం 50 శాతం స్థానిక వినియోగం ఉండేలా ప్రభుత్వాలు కృషి చేయాలి. నేరుగా రొయ్యలు, చేపలు వాడడమే కాకుండా వాల్యూ యాడెడ్ దిశగా ప్రాసెసింగ్ రంగాలకు రాయితీలు ఇచ్చి.. మార్కెట్‌లో ప్రవేశపెడితే కొంతమేర ప్రయోజనం ఉండే అవకాశం ఉంది. ఇదే కాకుండా మత్స్య ఉత్పత్తుల వాడకం వల్ల కలిగే లాభాలపై కూడా పెద్ద ఎత్తున ప్రచారం కల్పించి ప్రజల్లో వినియోగాన్ని పెంచడంపైనే ఆక్వా రంగం మనుగడ ఆధారపడి ఉంటుంది.

# రాజధాని రైతులకు 'రిటర్న్' గిఫ్ట్

(5వ పేజీ తరువాయి)

వారంతా బ్యాంకు రుణాల కోసం చేయని ప్రయత్నం లేదు. కానీ, బ్యాంకర్లు ససేమిరా అన్నారు. దీనికి తోడు భూములు ప్రభుత్వానికి ఇవ్వడంతో వాటిపై సహకార రుణాలు పొందే అవకాశం లేకుండాపోయింది. దీంతో రైతులు నరకం అనుభవించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వారి 'రుణ' కష్టాలు కొనసాగాయి. ఈ విషయం సీఎం దృష్టికి కూడా వెళ్లింది. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

**● ముందుకొచ్చిన లీడ్ బ్యాంకు**

రిటర్నబుల్ ప్లాట్లపై రుణాలివ్వాలని లీడ్ బ్యాంకు అయిన యూనియన్ బ్యాంకు తాజాగా జిల్లాలోని అన్ని బ్రాంచ్‌ల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రుణ మంజూరుకు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే బ్యాంకులు ఆమోదం తెలిపాయి. ఫిబ్రవరిలో జరిగిన ఎస్ఎల్‌బీసీలో రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు అంగీకరించారు. కానీ, రుణాలివ్వడానికి ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో నెలన్నర క్రితం ఉండవల్లిలో సీఎం నిర్వహించిన సమావేశంలో రైతులు తమ గోడు వినిపించారు. తాజాగా జూలై 25న సబ్ కమిటీ సమావేశంలో ప్లాట్లపై రుణాలు ఇవ్వాలని తీర్మానించారు. ఈ తీర్మానం ఆధారంగా లీడ్ బ్యాంకు ఆదేశాలు జారీ చేసింది. ఆ ఆదేశాల మేరకు బ్యాంకర్లు ముందుకు రావాలని రైతులు కోరుతున్నారు.

# లక్ష్మీసుధ మరణం గ్రామానికి తీరని లోటు

**● అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండప ప్రతినిధి సురేంద్రబాబు**



లక్ష్మీసుధ స్మారక సభలో ఆమె చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

పర్చూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నర్రా లక్ష్మీసుధ అకాల మరణం పర్చూరు గ్రామానికి తీరని లోటని అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండప ప్రతినిధి కఠారి సురేంద్రబాబు అన్నారు. సోమవారం స్థానిక కల్యాణ మండప ప్రాంగణంలో అభయాంజనేయ స్వామి విగ్రహ కమిటీ, రోటరీ క్లబ్‌ఆఫ్ పర్చూరు సెంట్రల్, మహాప్రసాతన కమిటీ, గ్రామస్థుల సారథ్యంలో స్మారక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు మాట్లాడారు. ఆధ్యాత్మిక, గ్రామాభివృద్ధి కార్యక్రమాలతోపాటు, నిరుపేదల అభ్యున్నతికోసం రూ.కోటి రూపాలయ మేర విరాళం అందించడం ఆమె దాతృత్వానికి నిదర్శనం అన్నారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలతో నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో రొటేరియన్ పాటిబోలు ఉదయ భాస్కర్, మాజీ మున్సిపల్ సెక్రటరీ ఉప్పుటూరి మురళీకృష్ణ, డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు, కోట హరిప్రసాద్, మంగళగిరి కోటేశ్వరరావు, ఒగ్గిశెట్టి నరసింహారావు, లంకా ప్రసాద్, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కాసా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్‌లో అర్జీలు వేగంగా పరిష్కరించాలి

**తహసీల్దార్ నాగరాజు**

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరిత గతిన పరిష్కరించే విధంగా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ నాగరాజు స్థానిక రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కారంచేడు తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వీఆర్వోలు, సిబ్బందికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, ఏవో నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# చికిత్స పొందుతున్న వివాహిత మృతి

కావూరివారిపాలెం(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వివాహిత ఆదివారం రాత్రి మృతిచెందారు.. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చీరాల మండల పరిధిలోని కావూరివారిపాలేనికి చెందిన ఆసోది ప్రమీల, సాయిబాబురెడ్డిలు దంపతులు. వీరికి 10 నెలల బాబు సంతానం. అయితే భర్త మద్యానికి బానిసగా మారి వేధిస్తున్న క్రమంలో మనస్థాపం చెంది గత నెల 30వ తేదీన పురుగుల మందు తాగింది. ఈక్రమంలో పొన్నూరులో చికిత్స పొందుతూ మృత్యువాత పడగా పోలీసులు కేసు నమోదు చేశారు.

# శిథిలావస్థకు తరగతి గది

**వెంటనే తొలగించాలని ఎంపీడీవోకు హెచ్‌ఎం వినతి**



వినతి పత్రం అందజేస్తున్న హెచ్‌ఎం శివప్రసాద్

బల్లికురవ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం గ్రామ ప్రాథమిక పాఠశాలకు చెందిన తరగతి గది శిథిలావస్థకు చేరిందని వెంటనే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తొలగించాలని పాఠశాల హెచ్‌ఎం శివప్రసాద్ సోమవారం ఎంపీడీవో పాంగురంగస్వామికి వినతి పత్రం అందజేశారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన గదికావడంతో పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయని ఈ సందర్భంగా అయన తెలిపారు. హెచ్‌ఎం ఇచ్చిన లేఖను ఉన్నతాధికారులకు పంపిస్తామని, శిథిలావస్థకు చేరిన గదిలోకి విద్యార్థులు ఎవరు వెళ్లకుండా చూడాలని ఎంపీడీవో హెచ్‌ఎంకు సూచించారు.

# వెలిగొండ పనులు పూర్తి చేయాలి

**● నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి ● రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు**

మార్కాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రకాశం ప్రజలకు వరప్రదాయిని అయిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని ఆలోచనాపరుల వేదిక ప్రతినిధి బృందం నాయకులు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో భాగమైన గొట్టిపడియ డ్యామ్, సొరంగ నిర్మాణ పనులను సోమవారం ఆలోచనాపరుల వేదిక ప్రతినిధి బృందం పరిశీలించింది. అనంతరం మార్కాపురం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించి మూడు దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటికీ పూర్తికాకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ప్రాజెక్టు దేశంలో ఎక్కడాలేని విధంగా అతి తక్కువ నిధులతో కొన్ని లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే బృహత్తరమైన పథకం అన్నారు. మొదటి ఫేజ్ కింద రూ.2 వేల కోట్లు, రెండవ ఫేజ్ కింద రూ.2,500 కోట్లు కేటాయిస్తే ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందన్నారు. రూ.5 వేల కోట్లు కేటాయిస్తే పూర్తి అయ్యే ఈ ప్రాజెక్టు నిర్మాణంపట్ల ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. 2010లో గొట్టిపడియ, సుంకేసుల, కాకర్ల గ్యాపుల నిర్మాణం పూర్తయిందని, ప్రాజెక్టు పూర్తికాకపోవడంతో నిర్మాణానికి ఖర్చు చేసిన నిధులన్నీ వృథాగా పోయినట్టేనన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలన్నారు.

పశ్చిమ ప్రకాశంలో భూగర్భ జలాలు పూర్తిస్థాయిలో అడుగంటిపోయాయని, బోర్ల ద్వారా వచ్చిన నీటిని తాగడం ద్వారా ఫ్లోరైడ్ సమస్యతో ఈ ప్రాంత ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విశ్లేషకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కృష్ణా, గోదావరి నుంచి కొన్ని లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలో వృథాగా పోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా సంఘం అధ్యక్షులు భవాని ప్రసాద్, ప్రతినిధులు ఎమ్.చక్రవర్తి, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ నాయకులు అందె నాసరయ్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే లక్ష్యం

**● సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి**

**● సింగరాయకొండ గురుకుల పాఠశాలలో ఐఐటీ, నీట్ మెటీరియల్స్ పంపిణీ**



విద్యార్థినులకు మెటీరియల్ అందజేస్తున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే సీఎం నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం రాత్రి స్థానిక గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు నారాయణ విద్యా సంస్థల సహకారంతో అందజేసిన ఐఐటీ, నీట్ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2017 ఏడాదిలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు తొలిసారిగా గురుకులాల్లో మూడుచోట్ల ఐఐటీ, నీట్ సెంటర్లను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. మళ్లీ ఆయన సూచనలతో ఇప్పుడు వాటిని మూడు నుంచి పదికి పెంచమన్నారు. అందులో ఒకటి సింగరాయకొండ గురుకుల పాఠశాలలో ఐఐటీ, నీట్ కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేశామని తెలిపారు. ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లో విద్యార్థులకు తన కోరిక మేరకు నారాయణ విద్యాసంస్థల తరఫున పురపాలకశాఖ మంత్రి నారాయణ ఉచితంగా మెటీరియల్స్ అందజేస్తున్నారని తెలిపారు.

ఐఐటీ, నీట్ బోధించే లెక్చరర్లకు ట్రైనింగ్ ఇవ్వడానికి కూడా అంగీకరించినట్లు వివరించారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి ముందుకొచ్చిన మంత్రి నారాయణకు ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఐఐటీ, నీట్‌లో తృటిలో అర్హత కోల్పోయిన విద్యార్థులకు లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇవ్వడానికి త్వరలో విజయవాడలో కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి స్వామి తెలిపారు.

# చెన్నమల్లేశ్వర స్వామి ట్రస్ట్‌బోర్డు కమిటీ ప్రమాణ స్వీకారం



చైర్మన్ సుబ్బాయమ్మను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అమ్మనబ్రోలు గ్రామంలోని శ్యామలాంబ సమేత శ్రీ చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం కోలహలంగా నిర్వహించారు. గ్రామ టీడీపీ కార్యాలయం వద్ద నుంచి నూతన ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులతో కలసి చెన్నమల్లేశ్వర స్వామి దేవస్థానానికి ర్యాలీగా చేరుకొన్నారు. అనంతరం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఈవో దామా నాగేశ్వరరావు ఆలయ చైర్మన్‌గా ఎంపికైన గుండు సుబ్బాయమ్మతో పాటు సభ్యులు చిడిపోతు సురేష్‌బాబు, ధూపాటి వీరనారాయణ, పాదర్తి సుబ్బయ్య, వావిలాల లలితాదేవి, అజ్జం సరోజిని, మేకల శారద, మాచవరపు సురేష్, పబ్బిశెట్టి పవన్, ఎక్స్‌అఫిషియో సభ్యుడు కొల్లిపర నాగేశ్వరరావులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆలయంలో నూతన కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రమాణ స్వీకారం చేసిన ట్రస్ట్ బోర్డు సభ్యులను తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, దివంగత టీడీపీ నేత వీరయ్య చౌదరి తనయుడు ముప్పవరపు చంద్ర సిద్ధార్థ, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గుడిపూడి రాజారావు, నాయకులు ఈదర వెంకటకృష్ణారావు, వలేటి పాండురంగారావు, మారెళ్ల జనార్దనరావు, మెట్టు సుబ్బయ్య నాయుడు, మహమ్మద్‌బేగ్ తదితరులు అభినందించారు.

# దేవాంతకులు

- యథేచ్ఛగా ఆలయ భూముల ఆక్రమణ
- దర్జాగా పంటల సాగు
- ఏళ్లుగా అనుభవిస్తున్న కబ్జారాయుళ్లు
- అనేక గ్రామాల్లో దీనావస్థలో గుడులు



కంభంపాడులో ఆక్రమణకు గురైన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ భూమి

త్రిపురాంతకం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో దేవాలయాల ఆస్తులకు రక్షణ కరువైంది. వందల ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయి. వీటిలో పాగా వేసిన వారు ఏళ్ల తరబడి దర్జాగా పంటలు సాగు చేసుకుంటున్నారు. ఆలయాలకు పైసా కౌలు చెల్లించకుండా సొంత భూములుగా వాడుకుంటున్నారు. దీంతో రూ.కోట్ల ఆస్తులున్న ఆలయాలు కూడా ఆలనాపాలనా కరువై దీనావస్థకు చేరుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం మౌనం వహిస్తున్నారు. ఆక్రమణదారుల నుంచి అమ్యామ్యాలు పుచ్చుకుని మిన్నకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కబ్జాదారుల్లో కొందరు ఏకంగా ఆ భూములు తమవే అంటూ కోర్టులను ఆశ్రయిస్తుండగా వాటిపై మేమేమి చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ అధికారులు సమాధానం దాటవేస్తున్నారు.

**ఆలయ భూముల్లో బత్తాయి మొక్కలు**

ఎర్రగొండపాలెం మండలం వెంకటాద్రిపాలెం గ్రామంలో ఉన్న లక్ష్మీచెన్నకేశవ దేవస్థానానికి పెద్దారవీడు మండలంలోని కంభంపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 35లో 4.31 ఎకరాల భూమి ఉంది. అందులో కొందరు పాగా వేశారు. బత్తాయి మొక్కలు నాటి కంది పైరును సాగు చేసుకుంటున్నారు. దీనిపై పలుమార్లు కొందరు ఫిర్యాదులు చేసినప్పటికీ ఈ భూముల వ్యవహారం కోర్టులో ఉన్నందున అక్కడే తేలాలని దేవదాయశాఖ అధికారులు చెప్తున్నారు. ఇది దేవదాయశాఖకు చెందిన భూమిగానే ప్రస్తుతం కూడా రెవెన్యూ అడంగల్‌లో ఉంది. అయితే కొందరు వ్యక్తులు ఈ భూమిని 1950లోనే తమకు అప్పట్లో పూజారి విక్రయించారని రికార్డులు చూపి కోర్టును ఆశ్రయించడంతో ఇప్పటికీ ఆ వివాదం నడుస్తూనే ఉంది. ఎర్రగొండపాలెం మండలంలోని

మిల్లంపల్లి వేణుగోపాలస్వామి దేవాలయానికి కూడా దాదాపు 90 ఎకరాల భూమి ఉంది. దీనికి నామమాత్రపు శిస్తు చెల్లిస్తూ కొందరు సాగు చేసుకుంటున్నారు. కొంత భూమికి పలువురు వేలం నిర్వహణకు కూడా ఆటంకాలు సృష్టిస్తూ ఎలాంటి కౌలు చెల్లించకుండా పంటలు సాగు చేసుకుంటున్నారు.

**48 ఎకరాలు ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి!**

దేవదాయశాఖ పరిధిలో లేకుండా ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో నడుస్తున్న ఆలయాలకు ఉన్న భూములు కూడా అధికంగానే అన్యాక్రాంతమయ్యాయి. పుల్లలచెరువు మండలంలోని శతకోడు సప్త కోటీశ్వరాలయంతోపాటు పలు ఆలయాలకు సంబంధించి దాదాపు 48 ఎకరాల భూమి ఎక్కడ ఎవరి పరిధిలో ఉందో కూడా తెలియని పరిస్థితి. ఎర్రగొండపాలెం మండలంలో దాదాపు మొత్తం 900 ఎకరాలకు పైగా ఆలయ భూములు ఉంటే వాటిపై వచ్చే శిస్తుతో దూపదీప నైవేద్యాలు దేవునికి అందాల్సింది పోయి చాలా ఆలయాలు దీనావస్థకు చేరుకున్నాయి. పుల్లలచెరువు మండలంలో కూడా ఆలయాలకు సంబంధించిన భూములు ఉన్నప్పటికీ వాటి గురించి కనీసం భక్తులకు కూడా అవగాహన లేకపోవడంతో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా భూముల్లో పాగా వేసి పెత్తనం చెలాయిస్తున్నారు.

**ప్రభుత్వం చర్యలు తీసుకున్నా ఆగని ఆక్రమణలు**

గతంలో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించిన సమయంలో దేవదాయశాఖ పరిధిలోనివితోపాటు ప్రైవేటు ఆలయాల భూముల వివరాలు లెక్క తేల్చి వాటిని దేవాలయం పేరుతో ఆన్‌లైన్ చేయించింది. ఆ భూములను కాపాడేందుకు ప్రత్యేకంగా అధికారిని నియమించింది. దాదాపు రికార్డుల్లో చాలా వరకు ఆలయ భూములను నమోదు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ప్రైవేటు వ్యక్తులు అనుభవంలో ఉంటున్నారు. ఇప్పటికైనా ఆలయాల భూములను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకొని వాటిపై వచ్చే ఆదాయంతో దేవాలయాల్లో ధూపదీప నైవేద్యం పెడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని భక్తులు కోరతున్నారు.

# వానొస్తే.. వెత!

మండల కేంద్రమైన ఎర్రగొండపాలెంలో కొద్దిపాటి వర్షం కురిసినా రోడ్లు జలమయమవుతున్నాయి. పలుచోట్ల కాలువలు లేకపోవడం, ఉన్న చోట్ల పూడిక పేరుకుపోవడంతో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతోంది. దీంతో వాహనదారులతోపాటు పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి ఒంగోలువారి వీధిలో కాలువల్లో నీరు ముందుకు ప్రవహించే వీలులేక రోడ్డుపై చేరింది. ఇందిరానగర్‌లో కాలువలు లేకపోవడంతో మోకాటి లోతున నిలిచిపోయింది. ఆ సమయంలో స్కూల్ వదలడంతో ఒంగోలువారి వీధి నుంచి ఇళ్లకు వెళ్లే విద్యార్థులు అవస్థపడ్డారు.

\- ఆంధ్రజ్యోతి, ఎర్రగొండపాలెం



# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**● బైక్‌ను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం**

**● మరొకరికి గాయాలు**

పెద్దదోర్నాల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం మోటారు సైకిలును ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన మండల పరిధిలోని గంటవానిపల్లె స్టేజి వద్ద కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎగువ చెర్లోపల్లి గ్రామానికి చెందిన పాముల విజయభాస్కర్(24) మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన కఠారి పోలురాజుకు గాయాలయ్యాయి. ఎస్సై మహేశ్ తెలిపిన కథనం ప్రకారం... విజయభాస్కర్, పోలురాజు దోర్నాలలో తమ పనులు ముగించుకుని మోటారుసైకిలుపై స్వగ్రామం చెర్లోపల్లి వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో బైక్ పైనుంచి ఇద్దరు కిందపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన ప్రయాణికులు పోలీసు స్టేషనుకు సమాచారం అందించారు. ఎస్సై మహేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని తన వాహనం ద్వారా క్షతగాత్రులను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యాధికారి చికిత్సలు నిర్వహించే క్రమంలో పరిశీలించగా అప్పటికే విజయభాస్కర్ మృతి చెందినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# కాలేజీ వ్యాన్, మోటార్ సైకిల్ ఢీ

**● ఇరువురికి గాయాలు**



తీవ్రంగా గాయపడిన రమేష్‌నాయుడు

మార్కాపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న మోటార్ సైకిల్‌ను ఓ ప్రైవేటు కాలేజీకి చెందిన వ్యాన్ ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం ఉదయం స్థానిక మార్కెట్ యార్డ్ వద్ద చోటుచేసుకుంది. టౌన్ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు... స్థానిక టాటా క్యాపిటల్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో లోన్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తర్లుపాడు మండలం తాడివారిపల్లికి చెందిన ఎమ్.రమేష్‌నాయుడు, నెల్లూరు జిల్లా పొన్నలూరు మండలం పెద్దవెంకన్నపాలెంకు చెందిన టి.విజయ్‌కుమార్‌లు మోటార్ సైకిల్‌పై దోర్నాల వెళ్తున్నారు. మార్కెట్ యార్డు సమీపానికి చేరుకునే సరికి వెనుకనుంచి వస్తున్న ఓ ప్రైవేటు కాలేజీకి చెందిన వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ఇరువురికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు ఆటోలో ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో రమేష్‌నాయుడును ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చీరాల పీఏసీఎస్‌కు ఉత్తమ అవార్డు

**● మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా అందుకున్న మోహన్**

చీరాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ఉత్తమ సేవల అవార్డు లభించింది. 2023-24 సంవత్సరానికి సొసైటీ ఉత్తమ సేవలు అందించడంతో సంఘం చైర్మన్ కోటి మోహన్‌కు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు.

# సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

**● ఒంగోలు నగరంలో విస్తృత ప్రచారం**

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈనెల 20వతేదీ నుంచి జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం జిల్లాకేంద్రమైన ఒంగోలులో విస్తృత ప్రచారంతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కరపత్రాల ద్వారా ప్రచారం ప్రారంభించారు. ముందుగా మేయర్ గంగాడ సుజాతకు కరపత్రాన్ని అందజేసి మహాసభలకు ఆహ్వానించారు. ఈసందర్భంగా సీపీఐ నాయకుడు శ్రీరామ్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఒంగోలులో ఈనెల 20తేదీ నుంచి జరగనున్న సీపీఐ మహాసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నగరంలోని ప్రజలందరూ పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సమస్యలపై పోరాడే పార్టీ సీపీఐ అన్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు గుజ్జుల వలరాజు, మురళీ, ప్రభాకర్, సాయి, నాగభూషణం, పవన్‌కుమార్, బాలు, చంద్ర,తేజ, అరుణ, వెంకటరెడ్డి,ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

# అలరించిన చిన్నారుల శక్తి టీంలోగో

పందిళ్లపల్లి(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన శక్తి టీం లోగో అందరినీ అలరించింది. ఎస్సై జనార్ధన్ ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలపై లైంగిక వేధింపులు, ప్రమాకర సమయంలో యాప్ ప్రయోజనకరంగా ఉంటుందని ఎస్సై వివరించారు. కార్యక్రమంలో శక్తి టీం ఎస్సై హరిబాబు, సునీత, సుబ్బారావు, ధనలక్ష్మీ, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



శక్తి టీం లోగో ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## అవీ..ఇవీ..

### గడియార స్తంభం ఏర్పాటుకు శ్రీకారం

● స్థల పరిశీలన చేసిన మహేంద్రనాథ్, సాంబశివరావు



స్థలాన్ని పరిశీలిస్తున్న మహేంద్రనాథ్, సాంబశివరావు

చీరాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : గత పాలకుల ఆకృత్యాలతో నియోజక వర్గ స్వరూపం అట్టడుగుకు చేరిందని, కూటమి ప్రభుత్వం అధికారంతో అభివృద్ధిబాటలు పడుతోందని నియోజకవర్గ టీడీపీ అధికారి ప్రతినిధి డా.మహేంద్రనాథ్ అన్నారు. మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావుతో కలిసి సోమవారం పట్టణంలో గడియారస్తంభం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. పేరుకే గడియార స్తంభం కానీ అక్కడ దాని ఆచూకీ లేకుండా పోవడం అన్యాయమన్నారు. వెంటనే ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. వ్యయ, ప్రయాసలకు ఓర్చి పట్టణంలో నూతన ఒరవడిని సృష్టించనున్నట్లు వివరించారు. మున్సిపల్ అధికారులకు వెంటనే రూపకల్పనకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీవో శ్రీనివాసులు, గడియార స్తంభం ఏర్పాటు అర్జీదారులు సర్విశెట్టి సుబ్బరామయ్య, పుల్లయ్యనాయుడు, ఆదినారాయణ, భూషణం, గడ్డం శ్రీనివాసరావు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అమర వీరుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్యం



దేశభక్తి గీతాల పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఎంతోమంది అమర వీరుల త్యాగఫలితం దేశ స్వాతంత్ర్యమని, అటువంటి మహనీయుల పోరాటాలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వేటపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం దీప్తి అన్నారు. సోమవారం పాఠశాలలో దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొనగా సీనియర్స్ విభాగంలో సమన్విత, షేక్ మెహతాజ్, సుహానా, జూనియర్స్ విభాగంలో రాము, శ్రీకా, ప్రణతి ఉత్తమంగా రాణించినట్లు వివరించారు. విజేతలకు ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా సంగీతం టీచర్ సునీత, పృధివి సునీత, యశోదర విద్యార్థులు పాల్గొన్నారు.

### అలల తాకిడికి బీటెక్ విద్యార్థి మృతి

● పిడుగురాళ్ల నుంచి స్నేహితులతో వచ్చి మృత్యువాత

● ఒకరిని రక్షించిన గజ ఈతగాళ్లు



పాశం రవి (ఫైల్)

వాడరేవు(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వాడరేవులో సరదాగా గడిపేందుకు వచ్చిన పిడుగురాళ్ల బీటెక్ విద్యార్థి మృత్యువాత పడ్డాడు. అందిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన పాశం రవి(22) బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. అలాగే డిప్లమా చదువుతున్న సునీల్, ఎంఎల్‌టీ విద్యార్థి సాగర్, హైదరాబాదుకు చెందిన నవీన్‌లతో కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై సోమవారం వాడరేవు సముద్రతీరానికి వచ్చాడు. ఈ క్రమంలో ఇద్దరు ఒడ్డునే ఉండగా రవి, సునీల్ సముద్రంలోకి దిగి కొంచెం లోతుకు వెళ్లారు. గమనించిన గజ ఈతగాళ్లు హుటాహుటీన వారి వద్దకు చేరుకుని రక్షణ రింగ్‌లు విసిరారు. అయితే సునీల్ అందుకుని ఒడ్డుకు చేరగా, రవి ప్రమాదవశాత్తు అలల తాకిడికి కొట్టుకు పోయాడు. దీంతో గాలింపు చర్యలు నిర్వహిస్తున్న కొద్దిసేపటికే అదే ప్రాంతంలో విగతజీవిగా ఒడ్డుకు చేరాడు. ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హాస్పిటల్ వద్దకు చేరుకుని బోరున విలపించారు.

### కూటమి ప్రభుత్వంతో ప్రజలకు పాట్లు

● వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకటేష్



మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వ పాలనతో నిరుపేద ప్రజలు పాట్లు పడుతున్నారని, సంక్షేమ పథకాల పంపిణీలో చిత్తశుద్ధి లేదని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 29వ వార్డులో 'బాబు షూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ తీరుపై పలు విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆర్టీసీ బస్సు రద్దుతో విద్యార్థుల వెతలు

నిత్యం మూడు కిలోమీటర్లు నడిచి వెళుతున్న విద్యార్థులు



బస్సు లేక పాఠశాలల నుంచి నడిచి వెళుతున్న విద్యార్థులు

బల్లికురవ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఏబీసీ కాలువపై వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం కాలువ వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ నీటి ఉధృతితో కొట్టుకు పోయింది. దీంతో అద్దంకి నుంచి వల్లాపల్లి బల్లికురవ మీదుగా నర్సారావుపేట ఆర్టీసీ బస్సును అధికారులు రద్దు చేశారు. దీంతో నిత్యం బల్లికురవ వైపు నుంచి సంతమాగులూరు వైపు వెళ్లే పాఠశాల విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అద్దంకి నుంచి కొమ్మినేనివారి పాలెం నుండి బస్సు వచ్చే వీలు ఉన్న ఆర్టీసీ అధికారులు తమ ఇబ్బందులను పట్టించుకోకుండా వంతెన పనులు వంక చూపించి బస్సును రద్దు చేశారని విద్యార్థులు వాపోతున్నారు. ఈ రోడ్డులో నర్సారావుపేట వెళ్లేందుకు ఏకైక బస్సు ఉందని ఉన్న బస్సును కూడా రద్దు చేస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు తీరు ఇలానే ఉంటే తాము రోడ్లపై దర్నాలు చేసేందుకు సిద్ధం అని పలువురు అంటున్నారు. ప్రతి రోజు విద్యార్థులు బల్లికురవ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల నుంచి ఏడు కిలోమీటర్ల మేర నడిచి ఇళ్లకు వెళుతున్నారు. అధికారులు వెంటనే నర్సారావుపేట బస్సును కొమ్మినేవారిపాలెం మీదుగా వచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# తూర్పుతక్కెళ్ళపాడు మాజీసర్పంచ్ శ్రీనివాసరావు ఆత్మహత్య

నివాళి అర్పించిన మంత్రి రవికుమార్



నివాళి అర్పిస్తున్న మంతి రవికుమార్, ఇన్‌సెట్‌లో శ్రీనివాసరావు (ఫైల్)

పంగులూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడు గ్రామ మాజీ సర్పంచ్ పచ్చ శ్రీనివాసరావు (61) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తన పొలంలో వేపచెట్టుకు ఉరివేసుకుని మరణించినట్లు రేణంగివరం ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు. మూడు దశాబ్దాలకు పైగా టీడీపీ నాయకునిగా కొనసాగుతున్న శ్రీనివాసరావు గ్రామ సర్పంచ్‌గా, తూర్పు కొప్పెరపాడు పీఏసీఎస్ ఉపాధ్యక్షునిగా పనిచేశారు. పార్టీ పట్ల నిబద్దతతో పనిచేసే పచ్చ శ్రీనివాసరావు ఆత్మహత్యకు పాల్పడంపై పార్టీశ్రేణులు దిగ్భ్రాంతి చెందారు. శ్రీనివాసరావు మరణవార్త తెలుసుకున్న పలువురు పార్టీ నాయకులు మృతదేహంవద్దకు చేరుకుని నివాళులర్పించారు. శ్రీనివాసరావుకు భార్యతో పాటు వివాహితులైన కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు. ఘటనపై కేసు నమోదుచేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు.

పంగులూరు : మండలంలోని తూర్పుతక్కెళ్లపాడు టీడీపీ సీనియర్ నాయకులు పచ్చా శ్రీనివాసరావు అకాల మృతిపై రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి తక్కెళ్లపాడులోని శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి వెంట టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ.సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, పూనాటి రామాంజనేయులు, డీసీ అధ్యక్షులు కుక్కపల్లి ఆంజనేయులు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, కోమటి ప్రసాద్, చింతల సహదేవుడు, గుర్రం ఆదిశేఖర్, పెదవల్లి అశోక్, మస్తాన్‌వలి, పిచ్చిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, గొట్టిపాటి కాజా, ధూళిపాళ్ల నారాయణస్వామి,తో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొని మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు.


# శరవేగంగా కొమ్మమూరు కాలువ ఆధునికీకరణ పనులు



కారంచేడు - కుంకలమర్రు మధ్య వంతెన మరమ్మతులు

కారంచేడు(పర్చూరు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని కొమ్మమూరు కాలువ అధునీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషితో దశాబ్దాలుగా మరమ్మత్తులకు నోచుకోని కొమ్మమూరు కాలువ పనుకు గ్రహణం వీడినట్లయ్యింది. కారంచేడు - కుంకలమర్రు గ్రామాల మధ్య కొమ్మమూరు కాలువ 78.685 కిలో మీటర్ల వద్ద సర్‌ప్లస్ ఎస్కేప్ షట్టర్లు, ఐరన్ ఛానెళ్ల పునరుద్ధరణ కోసం ఏలూరి కృషి ఫలితంగా రూ.21.98 లక్షల నిధు లను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం విడుదలైన నిధులతో కాలువ కట్టలు బలోపేతం చేయడం తోపాటు, గుర్రపు డెక్కను తొలగించే విధంగా పనులు చేపడుతున్నారు. ఈ ఆధునీకరణ వల్ల భారీ వర్షాలు, వరదలు ఇతర విపత్తుల సమయం లో కాలువ ప్రవాహాన్ని నియంత్రించే విధంగా దోహద పడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఏకాంతస్పర్శ కవితా సంపుటి ఆవిష్కరణ



కవిత సంపుటిని ఆవిష్కరిస్తున్న రఘురామకృష్ణంరాజు

అద్దంకి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): అద్దంకికి చెందిన చందలూరి నారాయణరావు రచించిన ఏకాంత స్పర్శ కవితా సంపుటి ని అవనిగడ్డలో జరిగిన మాజీమంత్రి మండి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాలలో ఉపసభాపతి రఘురామకృష్ణంరాజు ఆవిష్కరించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ మంత్రులు వసంత నాగేశ్వరరావు, నన్నపనేని రాజకుమారి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ తదితరుల సమక్షంలో ఈ సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చందలూరి నారాయణరావును పలువురు అభినందించారు.

### వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

అద్దంకి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): శింగరకొండలోని శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలోని వాసవి ధన్వంతరీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులు, భిక్షులకు అన్నదానం చేశారు. నాగులపాడుకు చెందిన కరి శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె చండీ ప్రియ పుట్టిన రోజు, ముండ్లమూరు మండలం శంకరాపురానికి చెందిన పేరం శ్రావణ్ కుమార్, సుస్మితల కుమార్తె మేఘన తలనీలాలు సమర్పణ సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమం నిర్వహకులు రావూరి రంగయ్య, పూర్ణయ్య, ట్రస్ట్ అధ్యక్షుడు తమ్మన శ్రీనివాసరావు, రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, నర్రా గోపాలరావు, అంజాద్‌బాషా, కరి శ్రీలక్ష్మి, అయితా రాజా తదితరులు పాల్గొన్నారు.

### మద్యం మత్తులో వృద్ధుడు మృతి

మార్టూరు, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కాలువలో పడి వృద్ధుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని ద్రోణాదుల గ్రామంలోని బొబ్బేపల్లి రోడ్డులో సోమవారం చోటుచేసుకొంది. ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంకొల్లు మండలం నాగండ్ల గ్రామానికి చెందిన మురికిపూడి విజయశేఖరరావు(64) అదే గ్రామానికి చెందిన వీరాంజనేయులు అనే వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై ద్రోణాదుల వచ్చాడు. అక్కడ గ్రామంలోని మద్యం దుకాణంలో మద్యం సేవించారు. అనంతరం వీరాంజనేయులు నాగండ్ల గ్రామానికి వెళ్లాడు. విజయశేఖరరావు మద్యం మత్తులో బహిర్భూమికి వెళ్లి కాలువలో పడి మృతిచెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుమారుడు షడ్రక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించారు.

### పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

● రూ.2.08,960 నగదు స్వాధీనం

● 12 మంది జూదరుల అరెస్టు

చీరాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : చీరాల - కారంచేడు రోడ్డులోని పులగ కాలువ సమీపంలోని పేకాట స్థావరంపై చీరాల వన్‌టౌన్ సీఐ సుబ్బారావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈక్రమంలో 12 మంది జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2,08,960 నగదును స్వాధీనం చేసుకున్నారు.

### రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఈపూరుపాలెం(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఈపూరుపాలెం - స్టువర్టుపురం స్టేషన్‌ల మధ్య సోమవారం ఉదయం చోటుచేసుకొంది. గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటే క్రమంలో రైలు ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం సమయంలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

### మైనర్లకు వాహనాలిస్తే చర్యలు

పర్చూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని ఎస్సై జీవీ.చౌదరి అన్నారు. అలాంటి వారు ద్విచక్రవాహనాలతోపాటు, ఇతర వాహనాలు నడిపినట్లు గుర్తిస్తే సంబంధిత వాహన యజమానిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. సోమవారం పర్చూరులో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. పలువురు మైనర్లు వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి వారిని నిలుపుదల చేసి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ చేపట్టారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామి దేవాలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి

అద్దంకి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ లక్ష్మీనరశింహస్వామి దేవాలయం ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం నిర్వహించారు. దేవాదాయశాఖ అద్దంకి డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు సభ్యులతో ప్రమాణం చేయించారు. చైర్మన్‌గా గుంజి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా మంగమూరి సురేష్, దాసరి రామాంజనేయులు, రుద్రు ఆదిలక్ష్మి, కొడిమెల కోటేశ్వరమ్మ, చీమలదిన్నె వెంకటరమణ, కస్తూరి లక్ష్మీప్రసూన, బత్తుల సరిత, అద్దంకి ఆదిలక్ష్మిలతో పాటు ఎక్స్‌అఫిసియో సభ్యులుగా పూజారి భాగవతుల నరశింహాచార్యులు ప్రమాణం చేశారు. దేవస్థానం ఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

### ప్రత్యేక అవసరాల చిన్నారుల నిర్ధారణ పరీక్షలు

● 67 మంది హాజరు.. 51 మంది ఎంపిక



పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

పేరాల(చీరాల), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాలున్న 18 ఏళ్లలోపు చిన్నారులకు ఉపకరణాలు అందించేందుకు నిర్వహించిన మెడికల్ ఎసెస్మెంట్(వైద్య నిర్ధారణ) విజయవంతంగా ముగిసింది. పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చీరాల, వేటపాలెం, చినగంజాం నుండి 67 మంది దివ్యాంగ చిన్నారులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈక్రమంలో ఇందులో 51 మందిని అధికారులు ఎంపిక చేశారు. వారికి త్వరలో ఉపకరణాలు అందించనున్నట్లు తెలిపారు. క్యాంపులో అలింకో వైద్యబృందం హాజరై పరీక్షలు నిర్వహించగా, జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్యా సమన్వయ కర్త జ్యోత్స్న, ఎంఈవోలు రమాదేవి, సుధారాణి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్, ప్రతినిధులు దరబడి రాజశేఖర్‌బాబు, నరసింహ, బాలకృష్ణ, విజయ్‌కుమార్, యోహాను, రవిశేఖర్, జాన్సన్ చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నడక మార్గం ఏర్పాటు



పాఠశాలలో నీరునిలిచే నడక మార్గంలో ఏర్పాటుచేసిన గ్రావెల్ రోడ్డు

పంగులూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెళ్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో నీరునిలిచే నడక మార్గంలో దాతసాయంతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో కొద్దిపాటి వర్షానికే నడక దారిలో నీరు చేరుతోంది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్థుల ద్వారా సమస్యను గుర్తించిన మద్దినేని కృష్ణచైతన్య రూ.12వేల సొంతనిధులు వెచ్చించి వర్షపునీరు వెలుపలకు వెళ్లేలా తూములు అమర్చి గ్రావెల్ పరిపించారు. సమస్య పరిష్కారానికి సహకరించిన దాత మద్దినేని కృష్ణచైతన్యకు పాఠశాల హెచ్ఎం జె.వెంకటేశ్వర్లు, కేమా వీరాంజనేయులు, లావణ్య సహఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

### స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి




కరపత్రాల పంపిణీ చేస్తున్న నాయకులు

చీరాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్‌మీటర్లపై రాష్ట్ర ప్రభుత్వం భిన్న స్వరాలు వినిపించడం అన్యాయమని వెంటనే వాటిని రద్దు చేయడంతో పాటు విద్యుత్ ధరలు తగ్గించాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అందుకు సంబంధించి మంగళవారం అన్ని విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో కర పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శామ్యేల్, చిరుమల ప్రకాష్, బాసి పైడయ్య, ఊటుకూరి వెంకటేశ్వర్లు, మాచర్ల మోహనరావు, ఎన్ బాబురావు, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

### బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

బల్లికురవ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్లపాటు చెన్నుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రవి సాగర్, విజయక్ష్మీ, మమతలను సోమవారం పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు పాఠశాల బలోపేతానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు దూళిపాళ్ల శేషగిరి, ఉపాధ్యాయులు సంధ్యారాణి, రమణమూర్తి, సురేఖ స్వరూప, సుబ్బారావు, సుబాని, రాణి, నిలోఫర్, భవన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### తల్లిపాలతో బిడ్డకు వ్యాధినిరోధక శక్తి



తల్లిపాల విశిష్ఠతను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ

పంగులూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు గంటలోపు తాగించే ముర్రుపాలతో వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ అన్నారు. మండలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రామంలో సోమవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భిణులకు శ్రీమంతం, బాలింతల బిడ్డలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని, బిడ్డకు శక్తినివ్వడంతో పాటు తల్లికి బిడ్డకి అనుబంధం ఏర్పడుతుందని సూపర్‌వైజర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రామాంజమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగశిరోమణి, రజని, ఆశావర్కర్లు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

### వివాహేతర సంబంధంతో ఇబ్బంది పెడుతున్నారు

● వీఆర్‌వో భార్య ముంతాజ్ ఆరోపణ


మేదరమెట్ల: తన భర్త వివాహేతర సంబంధం పెట్టుకొని తనను పిల్లలను ఇబ్బంది పెడుతున్నాడని వీఆర్‌వో బాష భార్య ముంతాజ్ ఆరోపించారు. ఆదివారం రాత్రి తిమ్మనపాలెం చెక్‌పోస్టు వద్ద మరో మహిళ వద్ద భర్త బాషా ఉండగా బంధువులతో కలిసి వెళ్లి పట్టుకున్నట్లు ఆమె తెలిపారు. గత ఐదేళ్లగా తనను ఇబ్బంది పెడుతున్నాడని పిల్లలకు ఫీజులు, ఇంటిలో తన కనీస అవసరాలకు కూడా డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇచ్చిన కట్నం కాకుండా అదనంగా కట్నం తీసుకురమ్మని హింసిస్తున్నట్లు ఆమె తెలిపారు. రాత్రివేళలో ఇంటి వద్ద ఉండకుండా మరో మహిళతో అక్రమ సంబందం పెట్టుకొన్నాడన్నారు. 2023లో తనను కొట్టి పిల్లలతో సహా పుట్టింటికి తరిమేసినట్లు తెలిపారు. అనంతరం వినుకొండ పోలీసు స్టేషన్‌లో రాజీ కుదుర్చుకొని మరలా తనను తీసుకొచ్చి కొద్దినెలలు బాగానే ఉన్నాడన్నారు. తర్వాత దుర్వ్యసనాలకు లోనై తనను వేధిస్తున్నాడని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నట్లు తెలిపారు.

# నాటి స్ఫూర్తి..

● ప్రజాప్రతినిధులకు పట్టని 'పీ4'
● బంగారు కుటుంబాల దత్తతకు ఒక్కరూ ముందుకురాని వైనం

# నేడు ఏదీ!?

నెల్లూరు జిల్లా. బ్రిటీష్ కాలం నుంచి ఈ జిల్లాకు గొప్ప పేరుంది. స్వరాజ్య పోరాట ఉద్యమానికి నగదు, నిత్యావసర వస్తువుల రూపంలో భారీగా విరాళాలు అందించిన చరిత్రలో నెల్లూరుకు గుర్తింపు ఉంది. వేల కోట్ల రూపాయల సంపద కలిగిన శ్రీమంతులు వందల సంఖ్యలో ఉన్నారు. ఆస్తిపాస్తులు వందల కోట్లలో ఉన్న ధనవంతులూ ఉన్నారు. సంపన్నులు, సాయపడే గుణమున్న సమున్నతులు పెద్ద సంఖ్యలో ఉన్న నెల్లూరు జిల్లాలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమం మాత్రం ఎందుకో నత్తనడక సాగుతోంది. అత్యంత పేదరికంలో మగ్గుతున్న నిరుపేద కుటుంబాలకు కాసింత సాయం అందించి సంఘంలో వారు నిలదొక్కుకునేలా ఆపన్న హస్తం అందించే విషయంలో ఎందుకనో మునుపటి స్ఫూర్తి కనిపించడం లేదు. మారిన కాల ప్రభావమా.. లేదా పథకం అమలుతీరులో వైఫల్యమా!? అంతుపట్టడం లేదు. సాక్షాత్తు ముఖ్యమంత్రే జిల్లాకు వచ్చి పిలుపు ఇచ్చినా సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే స్పందించకపోవడం గొప్ప విశేషం. నిర్దేశించుకున్న లక్ష్యంలో పది శాతం ప్రగతి సాధించడానికే అధికారులు ఆపసోపాలు పడాల్సి రావడం జిల్లా దాతృత్వానికే అవమానం.




నెల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా 1,06,878 నిరుపేద కుటుంబాలను అధికార యంత్రంగాం గుర్తించింది. అందులో ఇప్పటికి 11,033 కుటుంబాలను దత్తత తీసుకోవడానికి మాత్రమే దాతలు ముందుకొచ్చారు. ఇంకా 90వేల కుటుంబాలు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాయి. ఇప్పటివరకు దత్తతకు ముందుకు వచ్చిన వారిలో పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, చివరికి కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. అయితే జిల్లాలోని ప్రజాప్రతినిధుల్లో మాత్రం దత్తతకు స్పందన కనిపించడం లేదు.

● ఎంపిక ఇలా

ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారంతోపాటు వివిధ సర్వేల ద్వారా జిల్లాలోని నిరుపేదల కుటుంబాలను గుర్తించారు. ఈ జాబితాను వేరు వేరు బృందాల ద్వారా పరిశీలించి నిర్ధారించుకున్నారు. కుటుంబ అవసరాలు, సామాజిక స్థితిగతులు, కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అందించాల్సి వనరులు, ఆరోగ్య సమస్యలు, పిల్లల చదువులు తదితర వివరాలను సేకరించారు. దత్తత ద్వారా వీరికి అండగా నిలువగలిగితే ఈ కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటాయని దారిద్ర్య రేఖను దాటుకుంటాయని అంచనా వేశారు.

**అధికారుల విశ్వప్రయత్నం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కార్యక్రమం కావడంతో కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన జిల్లా అధికార యంత్రాంగం ఈ పథకాన్ని విజయవంతం చేయడానికి విశ్వప్రయత్నం చేస్తోంది. నియోజకవర్గాల వారీగా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ధనవంతులను మార్గదర్శులుగా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. వీరు ఎంత గట్టిగా ప్రయత్నించినా మార్గదర్శుల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగకపోవడంతో శాఖల వారీగా ఉద్యోగుల సమావేశాలు ఏర్పాటు చేసి వారికి సైతం ఒకటి రెండు కుటుంబాలను దత్తత తీసుకునేలా మోటివేట్ చేస్తున్నారు.

● ఏ నియోజకవర్గంలో ఎందరు!?

జిల్లావ్యాప్తంగా 1,06,878 బంగారు కుటుంబాలను గుర్తించగా, సగటున ఒక్కో నియోజకవర్గం నుంచి పదివేలకుపైగా కుటుంబాలు ఉన్నాయి. అయితే మార్గదర్శులు ఆశించిన స్థాయిలో ముందుకు రాకపోవడంతో ఇప్పటికి 11,033 కుటుంబాలను మాత్రం దత్తత తీసుకున్నారు. కోవూరులో అత్యధికంగా 3169 కుటుంబాల ను 873 మంది మార్గదర్శులు దత్తత తీసుకోగా నెల్లూరు రూరల్‌లో అత్యల్పంగా 636 కుటుంబాలను 240 మంది మార్గదర్శులు దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చారు.

| నియోజకవర్గం | కుటుంబాలు | మార్గదర్శులు |
|---|---|---|
| ఆత్మకూరు | 1820 | 407 |
| కందుకూరు | 947 | 315 |
| కావలి | 642 | 352 |
| కోవూరు | 3169 | 873 |
| నెల్లూరుసిటీ | 393 | 132 |
| నెల్లూరురూరల్ | 636 | 240 |
| సర్వేపల్లి | 1429 | 506 |
| ఉదయగిరి | 2047 | 527 |
| మొత్తం | 11033 | 3352 |

● ఎమ్మెల్యేల్లో కనిపించని ఆసక్తి

సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు ఇచ్చి.. ఆత్మకూరు నియోజకవర్గం నుంచి ఈ పథకాన్ని ప్రారంభించినా ప్రజాప్రతినిధుల్లో ముఖ్యంగా నియోజకవర్గాల్లో సర్వం తామై వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేల్లో పీ4 పట్ల పెద్దగా ఆసక్తి కనిపించడం లేదు. జిల్లా ఎమ్మెల్యేల విషయానికి వస్తే అందరూ స్థితిమంతులే. కనిష్ఠంగా వందల కోట్ల కన్నా తక్కువ స్థితిమంతులు ఎవరూ లేరు. వేల కోట్లకు పడగలెత్తిన వారూ ఉన్నారు. ఒక్కో ఎమ్మెల్యే తాను పుట్టి పెరిగిన ఊరినో లేదా నియోజకవర్గంలో బాగా వెనుకబడిన గ్రామాలనో దత్తత తీసుకొని ఇతరులకు స్ఫూర్తి నింపవచ్చు. లేదా కొన్ని కుటుంబాలనైనా దత్తత తీసుకోవచ్చు. కానీ ఎందుకనో ఒకరిద్దరు మినహా ఎవరూ స్పందించడం లేదు. మంత్రి పొంగూరు నారాయణ తన సంస్థల ద్వారా వీఆర్ స్కూల్‌తో వెయ్యి మంది విద్యార్థులకు పీ4 పథకం కింద ఉచితంగా పుస్తకాలు, ప్రతిరోజు భోజనవసతి కల్పిస్తున్నారు. దాతల సహకారంతో పీ4 కింద ఈ స్కూలును అత్యాధునికంగా మార్పు చేశారు. ఇదే స్ఫూర్తితో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆర్ఎస్ఆర్ స్కూలును దత్తత తీసుకున్నారు. ఇంతకు మించి ఎమ్మెల్యేలు ఎవరూ మార్గదర్శులుగా మారలేదు. ముఖ్యమంత్రి స్వయంగా రెండు, మూడు పర్యాయాలు ఎమ్మెల్యేలతో పీ4 పథకం గురించి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్వయంగా వీరు మార్గదర్శులుగా మారే విషయం అటుంచితే తమ నియోజకవర్గ పరిధిలో వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు చెందిన వారిని మార్గదర్శులుగా చేర్చే విషయంలోనూ ఆశించిన తీరుగా స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లా ఆర్థిక, సామాజిక స్థితిగతుల ఆధారంగా పరిశీలిస్తే ఇలాంటి సేవా కార్యక్రమాల్లో రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల కన్నా నెల్లూరు ముందు ఉండాలి. కానీ పాలకుల్లో స్పందన అంతంత మాత్రంగా ఉన్న కారణంగా జిల్లాలో పీ4 అధికారుల రెక్కల కష్టం మీద నడుస్తున్నట్లు అనిపిస్తోంది.

| | |
|---|---|
| గుర్తించిన బంగారు కుటుంబాలు | : 1,06,878 |
| అత్యధికం కోవూరు నియోజకవర్గం | : 3169 |
| ముందుకు వచ్చిన మార్గదర్శులు | : 3352 |
| దత్తత తీసుకున్న కుటుంబాలు | : 11033 |



నెల్లూరు : విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న వామపక్ష నేతలు

# స్మార్ట్ వద్దే వద్దు!

● ఆ మీటర్ల వల్ల ప్రజలపై ఆర్థిక భారం
● విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద వామపక్షాల ఆందోళన

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : 'విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లు వద్దే వద్దు.. వాటిని ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలి' అని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సోమవారం జిల్లావ్యాప్తంగా వామపక్షాలు నిరసన వ్యక్తం చేశారు. నెల్లూరు నగర పరిధిలో మినీబైపాస్ విద్యుత్ సబ్‌స్టేషన్, పడారుపల్లి సబ్‌స్టేషన్ల వద్ద ధర్నా చేపట్టారు. అంతకముందు జరిగిన నిరసన ప్రదర్శనలో ప్రజల నెత్తిన గుదిబండగా మారే స్మార్ట్‌మీటర్లు తమకు వద్దంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ నేత రామరాజు మాట్లాడుతూ అదానీ కంపెనీకి విద్యుత్ రంగాన్ని అప్పనంగా కట్టబెట్టేందుకు స్మార్ట్‌మీటర్లు బిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లను పగలకొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చిన కూటమి నాయకులు అధికారం రాగానే ఆ మీటర్ల వైపే మొగ్గుచేపుతున్నారన్నారు. సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు రాంబాబు, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి బసవరాజు, సీపీఐ ఎంఎల్ నాయకులు యానాదయ్యలు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యమం రాష్ట్రంలో పెద్ద ఎత్తున చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసనలో వామపక్ష నేతలు కత్తి శ్రీనివాసులు, మాదాల సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు, సిరాజ్, షాన్‌వాజ్, చిరంజీవి, ఫయాజ్, రమణారెడ్డి, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# పీజీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మూడు కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పీజీటీ పోస్టులకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సీతారామపురంలో కెమిస్ట్రీ, లింగసముద్రంలో ఫిజిక్స్, కలిగిరిలో ఎంపీహెచ్‌డబ్ల్యు సబ్జెక్టుల బోధనకు 2025-26 విద్యా సంవత్సరానికి తాత్కాలికంగా గెస్ట్‌ఫ్యాకల్టీకి నెలకు రూ.12వేల గౌరవ వేతనం అందచేస్తామని పేర్కొన్నారు. పీజీటీ కెమిస్ట్రీకి గ్రాడ్యుయేషన్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బీఈడీకి సంబంధించి మెథడాలజీ కలిగి ఉండి ఓసీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు, బీసీ అభ్యర్థులు 45, ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతులు 40శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. అలాగే ఫిజిక్స్ కూడా అదే రీతిలో ఎమ్మెస్సీ, బీఈడీ ఉండాలని, ఎంపీడబ్ల్యుహెచ్‌కు నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు సంబంధిత ఎంఈఓ కార్యాలయాల్లో దరఖాస్తులు అందచేయాలని పేర్కొన్నారు.

# ముగిసిన కాకాణి సిట్ కస్టడీ

● భూ రికార్డులపై 25 ప్రశ్నలు అడిగిన అధికారులు
● అన్నిటికీ 'నాకు తెలియదు.. నాకేం సంబంధం' అంటూ బుకాయింపు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సిట్ కస్టడీ సోమవారం ముగిసింది. నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న కాకాణిని రెండు రోజుల విచారణ నిమిత్తం కోర్టు అనుమతులతో సిట్ పోలీసులు ఆదివారం కస్టడీలోకి తీసుకున్నారు. వెంకటాచలం మండలం కాకుటూరు పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూములను పట్టా భూములుగా రికార్డులు మార్చిన కేసులో కాకాణి రిమాండ్‌లో ఉన్నారు. సిట్ డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాకాణిని నెల్లూరు డీటీసీలో ఆది, సోమవారాల్లో విచారించారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు భూములుగా మీ సహకారం లేకుండానే మార్చారా!? భూముల మార్పిడిలో ఎవరెవరు ఉన్నారు!? ఇంకెన్ని భూములను మార్చారు ఇలా 25 దాకా ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. సిట్ అధికారులు అడిగిన ప్రతి ప్రశ్నకు నాకు తెలియదు.. నాకు సంబంధం లేదు అన్న సమాధానాలు మాత్రమే కాకాణి ఇచ్చినట్లు సమాచారం.

# సిగ్గు పడాలి..!

● ఎస్టిమేషన్లు వేయడానికి ఏడాది కావాలా? ● ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈపై జేసీ ఆగ్రహం

నెల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : 'ఏంటండీ ఇది.. ఒక ఎస్టిమేషన్ వేయడానికి ఏడాది కావాలా!? సిగ్గుపడాలండీ!' అంటూ జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రెడ్డప్పపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మకూరు మండలం పమిడిపాడు, ఏఎస్‌పేట మండలం పునుగోడు గ్రామాలకు చెందిన కొందరు రైతులు తమ సమస్యపై సోమవారం ప్రజావిజ్ఞప్తుల వేదికలో జేసీకి అర్జీ ఇచ్చారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ భూసేకరణలో తమ భూములు తీసుకుంటున్నారని, అయితే, పరిహారం చెల్లింపులో తమ పొలాల్లోని చెట్లు, బోర్లను ఎస్టిమేషన్ వేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని జేసీకి విన్నవించుకున్నారు. భూసేకరణ అథారిటీ ఆదేశాలు ఇచ్చి ఏడాది దాటినా ఇంతవరకు అధికారులెవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. రైతుల ఆవేదనను విన్న జేసీ కార్తీక్.. ఆర్‌అడబ్ల్యూఎస్ ఎస్ఈ రెడ్డప్పను పిలిచారు. రైతుల పొలాల్లో బోర్లు ఎన్ని ఉన్నాయో వాటి ఎస్టిమేషన్లు వేసి పంపాలని ఆర్డీవో లేఖ రాసినా, ఏడాది నుంచి రైతులు కోరుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ప్రశ్నించారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ ఎస్టిమేషన్లు వేయలేకపోతున్నారంటే సిగ్గుపడాలి.. అంటూ జేసీ వ్యాఖ్యానించారు. వెంటనే రైతుల సమస్యను పరిష్కరించాలని ఎస్ఈను ఆదేశించారు. ఈ వ్యవహారం అధికార వర్గాల్లో చర్చనీయాంశమైంది.

● పనితీరుపై విమర్శలు

జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ పనితీరు విమర్శలకు తావిస్తోంది. ఇటీవల జడ్పీ స్టాండింగ్ కౌన్సెల్ సమావేశంలోనూ జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పనితీరును ఎత్తి చూపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు ఏడాది క్రితం నిధులు మంజూరు చేసినా ఎందుకు పనులు చేయలేదని ఎస్ఈను నిలదీశారు. సాక్షాత్తూ జడ్పీ కార్యాలయంలోనే పైపులైన్ పనులు చేయించలేని వారు, ఇక జిల్లా మొత్తం ఎలా పనులు చేయిస్తారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వరుస ఘటనలను బట్టి చూస్తే ఆర్‌డబ్ల్యూఎస్‌లో పని తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం!

● నేటి నుంచి ఉద్యోగుల వినూత్న నిరసన

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం 'టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమాన్ని మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు బి.సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి పీవీఎస్‌టీ రాంప్రసాద్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పీఆర్సీ ఆర్జిత సెలవుల రూపంలో ఉద్యోగులకు బకాయిలుగా ఉన్న రూ. 30వేల కోట్ల సాధన కోసం ఈ వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం నుంచి జిల్లావ్యాప్తంగా అన్ని తాలూకాల స్థాయిలో వారానికి ఒకరోజు ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులతో రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమం జరుగుతుందన్నారు. మంగళవారం ప్రభుత్వ ప్రధాన వైద్యశాల, ఎంపీడీఓ కార్యాలయంలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసు

# మరో నలుగురి అరెస్ట్!

● నిందితుల్లో వైసీపీ నాయకుడు

ఉలవపాడు/కలిగిరి, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కరేడుకు చెందిన లంకా వినోద్ ముగ్గురు వ్యక్తులతో కలిసి రూ.6లక్షల విలువైన 11 ఎర్రచందనం దుంగలను మినీ వ్యానులో తరలిస్తూ గత నెల 23వ తేదీన తిరుపతి జిల్లా వరదయ్యపాళెం పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వెనుక వైసీపీకి చెందిన ఓ నాయకుడు ఉన్నట్లు అప్పట్లో గుప్పుమంది. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. కరేడుకు సంబంధించి భూసేకరణ అంశం వివాదాస్పదం కావడం, పోలీసులు ఇతర నిఘా వర్గాలు తనిఖీలు ముమ్మరం చేస్తుండటంతో దాచి ఉంచిన ఎర్రచంద నాన్ని వీలైనంత త్వరగా చెన్నైకు తరలించాలన్న ఉద్దేశంతోనే ఈ స్మగ్లింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న వెంటనే వైసీపీకి చెందిన ఓ నాయకుడు రంగంలోకి దిగి బేరసారాలు సాగించినట్లు అప్పట్లో గుప్పుమంది. పట్టుబడ్డ దుంగలు కూడా కలిగిరి మండలం తూర్పుదూబగుంట అగ్రి గోల్డ్ భూముల్లోనివిగా గుర్తించారు.

● తాజాగా మరో నలుగురు

ఎర్రచందనం రవాణా కేసులో తాజాగా మరో నలుగురు నిందితులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో కరేడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, కరేడు భూసేకరణ ఉద్యమ నేత నల్లపరెడ్డి అజిత్‌రెడ్డితోపాటు అదే గ్రామానికి చెందిన వడ్రంగి పనిచేసే శ్రీహరి, అతని కుమారుడు నిరంజన్, బోగోలు మండంల తిప్ప గ్రామానికి చెందిన రాజేష్‌లను కలిగిరికి చెందిన పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు కలిగిరి సీఐ వెంకటనారాయణ, ఎస్సై ఉమాశంకర్ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కందుకూరు

# సబ్ కలెక్టర్‌గా హిమవంశీ



కందుకూరు ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు సబ్ కలెక్టర్‌గా దామెర హిమవంశీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడున్న తిరుమణి శ్రీపూజను బదిలీ చేసి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఇక కొత్త సబ్‌కలెక్టర్ హిమవంశీ తెలంగాణలోని నల్లగొండ వాసి. 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారైనా హిమవంశి రూర్కి ఐఐటీలో జియోఫిజికల్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన అనంతరం సివిల్స్‌కి ప్రిపేరై నాల్గవ ప్రయత్నంలో ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. కరేడులో భూసేకరణ, రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమలకు భూసేకరణపై రైతుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్న నేపథ్యంలో సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజను బదిలీ చేయడం గమనార్హం

# మీ యాప్‌లొద్దు..
# మీ సెల్‌ఫోన్లూ వద్దు!

● కావలిలో అంగన్వాడీల నిరసన
● సీడీపీవో కార్యాలయంలో ఫోన్ల ఉంచిన వైనం

కావలి (టౌన్), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : 'మీ యాప్‌లు వద్దు.. సెల్ ఫోన్లూ వద్దు..' అంటూ అంగన్వాడీ కార్యకర్తలు కావలిలో సోమవారం ఆందోళన చేశారు. ప్రభుత్వం అందించిన సెల్ ఫోన్లను ప్రాజెక్ట్ కార్యాలయంలో ఉంచేసి వెళ్ళిపోయారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ముసునూరులోని అంగన్వాడీ ప్రాజెక్ట్ కార్యాలయం వద్దకు 14 సెక్టార్ల పరిధిలోని అంగన్వాడీలు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లను సమీకరించి ఓ అట్టపెట్టెలో భద్రపరిచి కార్యాలయంలో ఉంచేసి వచ్చారు. సీఐటీయూ నాయకుడు పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు సెల్‌ఫోన్లను అందించి యాప్‌ల ద్వారా అదనపు పనిభారం మోపిందని, ఆ ఫోన్లు సరిగ్గా పనిచేయక అంగన్వాడీలు మానసిక క్షోభ అనుభవిస్తున్నట్లు తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతోనే ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. అలాగే అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు, హెల్పర్లకు ప్రమోషన్లు, గ్రాడ్యూటీల్లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. సీడీపీవో కార్యాలయంలో సెల్‌ఫోన్లు తీసుకునేందుకు ఎవరూ అంగీకరించకపోవడంతో కార్యాలయంలోనే ఉంచి వచ్చేశారు. ఈ నిరసనలో సీఐటీయూ నాయకులు కృష్ణయ్య, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు జయంతి, సుభాషిణి, విజయలత, రఘురావమ్మ, సౌజన్య, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇదే అంశంపై రాపూరు, అనంతసాగరం, వెంకటాచలం తదితర ప్రాంతాల్లోనూ అంగన్‌వాడీలు ఆందోళన చేశారు.



సెల్‌ఫోన్లను అట్టపెట్టెల్లో ఉంచి సీడీపీవో కార్యాలయంలో ఉంచుతున్న అంగన్వాడీలు

# 'ఆల్తూరుపాడు'పై ఆశలు

● రూ.733 కోట్లతో రివైజ్డ్ ప్రతిపాదనలు ● ముఖ్యమంత్రి హామీ.. ఫైనాన్స్‌కు చేరిన ఫైల్

ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు తాగు, సాగునీటి పరంగా కీలకమైన ఆల్తూరుపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణంపై ఆశలు చిగురిస్తున్నాయి. రాజకీయ కక్షతో జరుగుతున్న పనులను నాటి వైసీపీ ప్రభుత్వం అర్థంతరంగా ఆపేయగా.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ ప్రాజెక్టుపై దృష్టి పెట్టింది. సీఎం చంద్రబాబు ఆదేశాలతో రిజర్వాయర్ నిర్మాణానికి కొత్త ఎస్టిమేషన్లు తయారు చేసి పంపాలని ఆదేశాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులు రూ.733 కోట్లతో రివైజ్డ్ అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వ ప్రాధాన్యత ప్రాజెక్టుల కింద ఆల్తూరుపాడు చేర్చడంతో సదరు ఫైల్ వేగంగా కదులుతున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

-వివరాలు 8లో



అర్థంతరంగా ఆగిపోయిన ఆల్తూరుపాడు ప్రాజెక్టు పనులు

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో (రూ.లలో) |
|---|---|
| బాయిలర్ లైవ్ | 107 |
| స్కిన్ చికెన్ | 200 |
| స్కిన్‌లెస్ | 222 |

కోడిగుడ్ల ధర (100): 475

## కలిగిరిలో మోస్తరు వర్షం

కలిగిరి, ఆగస్టు 4( ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ప్రస్తుత సీజన్‌లోనూ మండుతున్న ఎండల నేపథ్యంలో ఈ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో మండల వాసులు ఉపశమనం పొందారు. పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవడంతో రాకపోకలు సాగించలేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



# నాణ్యతకు తిలోదకాలు!

● ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో పర్యవేక్షణ లోపం ● హడావిడిగా పనులు - నామమాత్రంగా క్యూరింగ్ ● మన్నికపై ఎన్నో అనుమానాలు

కందుకూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధాన రహదారి విస్తరణ, సెంట్రల్ డివైడర్ పనులు అధికారుల పర్యవేక్షణ లోపంతో నాణ్యత ప్రమాణాలకు తూట్లు పొడుస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ నిర్మిస్తున్న సిమెంటు రోడ్డుకు వాటర్ క్యూరింగ్ అంతంతమాత్రంగా ఉండడంతో ఈ రోడ్డు నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతోన్నాయి. పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం సెంటర్ నుంచి పామూరు రోడ్డు సర్కిల్ వరకు రహదారి విస్తరణ, సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకోసం రూ.1.25 కోట్ల మంజూరై పనులు ప్రారంభమయ్యాయి. పామూరు రోడ్డులో ఇరువైపులా సిమెంటు రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం బెడ్‌కాంక్రీట్ వేసి కనీసం రెండువారాలు క్యూరింగ్ జరిగాక ఫైనల్ లేయరు వేయాల్సి ఉండగా బెడ్‌కాంక్రీట్ వేశాక రెండు మూడు రోజులు కూడా జరగకుండానే ఫైనల్ లేయరు వేసేస్తున్నారు. అలాగే ఫైనల్ లేయరు కనీసం మూడు వారాలు క్యూరింగ్ జరగాల్సి ఉండగా వారం రోజులు తిరగకుండానే క్యూరింగ్ ఆపేస్తుండటంతో ఈ రోడ్డు మన్నికపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే నాణ్యత లోపిస్తుందన్న విమర్శలు ఉన్నాయి. సిమెంటు శాతం కూడా నిర్ధిష్ట ప్రమాణం కన్నా తక్కువగా వాడుతున్నారన్న సందేహాలు వ్యక్తమవుతోన్నాయి. పనులు హడావిడిగా పూర్తి చేయించాలన్న ఆలోచనలో నాణ్యతా ప్రమాణాలను వదిలేస్తుండటం ఎంత వరకు సబబు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిత్యం ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ప్రధాన రహదారి కావడం వల్ల నాణ్యతలో ఏమాత్రం లోపం జరిగినా, తగినన్నిరోజులు క్యూరింగ్ చేయకపోయినా సిమెంటు రహదారి అనతికాలంలోనే దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ డీఈఈ గణపతిని వివరణ కోరగా బెడ్‌కాంక్రీట్ వేశాక నాలుగైదు రోజులు గ్యాప్ ఇచ్చాకే ఫైనల్ లేయరు వేయిస్తున్నామని, ట్రా ఫిక్ సమస్య కోసం ఫైనల్ లేయరుకి మూ డు వారాలు క్యూరింగ్ చేయకుండా ట్రాఫిక్ వదిలామని చెప్పారు. ఉద యం, సాయంత్రం నీరు పట్టిం చే ఏర్పాటు చేస్తామని సమాధానమిచ్చారు.



పామూరు రోడ్డు విస్తరణలో భాగంగా జరుగుతున్న నిర్మాణ పనులు



సరైన వాటర్ క్యూరింగ్ చేయని సిమెంట్ రోడ్డు

## పక్కా గృహాల పెండింగ్ బిల్లులు అందేనా?

● ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

వలేటివారిపాలెం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఎప్పుడు అందుతాయా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. మండలంలో 2016 నుంచి 2019 వరకు నిర్మించుకున్న పక్కా గృహాలకు పెండింగ్ బల్లులు నేటికీ అందలేదు. అధికారిక లెక్కల ప్రకారం ఆ ఐదేళ్లలో 382 పక్కా గృహాల నిర్మాణాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 వరకు ఐదేళ్లలో విడతల వారీగా అన్ని వర్గాలకు 685 పక్కా గృహాలు మంజూరయ్యాయి. లబ్ధిదారులు ప్రభుత్వ సాయం కంటే వారి ఆర్థిక స్థోమతను బట్టి గృహాలను నిర్మించుకున్నారు. టీడీపీ అధికారంలో ఉన్న ఆ ఐదేళ్లలో 303 ఇళ్లు పూర్తయి, 382 ఇళ్లు వివిధ దశల్లో ఉండిపోయాయి. అనంతరం 2019లోఅధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వంలో మంజూరైన పక్కా గృహాలకు బిల్లులు చెల్లించకుండా నిలిపివేసింది. ఆలస్యంగా అయిన అప్పటి వైసీపీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుందన్న ఆలోచనతో లబ్ధిదారులు ఐదేళ్లు ఎదురుచూశారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఒక్క పెండింగ్ బిల్లు కూడా ఇవ్వలేదు. దీంతో పక్కా గృహాల నిర్మాణం కోసం బడుగు బలహీన వర్గాల ప్రజలు అప్పులు చేసుకొని, మహిళల మెడలో ఉన్న కాస్తోకూస్తో బంగారం తాకట్టు పెట్టుకొని మరీ ఇంటి నిర్మాణాలను కొనసాగించారు. వైసీపీ ప్రభుత్వం కక్ష పూరితంగా బిల్లులు నిలిపివేయడంతో వారంతా లబోదిబోమన్నారు. పెండింగ్ బిల్లుల కోసం లబ్ధిదారులు అధికారులు చుట్టూ తిరిగి తిరిగి వేశారిపోయారు. ఇక ఏ ప్రభుత్వం వచ్చినా ఆ బిల్లులు గతి అంతేనా అని మిన్నకుండిపోయారు. కాగా ఏడాది క్రితం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. ఆరు నెలలు గడిచిన తరువాత 2014 నుంచి 2019 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు పెండింగ్ బల్లులు మంజూరు చేస్తామని ప్రకటించండం పట్ల లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. పెండింగ్ బిల్లులు మంజూరయితే గృహ నిర్మాణం కోసం చేసిన అప్పులైనా తీర్చుకోవచ్చు అనుకొని ఆశపడ్డారు. కూటమి ప్రభుత్వం చెప్పిన ఆశ ఎప్పుడు తీరుతుందా అని ఎదురుచూస్తున్నారు. ఆ ప్రకటన వెలువడి ఆరు నెలలు గడిచిపోయినా పెండింగ్ బిల్లులు విషయం ఏమి తెలియకపోవడంతో బిల్లులు వస్తాయా రావా అనే ఆందోళనలో పడిపోయారు. మరి ఎంత కాలానికి వస్తాయో రావా అని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఈ విషయంపై వలేటివారిపాలెం హౌసింగ్ ఏఈ నాగరాజును వివరణ కోరగా గత టీడీపీ ప్రభుత్వంలో నిలిచిపోయిన గృహాల పెండింగ్ బిల్లులు వివరాల నివేదికలను ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.

## నమ్మిన వారికి అండగా ఉంటాం



దుండిగం కాలనీలో మహిళలతో మాట్లాడుతున్న భానుచందర్ నాయుడు

దగదర్తి(బిట్రగుంట) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నమ్ముకున్న వారికి మాలేపాటి కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని టీడీపీ యువనేత మాలేపాటి భానుచందర్ నాయుడు అన్నారు. దగదర్తి మండలం దుండిగం ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ కాలనీల్లో 78 కుటుంబాలకు సుమారు రూ.4.75 లక్షల సొంత నిధులతో అందజేసిన సిమెంట్, రేకులతో చేపట్టి నిర్మాణ పనుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మాలేపాటి రామానాయుడు ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పేపర్ల సూరిబాబు, వర్ధినేని కృష్ణ, ఏడుకొండలు, టీ.వెంకటేశ్వర్లు, ఎం.పవన్, కే.శీనయ్య, రమణమ్మ, అంకబాబు, తదితరులు పాల్గొన్నారు.

## అజిత్ ఆచూకీ తెలపండి!

● ఉలవపాడు స్టేషన్ వద్ద కరేడు రైతుల ఆందోళన

ఉలవపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : నల్లపరెడ్డి అజిత్‌రెడ్డిని అరెస్టు చేసి ఎక్కడకు తీసుకెళ్లారో ఆచూకీ తెలపాలంటూ కరేడుకు చెందిన రైతులు, గ్రామస్థులు ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. భూసేకరణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరిస్తున్నందనే అజిత్‌రెడ్డిని అరెస్టు చేశారంటూ డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వద్ద వాపోయారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన డీఎస్పీ ఎర్రచందనం అక్రమ తరలింపులో కరేడుకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు సోషల్ మీడియాలో వస్తోందని అన్నారు. కలిగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారని కందుకూరు సబ్ డివిజన్ పరిధిలోని కేసుకు సంబంధం లేదని రైతులకు నచ్చచెప్పి పంపించారు.

## అల్లుకున్న నిర్లక్ష్యం!



ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ తీగలకు అల్లుకున్న పిచ్చిచెట్ల తీగలు

కావలి రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనగర్ కాలనీ దారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలకు చెట్ల తీగలు పెనవేసుకుని ప్రమాదకరంగా అల్లుకున్నాయి. దీంతో తరచూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు వస్తున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని వెంగళరావునగర్ కొత్త శివాలయం నుంచి ముసునూరు ఇందిరమ్మ కాలనీకి వెళ్లే మార్గంలో నూతనంగా ఎత్తుగా సీసీ రోడ్డు ఏర్పాటు చేయడంతో రోడ్డు అంచునే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తగ్గిపోయి ప్రమాదకరంగా ఉంది. దానికి తోడు చెట్ల తీగలు అల్లుకుపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగలు ఆశాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చెయ్యాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

# సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు

● ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కొండాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. మండలంలోని ఇస్కదామెర్ల పంచాయతీ పొట్టివల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ పాలన పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలంటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఆదేశించారు. ఎస్టీ కాలనీలో ఇప్పటి వరకు ఆధార్ కార్డు, రేషన్ కార్డులు లేవని దీంతో తల్లికి వందనం నగదు రాలేదని బాధితులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలినేని చంద్రబాబునాయుడు, యారవ కృష్ణయ్య, పోలినేని రమేష్, దాసరి అశోక్, ఏలూరి వెంకటేశ్వర్లు, గుంటుపల్లి వెంకటేశ్వర్లు, వెంకటరమణ, కె.శ్రీనివాసులు, గద్దె మాధవ, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తదితరులు

# పీ-4లో భాగస్వాములు కావాలి

● స్వచ్ఛంద సంస్థలకు ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ సూచన



స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులతో చర్చిస్తున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

కావలి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుపేదలు ఎవరూ ఉండకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన పీ-4 కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో ఆయన చర్చించారు. స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఎవరైనా పీ-4 కింద నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకోగలిగితే ముందుకు రావాలన్నారు. తగిన ఆర్థిక స్థోమత లేకపోతే వారికి మార్గదర్శకులుగా పనిచేయాలని కోరారు. ఇప్పటికే నియోజకవర్గంలో పీ-4 కింద ఉన్న కుటుంబాలను గుర్తించి వారికి ఉపయోగపడగలిగే దాతలను కూడా కొంత మందిని గుర్తించామన్నారు. ఈ కార్యక్రమం విభాగంకు చెందిన వారి వద్ద ఆ వివరాలు ఉన్నాయని, వాటిని అందచేస్తామని చెప్పారు. వారే కాకుండా ఇంకా నిరుపేద కుటుంబాల వివరాలను, దాతలు వివరాలను తెలియచేయాలన్నారు. నిరుపేద కుటుంబాలను దాతలు దత్త తీసుకున్న తర్వాత స్వచ్ఛంద సేవకులుగా మీరు వారి బాగోగులను చూసుకుంటూ మార్గదర్శకులుగా ఉండాలన్నారు. ఆర్థికస్తోమతతో సంబంధం లేని పలు సేవలను పీ-4 కుటుంబాలకు అందచేయాలని చెప్పారు. దానికి స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సుముఖత వ్యక్తం చేశారు.

# షాపింగ్ కాంప్లెక్స్‌పై స్టేటస్‌కో పొడిగింపు

కందుకూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : కందుకూరు గ్రామ దేవత అంకమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌పై హైకోర్టు స్టేటస్‌కోను మరో వారం రోజులు పొడిగించింది. బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బీఓటీ) పద్ధతిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి దేవాదాయశాఖ బహిరంగ వేలం విధానంలో రూములు కేటాయించగా ఆలయ ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వలన భక్తులకు అసౌకర్యం కలుగుతుందని ఆలయ పూర్వ ధర్మకర్త దివి లింగయ్యనాయుడు హైకోర్టులో పిల్ వేశారు. దీంతో కోర్టు మూడు వారాల క్రితం స్టేటస్‌కో ఉత్తర్వులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఆలయ ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం తగదని, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న ప్రదేశంలో కొంతభాగం ప్రభుత్వ స్థలంగా ఉందని లింగయ్యనాయుడు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరగగా దేవాదాయశాఖ తరుపు న్యాయవాది ప్రభుత్వ స్థలాన్ని ఆలయానికి దాఖలు పరుస్తు పొజిషన్ సర్టిఫికెట్ ఉందని వాదించగా గతంలో లేని సర్టిఫికెటు ఇప్పుడు ఎలా వచ్చిందని లింగయ్యనాయుడు తరుపు న్యాయవాది వాదించినట్లు సమాచారం. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి కేసును ఈనెల 11వ తేదీకి వాయిదా వేస్తూ అప్పటి వరకు రూములు నిర్మాణంపై స్టేటస్‌కో యధావిధంగా కొనసాగుతుందని ఉత్తర్వులు ఇచ్చింది.

# మందబయలు భూములు అటవీశాఖకు కేటాయించొద్దు

● కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజకు వినతి

కొండాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుఎర్రబల్లి గ్రామ మైనర్ ఇరిగేషన్ చెరువును ఆనుకొని దక్షిణం వైపున సర్వే నెంబరు 672లో ఉన్న 580.5 ఎకరాల భూమిని అటవీశాఖకు కేటాయించవద్దంటూ గ్రామస్థులు దగడ మాలకొండారెడ్డి, అనిల్ తదితరులు సోమవారం కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదరు మందబయలు భూమిలో గ్రామంలోని పశువులు, గొర్రెలు, మేకలు, ఆవులు, ఎద్దులు మేత మేస్తుండేవన్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు ఆ భూమిని అటవీశాఖకు కేటాయించారంటూ అధికారులు రాళ్లు నాటారన్నారు. అటవీశాఖ అధికారులు భూమిని చదును చేసి మొక్కలు నాటితే గ్రామంలో ఉన్న దాదాపు 5000 పశువులు, గొర్రెలు, మేకలు మేత మేసేందుకు ఎటువంటి అవకాశం లేదన్నారు. పశువులపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని, అటువంటి పరిస్థితి రాకుండా చూడాలని గ్రామస్థులు ఆమెను కోరారు. ఈ విషయాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారని గ్రామస్థులు తెలిపారు.



కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజకు వినతిపత్రం అందచేస్తున్న తూర్పుఎర్రబల్లి గ్రామస్థులు

## బకింగ్‌హామ్ కెనాల్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టండి

● రాజ్యసభలో బీద మస్తాన్‌రావు యాదవ్

కావలి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో బకింగ్‌హామ్ కెనాల్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు యాదవ్ కోరారు. సోమవారం ఆయన రాజ్యసభలో మాట్లాడారు. కాకినాడ నుంచి తమిళనాడులోని చిదంబరం వరకు 420 కి.మీ పొడవున విస్తరించి ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ పునరుద్ధరణ జరిగితే 2047 నాటికి 7.14 మిలియన్ టన్నుల సరుకులు రవాణా చేయవచ్చన్నారు. అలాగే రామాయపట్నం పోర్టుకు రైలు కనెక్టివిటీపై, బిట్రగుంట, కావలి రైల్వేస్టేషన్ల అభివృద్ధిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమాధానం ఇస్తూ రామాయపట్నం పోర్టు నుంచి తెట్టు రైల్వేస్టేషన్ వరకు కనెక్టివిటీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటైం బోర్డు ద్వారా గతిశక్తి మల్టీమోడల్ కార్గో టెర్మినల్ పాలసీ కింద పనులు చేపట్టమన్నారు. బిట్రగుంట, కావలి రైల్వేస్టేషన్లలో నూతన భవనాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, షెల్టర్లు, వెయిటింగ్ హాల్‌లు పూర్తి అయ్యాయని చెప్పారు. బిట్రగుంటలో దివ్యాంగుల కోసం ప్రత్యేక మార్గాలు, రోడ్డు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. కావలిలో దివ్యాంగుల మార్గాలు, లిఫ్టులు నిర్మాణంలో ఉన్నాయని మంత్రి తెలిపారన్నారు.

## దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

బిట్రగుంట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దళితులు, వారి కుటుంబాలపై దాడి చేసిన వారి వెంటనే శిక్షించాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు డిమాండ్ చేశారు. బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంటలో శనివారం ఎస్సీపాలెంకు చెందిన కొందరు చేసిన దాడులను ఆయన ఖండించారు. సోమవారం ఆయన మాట్లాడుతు కులదూషణ చేయడమే కాకుండా మారణాయుధాలతో ఇళ్లపై దాడులు చేయడం ఎంత వరకు సమజ్యసమని ప్రశ్నించారు. అడ్డువచ్చిన దళిత మహిళలను అసభ్యంగా మాట్లాడుతూ వారిపై చేయిచేసుకోవడం కుల అహంకారమే అన్నారు. ముకుమ్మడి దాడికి దిగిన వారిపై పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

### దళిత కుటుంబాలకు పరామర్శ



దళితులతో మాట్లాడుతున్న దళితనేత జువ్విగుంట బాబు

బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంట దళితులను సోమవారం మాల ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్విగుంట బాబు పరామర్శించారు. దళితవాడపై జరిగిన మూడుమ్మడిని తీవ్రంగా ఖండించారు. దళిత కుటుంబాలపై జరిగిన దాడులకు న్యాయం చేయమని కావలి రూరల్ సీఐని కోరుతామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉద్యోగ సంఘాల నేతలు నెలగాని హరి, ఆదినారాయణ, జైభీం అంబేడ్కర్ సేవాదళ్ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర, బహుజన సమాజ్‌వాది నేతలు కేశనంద, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ, సంకల్ప బలంతోనే ఉన్నత శిఖరాలు

కావలి(టౌన్), ఆగస్టు4(ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, సంకల్ప బలంతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకుంటారని విశ్రాంత వింగ్ కమాండర్ ఐ ప్రేమ చంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు, తండ్రిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజంలో సాంకేతిక విద్యకు రోజురోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. అన్ని రంగాలకు చెందిన సేవలు సాంకేతిక విద్యతో ముడిపడి ఉన్నాయన్నారు. విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకుని మొదటి సంవత్సరం నుంచే లక్ష్యాలు ఏర్పరచుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ప్లేస్‌మెంట్ డైరెక్టర్ వంశీమోహన్ మాట్లాడుతూ అంతర్జాతీయ సంస్థలలో ఉద్యోగావకాశాలకు కావాల్సిన సాఫ్ట్ స్కిల్స్, ఆప్టిట్యూడ్, కోడింగ్ తదితర అంశాలలో నిష్ణాతులైన ఆచార్యలచే శిక్షణ అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తరచూ కళాశాలను సందర్శించి తమ పిల్లలు పురోగతి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుకు పరుగు!

● నిరుపయోగంగా మరుగుదొడ్డి ● ఇబ్బందులు పడుతున్న మహిళలు ● పట్టించుకోని అధికారులు



రూరల్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరుపయోగంగా మరుగుదొడ్డి

కావలి రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలు ఎన్ని ఉన్నా శాఖల మధ్యన సమన్వయ లోపంతో కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చే ప్రజలు అత్యవసర సమయాల్లో మరుగుదొడ్ల కోసం పరుగులు తీయాల్సి వస్తోంది. పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం, రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్‌జైల్, రూరల్ పోలీస్ స్టేషన్, ట్రెజరీ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాయం ఇలా ప్రభుత్వ కార్యాయాలు అన్నీ ఒకే ప్రాంగణంలో ఉండటంతో నిత్యం గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వందలాదిగా ప్రజలు వస్తుంటారు. కానీ కార్యాలయాల్లో పనిచేసే అధికారులకు, సిబ్బందికి తప్ప బయటి వ్యక్తులకు మరుగుదొడ్లు లేవన్న ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వంలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ఆ మరుగు దొడ్ల నిర్వహణ లేకపోవడంతో కొన్ని రోజులకే నిరుపయోగంగా మారిపోయాయి. అప్పటి నుంచి కార్యాయాలకు వచ్చే మహిళలు కూడా మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లు ఉపయోగంలోకి తేవాలని, మరుగుదొడ్ల నిర్వహణ మున్సిపాలిటీ చేపట్టాలని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుతున్న మరుగుదొడ్డి షీట్లు

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తొలగించాలి

## రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య



నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మన పరిసరాల్లోని సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సమష్టి కృషితో తొలగించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పీ.కృష్ణయ్య కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో ఆయన జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబరు 2 నాటికి జిల్లాలో సింగిల్ యూజప్ ప్లాస్టిక్‌ను పూర్తిగా తొలగించాలని, ఇది ముఖ్యమంత్రి ఆశయమని తెలిపారు. అందుకు అనుగుణంగా అధికారులంతా పనిచేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ రోజూవారి సరుకులుకొని తెచ్చుకునేందుకు వస్త్ర సంచుల వాడకం అలవాటు చేసుకోవాలని కోరారు. జిల్లాలో ప్లాస్టిక్ సంచుల తయారీకి అనుమతులు లేవన్నారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి ప్లాస్టిక్ సంచులు దిగుమతులను వివిధ చెక్‌పోస్టుల వద్ద తనిఖీ చేయాలన్నారు. హోల్‌సేల్ వ్యాపారం జరిగే ప్రదేశాల్లో ప్లాస్టిక్ సంచులు విక్రయాన్ని నియంత్రించేందుకు దాడులు చేయాలన్నారు. ఇందుకు ప్రత్యేకంగా జిల్లాలో మల్టీ డిపార్ట్‌మెంట్ టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీపీవో శ్రీధర్‌రెడ్డి, డీటీసీ చందర్, డీఎస్‌వో విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# 7 నుంచి శబరి శ్రీరామక్షేత్రం వార్షికోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రం 25వ వార్షికోత్సవాలు ఈనెల 7, 8తేదీల్లో జరగున్నాయి. ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు మందిరం చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వతేదీ ఉదయం లక్ష తులసీదళ అర్చన, రాత్రి సీతారామ కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 8న ఉదయం 8.30గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం జరుగుతుందని, భక్తులందరూ తరలిరావాలని ఆయన కోరారు.

# డీఐఈవోగా కృష్ణారెడ్డి

నెల్లూరు (విద్య), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇంటర్‌బోర్డు విద్యాశాఖ ఇన్‌చార్జి అధికారిగా (డీఐఈవో) బీవీ.కృష్ణారెడ్డి నియమితులయ్యారు. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఆయన పదోన్నతిపై నెల్లూరు జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా నగరంలోని కేఏసీ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని డీఐఈఓ కార్యాలయంలో కృష్ణారెడ్డిని అధ్యాపకులు పాటూరు వేణుగోపాల్ రెడ్డి, బి.బసివిరెడ్డి, బాలసుబ్బారెడ్డి తదితరులు సత్కరించి అభినందించారు.



కృష్ణారెడ్డికి అభినందనలు తెలుపుతున్న అధ్యాపకులు



# పెళ్లిపై అవగాహనకు కేంద్రం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : యువత వివాహానికి ముందు భావోద్వేగాలు, ఆచారాలు, ఆరోగ్యం వంటి అంశాల్లో అవగాహన లేకుండా సమస్యలు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ ఆనంద్ అన్నారు. పెళ్లిపై యువతకు అవగాహన కోసం నగరంలోని సఖి వన్ స్టాప్ సెంటర్‌లో కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రీ మెరిటల్ కౌన్సెలింగ్ సెంటర్ ద్వారా వివాహ సంబంధ సమస్యలపై ముందు జాగ్రత్తగా మార్గదర్శనం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, వన్‌స్టాప్ అడ్మిన్ ఎస్‌కే షహనాజ్, న్యాయ సలహాదారులు ఎన్.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.





లింగ సముద్రంలో వేసిన వెంచర్

# లింగసముద్రంలో రియల్ భూం

- పరిశ్రమలు వస్తాయని భూముల ధరకు రెక్కలు
- ఆర్‌అండ్‌బీ రోడ్ల పక్కన వెలుస్తున్న లేఅవుట్లు

లింగసముద్రం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం మండలంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. మండలంలోని తిమ్మారెడ్డిపాలెం, యర్రారెడ్డిపాలెం, లింగసముద్రం, ఆర్‌ఆర్ పాలెం గ్రామాల్లోని అటవీ ప్రాంతాల్లో జిందాల్ కంపెనీ ఆధ్వర్యంలో ఇనుప ఖనిజ నిక్షేపాల కోసం తవ్వకాలు జరుగుతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు వస్తాయని భావించి రియల్టర్లు మండలంలోని పలు గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్ల పక్కనే ఉన్న వ్యవసాయ భూములను కొనుగోలు చేసి వ్యవసాయేతర భూములుగా మార్చి వెంచర్లు వేస్తున్నారు. ఒంగోలు, కావలి, కందుకూరు పట్టణాలకు చెందిన కొందరు రియల్టర్లు, మండల కేంద్రమైన లింగసముద్రం, తిమ్మారెడ్డిపాలెం, చినపవని, పెదపవని గ్రామాలకు చెందిన పలువురు రియల్టర్లు, లింగసముద్రం, చినపవని, పెదపవని గ్రామాల్లో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ భూములను ఒక ఎకరా నుంచి 5 ఎకరాల వరకు కొనుగోలు చేసి, వాటిని వ్యవసాయేతర భూములుగా మార్చి ఆగమేఘాలపై వెంచర్లు వేశారు. ఎకరా భూమిని రూ.కోటి నుంచి రూ.1.50 కోట్లకు కొనుగోలు చేసి, వెంచర్లు వేసి, వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. లింగసముద్రంలో వేసిన కొన్ని వెంచర్లలో ఒక్క సెంటు స్థలం ఖరీదు రూ.4 లక్షలు వరకు పలుకుతోంది. దీంతో ఆ వెంచర్‌లో వేసిన రెండున్నర సెంట్లు స్థలం ఉన్న ప్లాట్లు రూ.10 లక్షలకు హాట్ కేకుల్లా అమ్ముడు పోయాయి. అలాగే మరో వెంచర్‌లో ఒక సెంటు స్థలం రూ.10 లక్షల వర కు ధర చెబుతున్నట్టు కొనుగోలుదారులు చెబుతున్నారు. ఇక లింగసముద్రంతో పాటు, పెదపవనిలో కూడా సెంటు స్థలం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ధర చెబుతున్నట్లు తెలిసింది. చినపవనిలో కొత్తగా 8 ఎకరాల్లో కొత్తగా ఒక లేఅవుట్ వేస్తున్నారు. ఇలా రియల్టర్లు భూముల కొనుగోలుపై దృష్టి సారించడంతో లింగసముద్రం ప్రాంతంలో రియల్ భూం పరుగులు తీస్తోంది.

# రికార్డు స్థాయిలో అర్జీలు

- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కి 566 వినతులు
- వాటిలో రెవెన్యూ శాఖవే 205

నెల్లూరు(హరథపురం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కి సోమవారం రికార్డు స్థాయిలో 566 అర్జీలు అందాయి. వాటిలో 205 వినతులు రెవెన్యూశాఖవే. ఇంత పెద్ద సంఖ్యలో అర్జీలు అందుతాయని అధికారులు కూడా భావించలేదు. ఉచిత భోజనం, కూర్చోడానికి సౌకర్యాల ఏర్పాటుతో అర్జీదారులు పెరిగారని తెలుస్తోంది. కలెక్టర్ ఆనంద్ అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులను పిలిచి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

**● దళిత సంఘర్షణ సమితి నిరసన**

ఒకే కుటుంబానికి 21 ఎకరాలు రహదారి పక్కన ఇచ్చారని ఆరోపిస్తూ దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి ఆధ్వర్యంలో నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. 2014లో తహసీల్దార్ కావలి రూరల్ మండలం రుద్రకోటకి చెందిన గోపి కుటుంబానికి 21 ఎకరాలు ఇచ్చారని, అలా ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. నిరసన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జరుగుమల్లి కోటయ్య, చలంచర్ల, లక్ష్మయ్య, పోలయ్య, యానాది సంఘం జిల్లా అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ పాల్గొన్నారు.

**● డ్రైవర్ల సంఘానికి ఎన్నికలు నిర్వహించాలి**

ప్రభుత్వ డ్రైవర్ల సంఘానికి ప్రత్యేక ప్రభుత్వ అధికారిని నియమించి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వ డ్రైవర్లు పీ ప్రసాద్, వీ రమణయ్య తదితరులు వినతిపత్రం సమర్పించారు. తక్షణమే ఎన్నికలు జరపాలని కోరారు.

**● జెండా పండుగకు ఏర్పాట్లు చేయాలి**

స్వాతంత్ర్య వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన భవనలో ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన విధులను వారు బాధ్యతగా నిర్వహించాలన్నారు. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలతోపాటు జిల్లాలోని అన్నీ విద్యాసంస్థల్లో పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, డీఆర్వో హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

**● పీ-4పై అవగాహన చేసుకోవాలి..**

పీ-4 పథకాన్ని అధికారులు అవగాహన చేసుకుని మార్గదర్శులను పెంచాలని కలెక్టర్ ఆనంద్ అన్నారు. పీ-4పై తిక్కన భవన్‌లో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఈ పథకంపై విస్తృతంగా చర్చ జరపాలన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ తదితరులు పాల్గొన్నారు.

**● జీఎస్టీ రిజిస్ట్రేషన్లు పెంచాలి**



అర్జీదారుడి సమస్య వింటున్న కలెక్టర్ ఆనంద్

జిల్లాలో జీఎస్టీ రిజిస్ట్రేషన్లు పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం వాణిజ్యపన్నుల శాఖ, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువిలువ రూ.40లక్షలు, సేవల విలువ రూ.30లక్షలు దాటిన వ్యాపార సంస్థలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు రవాణా, మైనింగ్‌శాఖలు వాణిజ్యపన్నుల శాఖతో సమన్వయంతో ఉండాలన్నారు. ఈ సమావేశంలో వాణిజ్య పన్నులశాఖ డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే పిల్లలు పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

# ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి : ఏఎస్పీ


నెల్లూరు(క్రైం), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 84 మంది సమస్యలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. నగర డీఎస్పీ సింధుప్రియ, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కేసీహెచ్ రామారావులు ఫిర్యాదులు స్వీకరించారు. అందిన ఫిర్యాదుల్లో కొన్ని...

- కావలికి చెందిన ఓ వ్యక్తి ఇంటిపై సోలార్ ప్యానల్స్ బిగిస్తానని కోవూరుకి చెందిన ప్రవీణ్‌కుమార్ రూ.2.46 లక్షలు తీసుకున్నాడు. ప్యానల్స్ బిగించక పోగా నగదు తిరిగి ఇవ్వమంటే బెదిరిస్తున్నాడని బాధితుడు పేర్కొన్నారు.
- మర్రిపాడుకి చెందిన ఓ వ్యక్తికి, వింజమూరుకి చెందిన ఓ మహిళకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని కలువాయికి చెందిన సంధ్య అనే మహిళ నమ్మించి వారి నుంచి రూ.5 లక్షలు తీసుకుంది. ఉద్యోగాలు ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా బెదిరిస్తోందని బాధితులు ఫిర్యాదు చేశారు.
- వెంకటాచలానికి చెందిన రైతుల నుంచి రూ.29 లక్షల విలువ చేసే పంట దిగుబడిని దళారి మునికృష్ణయ్య తీసుకెళ్లాడు. అయితే ఇప్పటివరకు బకాయిలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని, న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న నగర డీఎస్పీ సింధుప్రియ

# సమరం సాహిత్యం రాజకీయం బెగోరే



నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్యయోధుడు, సింహపురి ముద్దుబిడ్డ డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి (బెగోరె) వివిధ పదవుల్లో పనిచేసి రాజకీయ చాణుక్యుడిగా పేరుగాంచారు. సాహిత్యంలోనూ కూడా ఆయన రాణించారు. ఆయన 1907 ఆగస్టు 5న బుచ్చిరెడ్డిపాలెంలోని జమీందారీ కుటుంబీకులైన బెజవాడ పట్టాభిరామిరెడ్డి, సీతమ్మ దంపతులకు జన్మించారు. ఆయన విద్యాభ్యాసం బుచ్చి, నెల్లూరు, గుంటూరులోని ఆంధ్రా జాతీయ కళాశాల (1921-24), కలకత్తాలోని విశ్వభారతి విద్యాలయాల్లో (1924-27) సాగింది. జరిగింది. చదువు పూర్తవగానే స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారు. ఆరుసార్లు జైలు శిక్ష అనుభవించారు. 1930, 31, 32, 33, 1940, 41, 42, 43 సంవత్సరాల్లో జైలు జీవితం గడిపారు. జైలులో ఏ, బీ, సీ క్లాస్ ఖైదీగా, డెటిన్యూగా గడిపారు. దేశభక్తి, క్రమశిక్షణ ఆయన రెండు కళ్లు. నెల్లూరు జిల్లా నుంచి జాతీయ నాయకుడిగా ఎదిగిన జననేత ఆయన. మంత్రిగా ఉమ్మడి మద్రాసు రాష్ట్రం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ పనిచేశారు. కేంద్ర మంత్రిగా కూడా కొంతకాలం పనిచేశారు. ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా ఐదేళ్లు పనిచేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రొ చాన్సలర్‌గా జూన్ 1951 నుంచి 1957 వరకు పనిచేశారు. ఏ పదవిలో ఉన్నా ఆయన ఆ పదవికి వన్నె తెచ్చారు. మంత్రిగా ఆయా శాఖల్లో సంస్కరణలు తీసుకువచ్చారు.

- నేటి యువతరానికి స్ఫూర్తి బెజవాడ గోపాల్‌రెడ్డి
- స్వాతంత్ర్య సమరయోధుడిగా పలుమార్లు జైలుకు..
- ఎన్నో పదవులకు వన్నెతెచ్చిన రాజకీయ చాణుక్యుడు
- సాహితీవేత్తగా కూడా రాణింపు
- నేడు గోపాల్‌రెడ్డి జయంతి

**● వివిధ పదవుల అలంకరణ**

ఆయన 1955లో ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1956లో విశాలాంధ్ర ఏర్పడినప్పుడు ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. ప్రధాని నెహ్రూ హయాంలో కేంద్రంలో రెవెన్యూ, సమాచార ప్రసార శాఖల మంత్రిగా పనిచేసి ఆ శాఖలకు వన్నె తెచ్చారు. 90 ఏళ్లు నిండు జీవితాన్ని గడిపిన బెజవాడ గోపాలరెడ్డిని నేటితరం రాజకీయ వేత్తలు, సాహితీవేత్తలు ఆదర్శంగా తీసుకోవాలి. కాగా 90వ జన్మదినం సందర్భంగా 1996లో జరిగిన అభినందన సభలో ఆయన జీవిత విశేషాలతో లాయర్ పత్రిక 'బతుకంతా బృందావనమే' ప్రత్యేక సంచికను ఆవిష్కరించింది. అనాడు జరిగిన సభలో డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, మాగుంట పార్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**● తెలుగుభాష అభివృద్ధికి కృషి**

తెలుగు భాషాభిమానిగా, మాతృభాష అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ఎనలేనిది. 1948 నుంచి తెలుగు భాషా సమితి అధ్యక్షుడిగా కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ తెలుగు సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా 1957 ఆగస్టు నుంచి 1982 డిసెంబరు వరకు పనిచేశారు. ఆయన కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలోనే తెలుగుభాషకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు. తెలుగు జ్ఞానపీఠంకు 1963 నుంచి 1971 వరకు అధ్యక్షుడిగా పనిచేసి ఎన్నో సాహితీ సభలు నిర్వహించారు.

**● రచయిత కూడా..**

రచయితగా ఆయన రచనలు చేయడమేకాక, ఎన్నో సాహిత్య సభలు నిర్వహించారు. ఎందరో సాహితీవేత్తలు, కవులతోపాటు నాటకాలు, చలన చిత్ర కళాకారులను ఆయన సత్కరించారు. కళాపోషకుడిగా ఆయన గుర్తిండిపోయారు. రచయితగా 13 రచనలు, అనువాదకుడిగా 10 పుస్తకాలు రాశారు.

**● రాసిన పుస్తకాలు...**

ఆమె పంచకము పేరున ఆమె (1978), ఆమె జాడలు(1981), ఆమె నీడలు(1981), ఆమె తళుకులు (1982) ఆమె చెణుకులు (1982), స్వలింగాలు-తుషారాలు(1984), స్వపనహారం (1986), ఆయన రచించిన శతకవితలు, కాలవాహిని (1979), సాహిత్య సుందరి (1980), ప్రసూన మంజిరి (1981), పరిమళ తరంగాలు (1982), సాగర సమీరాలు(1983), మలయ మారుతాలు (1985) వంటి పుస్తకాలు ఎంతో ప్రజాదరణ పొందాయి. గోపాల్‌రెడ్డి విశ్వకవి రవీంద్రనాథుడి రచనలను తెలుగులోకి అనువదించి సాహితీ ప్రియులకు అందించారు. రవీంద్రుడి నాటికలు, 5 సంపుటాల కథలు, కల్పనలు, వాన చినుకులు, ఊర్వశి కాళిదాసు, నైవేద్యం, స్మరణ, తాజ్ మహల్, ఇక్బాల్ ఫిర్యాదులు, జవాబు, కొన్ని ఉర్దూ కవితలను కూడా తెలుగులోకి అనువదించారు. ఆయన తన 70వ ఏట నుంచి రచనలు ప్రారంభించారు. సాహిత్యంలో లోతు పాతులు తెలుసుకున్నారు.

పాద ముద్రలు



సాహిత్య సభలో ప్రసంగిస్తున్న బెజవాడ గోపాల్‌రెడ్డి



సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావుకు నటసామ్రాట్ బిరుదును ప్రదానం చేస్తున్న బెగోరె

# అధిక ధరలకు యూరియా విక్రయిస్తే కఠిన చర్యలు

- డీలర్లకు వింజమూరు ఏడీఏ శేషగిరి హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జలదంకి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు యూరియా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వింజమూరు ఏడీఏ శేషగిరి హెచ్చరించారు. గత శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'బ్లాక్‌లో యూరియా' కథనానికి వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమ వారం మండల వ్యవసాధికారి శ్రీవాణితో కలసి మండలంలోని ఎరువులు, పురుగు మందుల డీలర్లతో స్థానిక రైతుసేవా కేంద్రంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ యూరియా అధిక ధరలకు ఎందుకు విక్రయిస్తున్నారని డీలర్లను ప్రశ్నించారు. యూరియా కంపెనీలు, హోల్‌సేల్ డీలర్లు తమకు సరఫరా చేసే ధర ఆధారంగానే తాము విక్రయిస్తున్నామని, దీనిలో రైతులతో నిందలు పడడం తప్ప మాకెలాంటి లాభం లేదని పేర్కొన్నట్లు సమాచారం. ఈ విషయాన్ని డీఏవో దృష్టికి తీసుకువెళ్తానని, ఇకపై ఎవరూ అధిక ధరలకు యూరియా విక్రయించకూడదని హెచ్చరించారు. ఇకపై అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు రైతులు ఫిర్యాదు చేసినా, మీడియాలో వార్తలు వచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



డీలర్లతో సమావేశమైన ఏడీఏ శేషగిరి, ఏవో శ్రీవాణి

# ఆయిల్, గ్యాస్ నిక్షేపాల సర్వేకు సహకరించండి

**అడ్వాంట్ కంపెనీ పీఆర్వో సుధీర్**

కావలి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): భూగర్భంలో ఆయిల్, గ్యాస్ నిక్షేపాల కోసం మిషన్ అన్వేషణ్ పేరుతో క్షేత్రస్థాయిలో ఓఎన్‌జీసీ వారు చేపడుతున్న సర్వేకు రైతులు, ప్రజలు, మండల తహసీల్దార్లు సహకరించాలని అడ్వాంట్ కంపెనీ పీఆర్వో దూడల సుధీర్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీ కృష్ణను కలిసి వినతిపత్రం అందచేశారు. భూగర్భంలో ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయనే ఉద్దేశంతో ఓఎన్‌జీసీ ఆదేశాల మేరకు జిల్లాలోని తీరప్రాంత మండలాల్లో సర్వే నిర్వహిస్తున్నారన్నారు. కావలి డివిజన్‌లోని కావలి, అల్లూరు, దగదర్తి, బోగోలు, విడవలూరు, కొడవలూరు, జలదంకి, కలిగిరి, వింజమూరు, దుత్తలూరు మండలాల్లో ఆయిల్ నిక్షేపాల కోసం ఓఎన్‌జీసీ అధికారులు, సిబ్బంది సర్వే చేస్తున్నారన్నారు. ఈ సర్వేకు అందరూ సహకరించేలా చూడాలని ఆయన ఆర్డీవోను కోరారు.

# ఆల్తూరుపాడుపై ఆశలు

- ప్రాధాన్యతా ప్రాజెక్టుల జాబితాలో చోటు
- రూ.733 కోట్లతో రివైజ్డ్ ప్రతిపాదనలు
- ముఖ్యమంత్రి హామీ.. ఆర్థిక శాఖకు చేరిన ఫైల్

నెల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కండలేరు నుంచి సోమశిల - స్వర్ణముఖి లింక్ కెనాల్ ద్వారా వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు అందించే లక్ష్యంగా పదిహేనేళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ పనులు మొదలుపెట్టారు. అయితే అటవీ అనుమతులు రాకపోవడంతో కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టు నిలిచిపోయాయి. ఈ క్రమంలో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కొత్త ఆలోచన చేసింది. మేర్లపాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి డక్కిలి మండలం ఆల్తూరుపాడు వరకు కాలువ నిర్మాణం జరిగింది కాబట్టి ఎస్ఎస్‌జీ కెనాల్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కండలేరు నీటిని ఆల్తూరుపాడు చెరువుకు తరలించి అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి నియోజకవర్గాలకు నీటి సరఫరా చేయాలని భావించింది. ఈ క్రమంలో ఆల్తూరుపాడు చెరువును 1 టీఎంసీ సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చాలని నిర్ణయించింది. 2018లో సుమారు రూ.280 కోట్ల అంచనాలతో టెండర్లు పిలవగా, అప్పటి టీడీపీ ప్రభుత్వం పనులు మొదలుపెట్టింది. ఆర్‌కేఎస్ ప్రాజెక్ట్స్ సంస్థ దాదాపు రూ.10 కోట్ల మేర పనులు కూడా చేసింది.

**● వైసీపీ కక్షకు బలి**

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కక్ష గట్టినట్లు ఆల్తూరుపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణ పనులను రద్దు చేసింది. 2019, నవంబరులో రివర్స్ టెండరింగ్ విధానంలో మళ్లీ టెండర్లు పిలిచింది. కడప జిల్లాకు చెందిన ఓ సంస్థ 25.73 శాతం లెస్‌కు దక్కించుకుంది. అయితే ఆ తర్వాత పనుల్లో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఎస్ఎస్ఎల్‌సీ ప్యాకేజీ 17 కింద ఆల్తూరుపాడు నుంచి మేర్లపాక వరకూ కాలువ నిర్మాణం 90 శాతం వరకూ పూర్తయింది. ఇందుకు రూ.150 కోట్ల వరకూ ఖర్చు చేశారు. అయితే ఆల్తూరుపాడును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చకపోతే ఈ కాలువ నిర్మాణం చేపట్టి కూడా వృథా అవుతుంది.

**● రూ.733 కోట్లతో రివైజ్ ఎస్టిమేషన్లు**

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ ఆల్తూరుపాడు ప్రాజెక్టులో కదలిక వచ్చింది. ఆల్తూరుపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రాధాన్యతా ప్రాజెక్టుల జాబితాలోకి చేర్చింది. ఇటీవల కలెక్టర్ల సదస్సులో కూడా సీఎం చంద్రబాబు ఈ ప్రాజెక్టుపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వ ఆదేశాలతో తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులు తాజాగా రివైజ్డ్ ఎస్టిమేషన్లు పంపారు. గతంలోనే రూ.300 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసి ఉండగా, తాజా ఎస్టిమేషన్ల ప్రకారం ప్రాజెక్టు విలువ రూ.733 కోట్లకు చేరుకుంది. ఇందులో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం ఖర్చు రూ.459 కోట్లు ఉండగా, మిగిలినది జీఎస్టీ, భూసేకరణ వంటివి ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఫైల్ ఇరిగేషన్ శాఖను దాటి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ వద్దకు చేరిందని, త్వరలోనే పరిపాలనా అనుమతులు మంజూరయ్యే అవకాశాలున్నట్లు భావిస్తున్నారు. కాగా దీనిపై టీజీపీ ఈఈ రాధాకృష్ణమూర్తి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడు తూ ఆల్తూరుపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వ ఆదేశాలతో రివైజ్ అంచనాలు పంపినట్లు చెప్పారు.